
# గ్రంథాలయ సర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము, బెజవాడ

ధాత - మార్గశిరము — జనవరి ౧౯౩౭.



సంపుటము

సచిత్ర మాసపత్రిక

సంచిక.

# ఉత్తమ గ్రంథముల కానుక

ఆంధ్రదేశగ్రంథాలయ సంఘసభ్యులై, చందాలు చెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే.

**I. గీతా భూమిక**

౧౧౮ పుటలు - స్టిఫ్ బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాలి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారి తెనుగు అనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది. పోస్టేజీ ఉచితము.

**II. వల్లూరి సూర్యనారాయణరావు, బి. ఏ., బి. ఎల్. గారిచే ప్రకటితములగు ఉత్తమ గ్రంథములు.**

పై గ్రంథములు కానుకగా పొందగోరు గ్రంథాలయములవారు దిగువ చిరునామాకు వ్రాయవలెను.

కార్యదర్శి,
ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక:" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆ యా తాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ-గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు.

---

# గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.
ప్రతినెల ౬-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయసేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫోటోలుఁపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

**హెచ్చరిక**

ఈ పత్రిక ప్రతినెల ౫-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

**ప్రకటనముల రేట్లు**

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 1[illegible]-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-[illegible]-0 |

---

వివరములకు:—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

\

ప్రోత్సహపుచ్చుటకు పోటీలు. (పోటీ) నెం. 2)

నూతనసంవత్సరపు బహుమతులు !

# రు 1000 లు గెలుపొందుడు!

1వ బహుమతి రు 600 లు (సరియైన జవాబుకు) రు 200 లు (ఒకతప్పుగలజవాబుకు)

రు 150 లు [ముందు సరియైన జవాబుపంపు స్త్రీకి] రు 50లు (ఎక్కువసంఖ్య ప్రవేశములు పంపువారికి)

ది 15—1—1937 ప్రవేశములు పంపుటకు ఆఖరు తేది. ఆధార్టీ: శబ్దరత్నాకరము

| వ. నెం | మాట | అర్థము | జవాబు | వ నెం | మాట | అర్థము | జవాబు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | కమ - - - డు | బ్రహ్మ | కమలాసనుడు | 6 | శ - ములు | బాణములు | |
| 2 | భూ - - డు | రాజులేక రేడు | | 7 | - మ్మి | ఒక చెట్టు | |
| 3 | - తి | అడుది | | 8 | - కాశము | వెలుగు | |
| 4 | - న్నంగి | పక్షివిశేషము | | 9 | ఈ - | దేశసేవకులకు | |
| 5 | మం - - ము | కవ్వము | | | | యిది సహజము | |

ప్రతియొక ప్రవేశమునకు ప్రవేశరుసుము రు1-0-0 (రూపాయి) లేక రెండురూపాయలకుమూడుప్రవేశములు.

నిబంధనలు:—మొదటిమాటమాదిరిగా మిగిలిన 8 మాటలు పూర్తిచేసి, ప్రతి తొమ్మిది మాటలు గల ప్రవేశమునకు నిర్ణయించిన రుసుముతో యెన్ని ప్రవేశములైనను పంపవచ్చును. ప్రవేశరుసుము మణిఆర్డరుద్వారా పంపి, రసీదులు ప్రవేశములతో పంపవలెను. వచ్చిన ప్రవేశములనుబట్టి బహుమతులు మారును. ఫలితములకు అణా పోస్టుబిళ్ళ పంపుడు. సరియైనజవాబు ఆంధ్రబ్యాంకిలో సీలు చేసియుంచిన జవాబుతో సరిపోవలెను.

అన్ని విషయములలోను మేనేజరుతీర్పు స్థిరము, న్యాయబద్ధము, అనుసరణీయము. మిగతా నిబంధనలన్నియు మామూలు. ప్రవేశములు, మనిఆర్డర్లు యీదిగువ అడ్రస్సుకు పంపుడు.

మేనేజరు, ది ప్యాస్టైము క్రాసువర్డు కాంపిటీషను కార్యాలయము, బెజవాడ, (కృష్ణాజిల్లా)

షరా:—బెజవాడలోనివారు వారి ప్రవేశములు రుసుము పూర్ణానందం సత్రముఎదుట బెజవాడ మెడికల్ స్టోర్సులో యీ మేనేజరుకుగాని, వారితరపున టి. అచ్యుతరామయ్యాగారికిగాని, యిచ్చి రసీదుపొందవలెను.

---

శ్రీ భ్రమరాంబామల్లేశ్వరాంధ్రగ్రంథాలయ సంఘమువారి

# సహాయనిధి లాటరీ

ఈసంఘముతరఫున లోగా టిక్కెట్టు 1కి రు 1-0-0 చొప్పున రు 1000-0-0 లు టిక్కెట్లు వసూలు పరచుటకు యేర్పరచిన లాటరీ పూర్తికానందున సగంవంతు రు 500-0-0 లను మాత్రమే వసూలుపరచి బహుమతులు కూడ సగమువంతుప్రకారమే యిచ్చుటకు యీసంఘకార్యనిర్వాహక వర్గమువారిచే తీర్మానింపబడినది. సదరు లాటరీ ది 10-1-1937 తేది ఆదివారం సాయంత్రం గం 4 లకు మన్యవర్తులైన

మ. రా. శ్రీ గుడిపాటి మల్లికార్జునరావుగారు, బి. ఏ, బి. ఎల్., వకీలు, బెజవాడ.

,, మనికొండ వెంకటనరసింహంశ్రేష్ఠిగారు, జనరల్ మర్చంట్సు అండ్ మున్సిపల్ కౌన్సిలర్, బెజవాడ.

,, దినవహి వెంకటపతిరావుపంతులుగారు, ల్యాండ్ లార్డు, బెజవాడ.

వారలసమక్షమున గ్రంథాలయభవనమున కలుపబడును. ఇంకొకొలది టిక్కెట్లు మాత్రమే భర్తికావలసి వున్నవి. విద్యాభిమానులెల్లరు ఇందుల పాల్గొని సహాయభూతులగుదురుగాక. ఇట్లు,

శ్రీభ్రమరాంబా మల్లేశ్వరాంధ్రగ్రంథాలయము, బెజవాడ, ది 5—1—37.

చుండూరు సీతారామయ్యా, ప్రెసిడెంటు.
బచ్చు వీరరాఘవయ్యా, శెక్రటరీ.

# విషయసూచిక


| | విషయము | | | పుట |
|---|---|---|---|---|
| ౧. | భగవద్గీతలోని వైశేష్య మేమి? | ... | ... | 283 |
| ౨. | నూతనరాజ్యాంగవిధానము | ... | ... | 287 |
| ౩. | నాణెములసాక్ష్యము | ... | ... | 290 |
| ౪. | విజ్ఞానవిశేషములు | ... | ... | 292 |
| ౫. | పట్టణములలో పశువధలు | ... | ... | 295 |
| ౬. | సూయాణము | ... | ... | 298 |
| ౭. | లోకవార్తాలహరి | ... | ... | 299 |
| ౮. | విజయనగరపట్భృతవార్షికోత్సవము | ... | ... | 302 |
| ౯. | మందిమనుగడ | ... | ... | 303 |
| ౧౦. | జీవకారుణ్యము | ... | ... | 305 |
| ౧౧. | ఆంధ్రదేశ గ్రంథాలయపట్టిక | ... | ... | 304 |
| ౧౨. | కాంగ్రెస్, ఖాదీ - గ్రామపరిశ్రమల ప్రదర్శనము | ... | ... | 307 |
| ౧౩. | ప్రపంచసయోజనవిద్యాసంఘము | ... | ... | 308 |
| ౧౪. | గ్రంథవిమర్శనము | ... | ... | 310 |
| ౧౫. | స్టావ్లీప్రాంతీయ గ్రంథాలయము | ... | ... | 312 |
| ౧౬. | కొవ్వూరు తాలూకాగ్రంథాలయప్రథమమహాసభ | ... | ... | 313 |
| ౧౭. | గ్రంథాలయములు - రెజిష్టర్లు | ... | ... | 314 |
| ౧౮. | ఫిలుముపుస్తకములు | ... | ... | 316 |
| ౧౯. | గ్రామపరిశ్రమలప్రదర్శనము | ... | ... | 316 |
| ౨౦. | గ్రంథాలయవృత్తాంతములు | ... | ... | 317 |
| ౨౧. | సంపాదకీయములు | ... | ... | 319 |

RSVmo1A162

# గ్రంథాలయసర్వస్వము.


సంపుటము ౧౦ | ధాత :: మార్గశిరము - జనవరి ౧౯౩౭ | సంచిక ౮



సంపాదకులు:

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.

హారేపల్లి రామచంద్రశాస్త్రి.

అయ్యంకి వేంకటరమణయ్య.


## భగవద్గీతలోని వైశేష్య మేమి?

శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.

ప్రాజ్ఞునిపగిదిని
పలికెదు భ్రమపడి;
ఎందున శోకము
పొందగ రాదో
అందే శోకము
నందగ నేలా?
ఈవును నేనును
ఈజగ మంతయు
ఎప్పుడు నుండెద;
మెందును పోము.
శైశవ మాదిగ
జర యగువఱకును
సిద్ధించెడు పలు
స్థితులనుబోలెన్
మరణం బనునది
మఱియొకస్థితియే
జడ్డముతో చేరుట
విడుచుట జీవికి
సహజం బని బుధ
సత్తము లెపుడున్,
శూరాగ్రణి! విను,
శోకము నందరు.
స్నేహము - వైరము,
శీతము - నుష్ణము,
కలిమియు - లేమియు,
కష్టము - సుఖమున్,
నిలుకడ నొందక
కలుగును; అడగును.
ఇవి యెల్లను జడ
భవమగు గుణముల్;
వీనిని సమతను
వీక్షింపంగల
జీవికె నిజమగు
చిరగతి యమరున్.

—భగవద్గీత

శ్రీ భగవద్గీతలోని వైశేష్య మేమి? ఎందుకీగ్రంథమునకు మాత్రము ప్రత్యేకప్రాశస్త్యం గలిగింది అనేవిషయం నేటిదినం ఆలోచింపదగింది. ఒక్క కారణం ఎట్టివారికైనా కనుపించకపోదు. ఇది వట్టిపురాణం కాదు; వట్టిచరిత్ర కాదు; వట్టిశాస్త్రం కాదు; వట్టికావ్యం కాదు; ఇది మానవునినడవడికను కార్యక్రమములో నిర్ణయించే మహాబోధ. కురుక్షేత్రమే ప్రపంచరంగం. అర్జునుడే ప్రతిమానవునిఆత్మ. ఆయుద్ధమే జీవితయుద్ధము. కృష్ణుడే మనలోని పరమాత్మ. ఈపరమాత్మను దేవునిగా భావించినా సరే, మనస్సాక్షిగ భావించినా సరే, అంతర్వాణిగ భావించినా సరే, ఎవ్వరికి ఏనమ్మక ముంటే ఆనమ్మకముప్రకారము భావించుకొనవచ్చు. అనుదినము ప్రతిమనిషికిని నాడు అర్జునునికి కలిగిన సందేహమే కలుగుతుంటుంది. మనచుట్టూ ఎప్పుడూ మనవారంతా గుంపులుగుంపులుగా ఉండనే ఉంటారు. తాతలు, తండ్రులు, తమ్ములు, మామలు, మరదులు, మాతలు, మిత్రులు, బంధులు, బలగము, గురువులు, శిష్యులు- ఈబంధాలు అనంతం. ఇందులో ఒకరికి మేలుచేస్తే మరియొకరికి కీడుగా కనిపిస్తుంది. ఇది యట్లుండగా తరతరాలుగా మన కేర్పడిన విశ్వాసాలు వేయిరకాలవి ఉన్నవి. విషయాలు పెద్దలు గ్రంథాలలో వ్రాసిపెట్టినారు. సంఘంలో వాడుకగా ప్రస్తావిస్తూంటారు. ఆచార్యులు ముసలవ్వలు ధర్మపన్నాలు చెప్పి, ఆలోచన చేసే జీవిని కలవరపరుస్తూనే ఉంటారు. ఒకరు చెప్పిన ధర్మం ఇంకొకరు చెప్పరు. ఒకరు నేర్పిన అర్థం ఇంకొకరు బోధింపరు. ఏసు, మహమ్మదు, శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యుడు, బుద్ధుడు, జినుడు, జోరాస్టరు, ఇత్యాది దిగ్దంతు లందరూ సిద్ధాంతాలు చేసిపోతే, వారిఅనుచరు లయిన మతాచార్యులు ఇందలిసిద్ధాంతాలలో ఒక్కొక్క సిద్ధాంతానికి ఒక్కొక్క కోటి క్రొత్తస్వరూపాల నేర్పరుస్తూన్నారు. ఇన్నిటి మధ్యను ఈ లోకములో జీవనం చేయవలసిన ఆత్మ తగులుకొన్నది. ఆలోచనచేసే ఆత్మకు ఇన్నిటిలోను సత్యం అంతో ఇంతో కనిపిస్తుంది. ఆయాత్మ వీరి నెవ్వరిని కాదనదు. కాని యింతటి అనంత స్వరూపమైన సత్యాన్ని అనుసరించే దెట్లు? అనుభవించేదెట్లు? అనునట్టి సందేహం ప్రతిజీవికి కలుగుతుంది. ఈ యనుమానాలన్నిటికిని బుద్ధిమంతులు భగవద్గీతలో ప్రత్యుత్తరం కనిపెట్టుకోగలరు. ఇందులోని జీవితసూత్రాలు చాల సరళమైనవి; సుళువైనవి; సులభముగ గ్రాహ్యములైనవి.

* * *

గీతాచార్యుడు, అంటే ప్రతిమనిషిలోని అంతర్వాణి, ఒక్కటే ఉత్తరువు ప్రతిపాదించినాడు: "వెర్రివాడా! ఎందు కెక్కడకోపోయి ప్రాకులాడెదవు? సందేహము కలిగినప్పుడు ఇతర ధర్మా లన్నిటిని వదలిపెట్టి నన్నుమాత్రము శరణుపొందవలసినది" అన్నాడు. ఇది ధర్మమార్గాలలో ధర్మమార్గం. స్వతంత్ర మార్గాలలో స్వతంత్రమార్గం. ఇది ఒకమతానికి సంబంధించేదికాదు. ఒకసిద్ధాంతాన్ని అనుసరించేదికాదు. సర్వమానవకోటి దీని నంగీకరించినది. సర్వమానవకోటి దీనికి తలయొగ్గితీరవలె. శ్రీభగవద్గీతలోని రెండవమహాసూత్రము: "అర్జునా, ప్రయత్నముసీపని; ఫలము నాయధీనము." అనినబోధ. మానవప్రయత్నమునకు ఫలము కలగడము తనకంటె మహత్తరవిస్తారమైన ప్రపంచప్రయత్నముచేత పరిమితమై యుంటుంది. తాను పిండివంట చేసుకొని తినవలెనని ఉద్దేశిస్తే . ఎరువు కుప్పవేసే ఏనాదినౌకరు మొదలుకొని తెచ్చి తనవిస్తట్లో వడ్డించే వంటలక్కవరకూ గల ఎం

దరో కార్యకర్తల ఎన్నియో కర్మలు సమకూడితేనేగాని ఆఉద్దేశం నెరవేరదు. నెరవేరినట్లు కనిపించినప్పుడు గూడ ఇన్నికర్మలు కారణంగా తయారైన వస్తువునుబట్టి తాను తృప్తిపడవలసిందే గాని తాను నిర్ణయించుకొనిన తృప్తికొలతకు సూటిగా వస్తువు తయారైనదన్నమాట అబద్ధము. తినుబండారానికే ఈవిధపరివర్తన చరిత్ర కలిగితే ఇక అనంతకోటిమెదడులొండొంటితో నిరంతరము గాచుకొంటూ సాధించే ప్రపంచకార్యాలలో ఫలము నాఆధీనమనుకొనే మానవుడుంటే వాడు నిమిషనిమిషం నరకమనుభవిస్తూ ఉండవలసిందేగాని ఎన్నడైనా సౌఖ్యం శాంతి వానికి కలిగే ఉపాయం ఉండదు. శ్రీభగవద్గీతలో ప్రతిపాదితమైనటువంటి మూడవ బోధ: "ఎల్లకాలం ప్రయత్నం నీవుచేయటం మానవద్దు. మానితివా మోక్షం నీకు లేదు." అనడం. ఇది అన్నిటికంటె చాల గొప్పబోధ. అర్జుననంతటిమహావీరుడు గాండీవము పారవైచినాడు. ప్రతిదినం ప్రపంచంలోని అనంతకోటిప్రజలకు కలుగుచుండే పనికిమాలిన వైరాగ్యం అతనికీ కలిగిపోయింది. ఇకేమిలాభం? ఇందరిని నావారిని చంపి రక్తపుకూడు తిందునా? నేనీయుద్యోగం చేయను—అని కర్మ త్యజిస్తానన్నాడు. అంటే, ప్రయత్నం త్యజిస్తానన్నాడు. ఈ లోకపుపోరాటం వదలుకుంటానన్నాడు. గీతాచార్యుడు దానికి చెప్పిన జవాబేమి? ఓహో! ఇది యేమి భ్రమ? ప్రయత్నం వదలిపెట్టడమంటే ప్రాణం, మానం, ప్రతిష్ఠ—అన్ని వదలిపెట్టడమే సుమా! ప్రపంచమంటే ఎవరను కున్నావు? మళ్లీ నీవే. నీమహత్త్వం నీకు తెలియ లేదు. తలచుకొన్నావంటే నీప్రయత్నంచేత నీవీప్రపంచాన్ని మహోత్తమంగా తీరుస్తున్నావు; నీకంటికే విశ్వరూపదర్శన మౌతుంది-అన్నాడు. అర్జునునికి బ్రహ్మాండమైన సత్యస్వరూపమైన సర్వలోకసందర్శనం కలిగింది. ప్రపంచములో తాను అణుమాత్రుడేయై పనిచేస్తూ ఉన్నా ఈ అణువుయొక్క ధర్మం నిర్వహణం కాకపోతే అంతపుట్టుకు ప్రపంచదేహంయొక్క సుందరస్వరూపం తాను చెఱిపినవాడౌననే రహస్యం విశ్వరూపదర్శనంలో అర్జునునికి వ్యక్తమైంది. ఇది ప్రతిమానవునికి తరుణోపాయమైనబోధ. నీవు ప్రయత్నం మానుకోడం, నిరంతరకృషి చేయకుండ మిన్నక కూర్చోడం—నీ కొక్కనికిమాత్రము నష్టము కలిగించేది కాదు. నీబోటిఅణువులప్రయత్నంచేత తీరుతూ ఉండే ప్రపంచజీవసుందరవిగ్రహాన్ని వికారపరచడానికి కారణభూతమవుతుంది; అందుచేత నీవునీప్రయత్నము నిలిపితివా? పతితుడవౌతావు. పడిపోయినవాడవైపోతావు. కాబట్టి సూర్యచంద్రులెట్లాకరు కోరక తమతమ ప్రయత్నాన్ని నిలుపక చేస్తూన్నారో, అట్లు నీవు నిలుపక నీప్రయత్నాన్ని చేయవలె. నీవెన్ని దేహాలెత్తినా, ఎన్నిరూపాలు మారినా, నిరంతర ప్రయత్నమనే ఈగుణం, దీనినే కర్మ అన్నా అనవచ్చు, నిన్ను విడువదు. నీవుదాన్ని విడువరాదు. అదే ప్రాణము; అదే మోక్షము; అదే సర్వం; అదే దైవము; అదే ఈశ్వరుడు.

* * *

గీతామహావాక్యాలింకా అనేకము లున్నవి. అన్నిటిని వ్రాయడానికి గాని వ్యాఖ్యానం చేయడానికి గాని ఈవ్యాసంలో అవకాశం లేదు. కాని పైన చెప్పిన సంగతులనుబట్టి సర్వసమత్వమైన మతాన్ని, అన్నిసిద్ధాంతాలవారికీ పనికి వచ్చే మూలసూత్రాలను తయారుచేసిన మతాన్ని, జాతిమతకుల వర్ణ లింగ భేదములు లేకుండా మానవజన్మ మెత్తిన ప్రతివారికి అనుసరింపతగిన మతాన్ని ప్రతిపాదించే జీవయాత్రామత

మొక్కటి ఉన్నదంటే అది శ్రీభగవద్గీతలోనే ఉన్నది. అందుచేతనే మనదేశంలో అవతార మెత్తిన సత్పురుషులు చాలమంది—ఆచార్యత్వానికి అంజలువేయునివారు కూడ—తిలకు, గాంధీ, యిటువంటివారు, ఈగీతకు తమకుతమకు తోచిన వ్యాఖ్యానాన్ని తమ అనుభవాలను పట్టి వ్రాసియుంచుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం మూలకంగాను, భారతం లోకప్రఖ్యాతమయి ప్రపంచ వాఙ్మయంలో అగ్రగణ్యశ్రేణిలో చేరడం మూలకంగాను, ఇతరకారణాలచేతను, శ్రీభగవద్గీతకు ప్రపంచములో ప్రముఖమైన స్థానం కలిగింది. ఇతర సభ్యతలవారు ఇతర మతాలవారు గీతను తరచితరచి, చూచినట్లెల్లా తమ మతగ్రంథాలతో దీనిని చేర్చుకొని, పేరుకిది ప్రథమగ్రంథ మైనా కాకపోయినా, నిజమైన తారకంగా అనుసరిస్తారనేది మావిశ్వాసం. ఇంకను గీతకును జన్మాంతరమునకును, గీతకును వర్ణవ్యవస్థకును అభేద మున్నదనే ఊహ ప్రపంచంలో ప్రబలియుండబట్టి దీనికి ప్రథమగణ్యస్థానం స్వరాజ్యమండలిలో సాధితం కాలేదని మాకు తోచుచున్నది. ఏనాడు దీనిని సిద్ధాంతాలతో ముడిపెట్టక వ్యాఖ్యానం వ్రాసుకునే మహానుభావు డేర్పడుతాడో, ఆనాడు దీని ముఖ్యసూత్రాలకు నిజమైన ప్రాముఖ్యం కలుగుతుందనీ, ఇదే ప్రపంచసంఘశాస్త్రానికి పునాదిగా అంగీకారం పొందుతుందనీ, మా ఆశ.

* * * *

ఇట్టి ఈమహత్తరమైన పితార్జితపుఆస్తిని కలిగినవారం మనం చీలికలుచీలికలు అయిపోయి సంఘాలు సంఘాలుగా ఏర్పడి వాదాలతో మిథ్యాసన్యాసాలతో కాలంగడుపుతూ నిష్కామకర్మకు నిరంతర కృషికి అపార్థాలు కల్పిస్తూ ఉండడము మనము స్మరించుకొంటే భవిష్యన్మార్గం మనకు సులలితంగా కనిపిస్తుంది. గాంధీవంటి మమాత్ముని జీవితానికి నిజమైన అర్థం స్ఫురిస్తుంది. ప్రాచ్య, పాశ్చాత్య జీవిత మంతటను లీనమైపోయి ఎల్లరమేలు నాలోచించే అతని హిందూతత్వము గ్రహించడానికి వీలవుతుంది. అతనిదనడంకూడ పొరపాటేమో? అట్టి ఆదర్శ కార్యపరులందరి స్వరూపమే గీతామృతము. పూజలతో పారాయణాలతో ప్రవచనాలతో గీతోపాసన జరుగదు. అర్జునుడు రణరంగములో నిలిచి తనరక్తములో రక్తముగా నేర్పడిన దుష్టపక్షముతో ప్రేమమయుడై కరుణాపూర్ణుడై కూడ పోరాడినట్లు నిరంతర జీవకృషి చేయనెంచినవారిహక్కు గీతామృత మనడములో సందేహం లేదు.

గీతాజయంతి వైకుంఠ-ఏకాదశితో, మోక్షమిచ్చునట్టి పవిత్రముహూర్తముతో, మార్గశిర మాసముతో, మహాతేజోయుత నక్షత్రరాశితో, శుక్లపక్షముతో, సమ్మిళిత మైనది. భగవద్గీతహృదయము ఈదేశమున చావ లేదని చూపగలుగుదుమేని—చూపగలమనియే మా నమ్మకము— స్వరాజ్యాదికములు మనకు కరతలామలకములు. ప్రపంచము మనకనన్యసామాన్యరీతిని ప్రేమబంధమున అంకితము. గీతాచార్యునిసంకల్పము ఫలించుగాక!

# నూతనరాజ్యాంగవిధానము

## గవర్నరుఅధికారములు.

శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.

రాబోవు ఫిబ్రవరి మాసములో ఎన్నికలు జరుగగలవు. ఏప్రిలు మొదటి తేదీనుండి క్రొత్త రాజ్యాంగ విధానము అమలులోనికి వచ్చును. మన రాష్ట్రమువంటి రాష్ట్రములలో ప్రజలచేత ఎన్నుకొనబడిన మంత్రులే రాజ్యాధికారమును వహింతురు. కాని వీరికి పైయధికారిగ గవర్నరు కార్యములను నిర్వహింప ఏర్పడినాడు. ఇతనికి కల యధికారములు ఇట్టివని వివరించుట అవసరము.

*　　*　　*　　*

రాష్ట్రగవర్నరులకు నూతన రాజ్యాంగశాసనముప్రకారము రెండువిధములయిన అధికారములు ఏర్పడినవి. వారి యిష్టానుసారము చలాయించునట్టి యధికారములు కొన్ని; క్రొత్తగా నేర్పడునట్టి మంత్రులసలహా తీసికొని చలాయించునట్టి యధికారములు మఱికొన్ని. మంత్రులు సలహాదారులు మాత్రము కావడముచేత ఈ రెండవవిధమైన అధికారములుకూడ నిజమునకు ఇష్టానుసారముగా నడపునట్టి అధికారములే యగుచున్నవి. శాస్త్రరీత్యా రాష్ట్ర కార్యనిర్వహణ మంతయును గవర్నరు అధికారములోనిదే. శాసనసభలును పార్లమెంటువారును ఈయాధర్మములు,ఈయావర్గపు నౌకరులు, ఈ యావిధముగా నిర్వహింపవలసినది అనగలరుగాని నిర్వహింపించువాడు గవర్నరే.

*　　*　　*　　*

రాష్ట్రగవర్నరు మంత్రులను నియమించుటకు అధికారము కలవాడు. శాసనసభలతో సంబంధములేకుండ ఆఱుమాసములు వీరిని ఇతడు నౌకరీలో నుంచవచ్చును. అంతకులోపుగ మంత్రులయిన వ్యక్తులు శాసనసభకు ఎన్నుకొనబడవలెను. నిర్బంధము ఈమాత్రమే కాబట్టి ఆఱుమాసముల కొకపర్యాయము క్రొత్తక్రొత్తవారిని రాష్ట్రగవర్నరు నియమించుకొనుచు పోవచ్చును. ఇట్లెవ్వరును చేయరని విశ్వాసము. మంత్రులను తీసివేయుటకును గవర్నర్కు అధికారి. ఇదివరలో శాసనసభకు ఎక్కువమందితో ఏపార్టీ వచ్చునో ఆపార్టీని మంత్రిత్వమునకు పిలువవలెనని గవర్నరునకు విధి యేర్పడి యుండినది. ఇప్పుడు దీనిని మార్చినారు. ఎవరు స్థిమితముగా మంత్రిత్వము నడపుకొనగలరని గవర్నరునకు తోచునో అట్టివారిని నియమింపవలయును.

*　　*　　*　　*

ఏర్పడబోయే శాసనసభలతో సంబంధములేకుండ తన జబాబుదారీమీద కార్యక్రమము కొన్ని సందర్భములలో నడపుటకు గవర్నరునకు అధికారము గలదు. (౧) దేశశాంతికి ముప్పు వాటింపకుండ చూచుట. (౨) అల్పసంఖ్యాకుల మేలుకోరయుట. (౩) పబ్లికునౌకరుల యొక్కయు, వారి సంతతులయొక్కయు మేలు కనిపెట్టుట. (౪) ఆర్థికముగ బ్రిటనుకు ఇండియాకు గల సంబంధములలో సమత్వము నిలుపుట. (౫) ఇండియా గవర్నమెంటు శాసనమునుండి దూరపరచిన ప్రాంతములను పరిపాలించుట. (౬) స్వదేశ సంస్థానములయు తదధిపతులయు హక్కులను, గౌరవములను నిలువబెట్టుట. (౭) గవర్నరు జనరలుగారిఏజంటుగ జరుపవలసిన కార్యములను జరుపుట

*　　*　　*　　*

మన రాష్ట్రములో శాసనసభలు రెండుండును. (౧) ప్రజాప్రతినిధిసభ (౨) శిష్టసభ; ఈరెంటిని సమావేశపఱచునట్టి అధికారము గవర్నరుది ఇవి క్రొత్తగ ఏర్పడిన తరువాత ఆఱుమాసములవఱకు అతడు వీనిని సమావేశపఱచ నక్కఱలేదు. తరువాతనైనను సంవత్సరమునకు ఒక్కపర్యాయము తప్పక సమావేశపఱచవలసి యుండును. ఈశాసనసభలను ఆపియుంచుటకును, ప్రజాప్రతినిధి సభను రద్దుచేయుటకును అతని కధికార మున్నది. మిలిటరిపోలీసుకుగాని, సివిలు పోలీసుకుగాని సంబంధించిన అన్నినిబంధనలను అతడే చేయుటకు అర్హుడు. ఈ డిపార్టుమెంటులకు సంబంధించిన రహస్యములను పోలీసు శాఖలోని ఉత్తమాధికారులు మంత్రులకుకూడ తెలియపఱచ రాదు. శాసనసభల ఎదుటికి గవర్నమెంటు నౌకరులు వెళ్లవలసినను, రహస్యపు రికార్డులు హాజరుపరుపవలసినను, అతని నిబంధనల ననుసరించియే జరుగవలెను. మంత్రులును గవర్నమెంటు కార్యదర్శులును గవర్నరుకు తెలియపఱచవలసిన విషయములనిర్ణయము, తద్విధానములు-అన్నియు అతని అధీనములు.ప్రభు

త్వమును తిరుగగొట్టు దౌర్జన్యపు నేరముల సంగతిలో అతని యిష్టమే యిష్టము.

* * * *

శాసనసభలు శాసనములు చేయుటకేర్పడినవి. కాని గవర్నరు అనుమతింపనియెడల ఏశాసనము కూడ అమలులోనికి రాదు. తాను అనుమతి ఇవ్వక తిరస్కరింపకున్నను, గవర్నరుజనరలు అనుమతికై శాసనమునునిలిపియుంచి పంపవచ్చును. మరియొక విశేషము. శాసనసభలు చేసిన శాసనమును గురించి తన అభిప్రాయమును తెలుపుచు సవరణలను సూచించుచు ఈరీతిగా శాసనము చేయవలసినదని మరల దానిని సభవారికి పంపివేయవచ్చును.

* * * *

ఇంతేకాదు. గవర్నరు తానే శాసనములు మూడు విధములుగా చేయవచ్చును. (౧) శాసనసభా సమావేశము కాని వేళలో ఏవిషయమునందైననుసరియే గవర్నరు తాత్కాలిక శాసనము—(దీని నేఆర్డినన్సు అందురు)-చేయవచ్చును. ఇట్టిచట్టము శాసనసభలు మరల సమావేశమైన నాటినుండి ఆఱువారములు అమలులో నుండును. అంతలోపల శాసనసభవారు దానిని అంగీకరింతురా అది గట్టిచట్టమైపోవును. తిరస్కరించుచు తీర్మానముచేయుదురా అట్టి తీర్మానము చేసిన నాటినుండి అది రద్దగును. (౨) తన జవాబుదారీమీద నడవవలసిన అన్నిపనులకు సంబంధించి నంతవరకు తాను తాత్కాలిక శాసనముచేసి అమలులోపెట్టవచ్చును. ఇట్టి చట్టమునకు ఆఱుమాసములు తప్పక ప్రాణముండును. మరిఆఱుమాసములు దానిని పొడిగించుటకును అతడు సమర్థుడు. కాని అట్లు పొడిగించునప్పుడు దానిని ఇంగ్లండులోని పార్లమెంటుయొక్క రెండు సభల సభ్యులకును అనగా ప్రజా ప్రతినిధిసభా (హౌస్ ఆఫ్ కామన్సు) ప్రభుసభ (హౌసుఆఫ్‌లార్డ్సు) లసభ్యులకు - తెలియచేయవలెను. స్వంతజవాబుదారీమీద నడవవలసిన అన్ని విషయాలకు సంబంధించికూడ తాత్కాలికశాసనములే కాకుండ శాశ్వతమైనట్టి శాసనములును తాను చేయవచ్చును. కాని ఇట్టి శాసనములు చేసేటప్పుడు గవర్నరుజనరల్‌కు వ్రాసి ఆయన సమ్మతిపొంది చేయవలసియుండును. చేసినతరువాత అట్టి శాసనమును ఇంగ్లండులోని పార్లమెంటుసభ్యులకు తెలియచేయవలెను.

తన జవాబు దారీలకు సంబంధించినంతవఱకు చట్టములు కూడ తాత్కాలికముగానైనా శాశ్వతముగానైనా గవర్నరు శాసనసభలతో సంబంధములేకుండ చేసికొనవచ్చును. వీనిని తప్పించుకొనదలచిన యెడల మనము పార్లమెంటు సభ్యులలో ఎక్కువమంది దయను పొంది వారిద్వారా తప్పించుకోవలసినదేగాని వేరు మార్గములేదు ఇదివఱలో గవర్నరుకు ఇట్టి అధికారము లేదు.

* * * *

రాజ్యము నడవడానికి మొదటి ఆధారమైన ద్రవ్యమునకు సంబంధించిన అన్నిఅధికారాలు గవర్నరుకున్నవి. గవర్నరుగారి సలహామీదగాని ఏవిషయానికైనా ఖర్చుకు డబ్బుకోరి శాసనసభచేత మంజూరు చేయించుకోడానికి మంత్రులతోసహా ఎవ్వరికిని అధికారము లేదు. ప్రతిసంవత్సరమును గవర్నరుగారి ఉత్తరువుమీద కర్చుల స్టేటుమెంటులు రెండు విధాలైనవి శాసనసభలవారియెదుట పెట్టెదరు. అందులో ఒక స్టేటుమెంటులో “కోస్తాపై చార్జీచేయబడిన” ఖర్చులు నమోదగును. అందులో (౧) పార్లమెంటువారి ఆర్డరు ఇన్ కౌన్సిలు ప్రకారము నియమితమైన గవర్నరుజీతము, బత్తెములు అతని కార్యాలయపు వ్యయములు (౨) కోస్తా ప్రభుత్వమువారు చేసేఅప్పులకు సంబంధించినవడ్డీలు, తీర్పునిధులువగైరాయెల్లవిషయములకు సంబంధించిన మొత్తములు (౩) మంత్రుల యొక్కయు అడ్వకేటుజనరలు యొక్కయు జీతములు బత్తెములు అడ్వకేటు జనరలును నియమించే అధికారము అతని జీతబత్తెములు నిర్ణయించే అధికారము అతనిని తీసివేసే అధికారము అన్ని గవర్నరువే. ఇట్టి అధికారాలు ఇదివరకు ఇతనికి లేవు. (౪) హైకోర్టు జడ్జీ జీతములు, బత్తెములు. (౫) అప్పటికి కోస్తానుండి దూరముచేయబడిన ప్రాంతముల పరిపాలనకు కావలసిన ఖర్చులు. (౬) ఏ కోర్టుగాని పంచాయతీగాని చేసిన డిక్రీ ప్రకారము “కోస్తా” అచ్చుకొనవలసిన మొత్తములు (౭) ఈ ఆక్టువలనగాని కోస్తా శాసనసభలవారి ఇతరఆక్టువలనగాని “చార్జీచేయబడిన” అన్నిఖర్చులును (ఇండియన్ సివిలు సర్వీసు, ఇండియన్ మెడికలు సర్వీసు, ఇండియన్ పోలీసు సర్వీసుల జీతములు, బత్తెములు, పెన్షన్లు, అందుకు చేర్చతగిన వాయిదావారీ మొత్తములు అన్నిటిని ఈ ఆక్టులోనే “చార్జీచేయబడిన మొత్తము”లుగా నిర్ణయించినారు). ఈ విధముగా “చార్జీ”అయిన విషయాలమీద వోటు ఇవ్వడానికి శాసనసభలకు ఏవిధమైన స్వాతంత్ర్యమును లేదు. ఇందులో గవర్నరుజీతము బత్తెములకు సంబంధించినవఱకు శాసనసభలో విమర్శించుటకుకూడ అవకాశము లేదు. (ఇదివఱకు ఈ అధికారము నిరోధితమైయుండలేదు—అలవన్సులమట్టుకైనను). ఇన్నిటిమీదను గవర్నరే అధికారియని యర్థము.

ఇంతే అనుకొనవలదు. శాసనసభలకునిలిచిన స్వల్పమైన ఆర్థికాధికారముల యందును పూర్తిగా వేలుపెట్టుటకు గవర్నరుకు అధికార మున్నది. అతని జవాబుదారీలు నిర్వహణమగుటకు ఆవశ్యకమని తో చేయెడల శాసనసభవారు వ్యతిరేకముగా వోటిచ్చి మంజూరుచేయని మొత్తములను గూడ అతడు పునఃప్రతిష్ఠించి ఖర్చుపెట్టుటకు అధికారము కలవాడైయున్నాడు. ద్రవ్యమునకు సంబంధించిన ఏమాత్రపుమార్పులున్నను ఏబిల్లుఅయినను అతనిసలహాలేక శాసనసభలలో ప్రవేశపెట్టుటకు వీలే లేదు మునిసిపల్ ఆక్టు వగైరాలలో వేసే జరిమానాలు మొదలైనవియు, లైసెన్సు ఫీజులుసర్వీసుఫీజులువగైరామాత్రముఅతనిఅధికారమునుండి ఈశాసన ప్రవేశమాత్రమునకు మినహాయింపబడియున్నది. పన్నులు హెచ్చించుట, తగ్గించుట, రాజ్యకార్యములకు అప్పుతెచ్చుట,గ్యారంటీలిచ్చుట,రాష్ట్రిఆర్థికముగాజవాబుదారి తీసికొను మరియే యితర విధమైన వ్యవహారమును చేయుట, రాష్ట్రాదాయముమీద ఛార్జీగా ఏబాపతు మొత్తమునైనను నిర్ణయించుట, అట్టి నిర్ణీతమగు మొత్తమును పెంచుట, ఈ విషయము లన్నిటికిని సంబంధించిన బిల్లు ఏదైననుసరే అతని మూలముననే ప్రవేశము పొందవలసి యుండును.

* * * *

శాసనసభలో జరుగు కార్యక్రమమునకు తగిన సూత్రములు చేయు సందర్భములో ఈక్రింది విషయములకు సంబంధించినంతవఱకు సభయొక్క అధ్యక్షుడు లేదా స్పీకరును ఆలోచించి అతడు నిబంధనలను చేయవచ్చును. (౧) అతని ఇష్టానుసారము నిర్వహింపవలసిన సర్వవిషయములు (౨) ఆర్థిక కార్యక్రమము సకాలములో పూర్తియగుటకు కావలసిన నియమములు.

* * * *

ఈ క్రిందివిషయములలో అతడు తన ఇష్టానుసారము అనుమతించిననేతప్ప శాసనసభవారు చేయు నిబంధనలను నిరోధపఱచుటకును ఆతనికి అధికారముకలదు (౧) విదేశ ప్రభుత్వములతోను, ప్రభువులతోను, చక్రవర్తికిని గవర్నరు జనరలునకును కలసంబంధములను గురించి చర్చించుటగాని ప్రశ్నించుటగాని, (౨) సరిహద్దులలోని ప్రజలను గురించిగాని రాష్ట్రమునుండి దూరముచేసిన ప్రాంతముల పరిపాలనమును గురించిగాని ఒక్క బడ్జెటు విమర్శలో తప్ప తక్కినప్పుడు విమర్శించుటగాని ప్రశ్నించుటగాని.

(3) స్వదేశసంస్థానముల ప్రభువుల చర్యను గురించిగాని వారి కుటుంబములోని వ్యక్తుల చర్యను గురించిగాని విమర్శించుటగాని ప్రశ్నించుటగాని.

ఈ విషయములలో గవర్నరు చేయునట్టి నిబంధనలకును, శాసన సభలవారు చేయునట్టి నిబంధనలకును, వ్యత్యాసము కలిగినయెడల గవర్నరుచేయు నిబంధనలే ఆచరణలో నుండగలవు.

* * * *

ఏ శాసనసభలోగాని విమర్శనయందుండు ఏ బిల్లుగాని సవరణగాని లేదా ప్రవేశపెట్టసెంచిన బిల్లుగాని సవరణగాని అతని శాంతి సంరక్షణముల జవాబుదారీకి భంగము కలుగజేయునని అతని స్వబుద్ధికి తో చేయెడల అట్టివిషయమును అపుదల చేయుటకు అతనికి అధికారము కలదు.

* * * *

ఆర్థిక సంబంధమయిన బిల్లు ఏది విమర్శనలో నున్నను దాని విషయమై విచారించుటకుగాను రెండుశాసన సభలను సంయోగపఱచుటకును, ఇతర బిల్లుల సందర్భములలో ప్రజాప్రతినిధి సభవారు అంగీకరించిన దానిని పండ్రెండు మాసములకాలము శిష్టసభవారు అలస్యము చేసినయెడల అట్టి సంయుక్తసమావేశము నేర్పరచుటకును అతని కధికారము కలదు.

* * * *

అన్నిటికంటె గొప్పయధికార మేమన గవర్నరు జనరలుగారి సమ్మతిపొందినచో అతడు ఆఱుమాసముల కాలము ఈ చట్టముక్రింద ఏర్పడు సర్వరాజ్యాంగ విధానమును ఆపివేసి, స్వయముగా పరిపాలన చేయవచ్చును. తరువాత పార్లమెంటులోని ఇరుసభలవారి తీర్మానమును తన పక్షముగ సంపాదించగలిగే యెడల మరి రెండు సంవత్సరము లీవిధముగా రాజ్య మేలవచ్చును.

* * * *

గవర్నరు పార్లమెంటు నెదుట హాజరుపెట్టుబడిన తాకీదు ననుసరించి రాజ్యమునడపవలసియున్నను, గవర్నరు జనరలుగారు స్వాధికారముతో ఇచ్చే ఉత్తరువులను కార్యక్రమమున నడపవలసియున్నను, ఈరెంటిని అతడతిక్రమించినట్లు కనబడినను, అతడు జరిపిన చర్యనుమాత్రము రద్దుచేయుటకు వీలు లేదు.

# నాణెములసాక్ష్యము

## యౌధేయ - మౌర్య - కుషానులు

## ప్రాచీన సంయుక్త ప్రజాసత్తాకములు.

దేశచరిత్రలు వ్రాయుటలో అనేక ఆధారములు వినియోగించుట కలదు. శిలాశాసనములు, తామ్రశాసనములు, వేరువేరు భాషలలో పాడుచుండిన పాటలు, పద్యములు, వేరు వేరు భాషలలో వేరువేరురీతులుగా తాళపత్రములమీద, భూర్జ పత్రములమీద, కాగితములమీద వ్రాసిపెట్టిన విషయములు, భూమిని త్రవ్వి కనిపెట్టిన శిథిలపురాదులలోని ఆయుధములు, ఉపకరణములు, గోడలు, ఇండ్లు, ఊళ్ళు, ఎముకలమీద, చెట్లమీద, రాళ్ళమీద ప్రాతకాలపువారు గీచినగీతలు, వ్రాసిన చిత్తరువులు, ఎన్నడో ఏకాలమువారో వాడుచుండిన నాణెములు-ఇవియన్నియు పరీక్షించి, ఇందులో ఒక్కొక్కటి ఎంతకాలముక్రిందట ఏర్పడి యుండవలెనో, ఎటువంటి ప్రజ లేర్పరచి యుండవలెనో అని నిర్ణయించునట్టి ప్రతిభను చరిత్ర శాస్త్రజ్ఞులు సంపాదించినారు.

### యౌధేయప్రజాసత్తాకము.

మన భారతభూమిచరిత్రవ్రాయుటయందు ఇన్ని ఆధారములను వినియోగించుకొనుచున్నాము. అది ఏమి చిత్రమో కాని క్రీస్తుశకము ఆరంభమైనదాది మూడు, నాలుగు శతాబ్దముల కాలమునకు సంబంధించిన చరిత్ర నిర్మాణమునకు నాణెములుతప్ప ఇతరాధారములు ఎక్కువగ కన్పించుట లేదు. ఆకాలమునకు చెందిన నాణెముల పరిశోధన వలన నిన్ననే డేర్పడిన అమెరికా సంయుక్త రాష్ట్రము వంటి ప్రజాసత్తాకములు వేల యేండ్లక్రిందట భారతభూమియందు వెలసినవనుట విశదమైనది. సముద్రగుప్తునినాటి 'యౌధేయ'ప్రజాసత్తాకమున శతద్రు-యమునానదుల మధ్యనున్న విశాలరాష్ట్రమంతయు ఇమిడియుండెను. ఇండియా నాణెముల పరిశోధనసంఘమువారి సమావేశమందు డాక్టరు కె. పి. జయస్వాల్ గారు ఇచ్చిన ఉపన్యాసములో ఇందును గురించి అనేకవివరములను తెలిపిరి.

ఇటీవల రోహితక పట్టణపరిసరములలోగల కోకాత్రి కోట్ అను దిబ్బలో యౌధేయ ప్రభుత్వమునాటి నాణెపు టచ్చులు ఒక వెయ్యి దొరకినవి. వీనివలన చరిత్రాంశములనేకములు బయల్పడినవి. ఇవి క్రీ. పూ. రమారమి ౧౦౦ సంవత్సరములనాడు వాడుకలోనుండినవి. వీనికి ఒక వైపున 'హస్తి-నంది' ముద్రకలదు. రెండవవైపున 'యౌధేయన-బహుధాన్యక' అనియున్నది.

### బహుధాన్యక రాజపుత్ర రాష్ట్రములు

ఈ యౌధేయులు రాజ్యమేలిన రాష్ట్రములలో రెండు ముఖ్యములని మహాభారతము పేర్కొనినది. అందు బహుధాన్యకము ఒకటి. రెండవది మరుదేశము-రాజపుత్రస్థానము. బహుధాన్యకము బహుసారవంతమైనరాష్ట్రము. ఇది రాజపుత్రస్థానమునకు పశ్చిమభాగమున యమునానదివరకు విస్తరించినది. సహరాన్ పురము జిల్లా ఇందులోనిదే. పందొమ్మిదవశతాబ్దమున ఈ జిల్లాలోని 'బేహత్' అను గ్రామములో కొన్ని యౌధేయులనాణెములు బయల్పడినవి.

మహాభారతములో మరుబహుధాన్యకరాజ్యములు ఉదహరింపబడినవే కాని, ఆకాలమున ఆరాజ్యము నేలుచుండినవారెవరైనదియు వివరింపబడియుండలేదు. ఈ శాసనములు ఈకొరతను తీర్చుచున్నవి. మహాభారతములో రోహితకము ముఖ్యపట్టణముగా నిడికొని రాజ్యమేలిన ప్రజావర్గమునకు కార్తికేయుడు ఇష్టదైవమని కలదు. దీనికి అనుగుణముగా కార్తికేయుని ప్రతిమగల మరికొన్ని యౌధేయులనాణెములు కూడ లభించినవి. ఇదిపురాతన చరిత్రకు జతపరుపవలసిన నూతనాంశము.

ఈ నాణెములవల్ల క్రీస్తుశకమునకు పూర్వము ఉత్తర రాజపుత్రస్థానమును, తూర్పు పంజాబు దేశమును, కురుక్షేత్రము వరకు విస్తరించిన దేశమంతయును అనగా శతద్రు యమునానదులకు నడుమనున్న దేశమంతయు యౌధేయ ప్రజాస్వామికముక్రింద సంయుక్త రాష్ట్రముగా నుండెనని తేటతెల్లమగుచున్నది. ఈప్రభుత్వపు పేరు శతద్రునులోయలలోని 'జోహియబార్' గ్రామమునందును, భావల్ పూర్ శిథిలములందును కానవచ్చుచున్నది.

### సాముదాయకప్రభుత్వము.

సముద్రగుప్తునికాలమునకూడ రాజపుత్రస్థానము యౌధేయ ప్రజాస్వామికముక్రిందనే యుండెను. యౌధేయులు పురాతన క్షత్రియ రాజవంశమునకు చెందినవారు. ఇప్పటివరకు బయల్పడిన నాణెములవలన యౌధేయరాజ్యముకనీసము మూడు ప్రజాసత్తాకములతో కూడిన సాముదాయక ప్రభుత్వమని చెప్పవలసియున్నది. క్రీస్తుశకము నాల్గవ శతాబ్దమువరకు, ఈ ప్రజావర్గమే రాజపుత్రస్థానమున ప్రాముఖ్యము వహించినది. ఇప్పుడారాజపుత్రస్థానమున రాజ్యమేలువారికి రాణాలనిపేరు. ఈరాణాశబ్దము రాజన్యశబ్దభవము. రాజ

న్యులు యౌధేయకాలమున ప్రజాస్వామ్యాధ్యక్షులు. ఆనాటి పోకడయే రాజపుత్రసంస్థానములందు మధ్యయుగమునకొన నగును. ప్రభుకుటుంబములలోని సభ్యులతో చేరిన సంఘములు ఈసంస్థానములను అప్పుడేలుచుండిన వనుటగుర్తింప దగినది.

'రుద్రదమనుడు' కధియవారు, కచ్ఛిరాజ్యములను క్రీ॥శ॥ రెండవశతాబ్దమున ఏలినరాజు. యౌధేయులునుఇతడునుఇరుగు పొరుగువారు; బలవద్విరోధులు; ఇట్లయ్యు 'రుద్రదమనుడు' తన 'గిర్నార్' శాసనములలో యౌధేయులు పరాక్రమవంతులైన క్షత్రియులని తెలిపెను. యౌధేయులు ఉత్తరరాజపుత్రస్థానము, అనగా భరతపురమందలి ఆరావళి పర్వతములనుండి విజయగిరి వరకు తమరాజ్యమును స్థాపింపగలిగిరని తెలుపుటకు శాసనములే ప్రమాణములు. ఉత్తర మరు రాజ్యమంతయు వీరిపరిపాలనముక్రిందనే ఉండెను. దక్షిణరాజపుత్రస్థానము మాళవప్రజాసత్తాకముక్రింద నుండెను. వీరి వంశము లేమైనవో సరిగా తెలియదు. వీరి సంతతివారు రాజపుత్రులే అయిఉందురని ఊహింపదగి యున్నది రాజపుత్రస్థాన రాజవంశముల యదార్థ పురాతన చరిత్ర యౌధేయ, మాళవముద్రికలవలననే గ్రహింపనగును.

## ప్రాచీన మౌర్యరాష్ట్రము.

ఇటీవల 'శ్రావస్తి' అను పట్టణశిథిలములలో 'సంగకాలమునాటి తామ్రనాణెములు సీసపునాణెములుకొన్ని దొరకినవి. ఇవిప్రాచీనహిందూరాజ్యములనాటి శ్రావస్తిలోనిటంకసాలయెంతచక్కగా పనిచేయుచుండినదో తెలియజేయుచున్నవి. 'సోహగుర' శాసనముల సాక్ష్యమునుబట్టి శ్రావస్తిప్రాచీనమౌర్యరాష్ట్రమునకుముఖ్యపట్టణమని తేలినది. తరువాతకూడచాలకాలమువరకు వీరిపరిపాలనముసాగెనని తెలియుచున్నది. పైనాణెములపైనున్న పలుచని నందిముద్రవలనఈనాణెములు 'నాగవాతాకుల' కాలమునాటివని ఊహింపదగియున్నది. ఇందుకనుగుణముగ అప్పటి భారసివ నాగరాజైన భావనాగుని ప్రతిమగల నాణెములుకూడ కొన్నికనిపించినవి. ఇవియునుగాక మౌర్యులనాటి కొన్ని శిథిలములనుండి త్రవ్వితీయబడిన పాటలీపుత్రనాణెములపైనున్న ప్రతిమలను పోల్చిచూచినచో నాటి వివరములు కొన్ని తేటపడుచున్నవి.

## కుషానుల యుగము.

కుషానుల పేరు పురాణములలో కలదు. ఒకానొకప్పుడు వీరు భారతదేశమును పరిపాలించుచుండిరి. బీహారురాష్ట్రము వీరిపరిపాలనము క్రింద ఉండెనని పురాణములు తెలుపుచున్నవి. ఇటీవలకాశీనగరమునశివప్రసాద్‌గుప్తగారిచే నిర్మింపఁబడిన భారతమాత ఆలయమునశ్రీ దుర్గాప్రసాద్ గారు తయారుచేసిన కుషానులనాటి హిందూదేశపటము ఉంచిరి. అశోకుని స్తూపమునకు ప్రసిద్ధిగాంచిన 'రాధియా' అను గ్రామములో కొద్దికాలముక్రిందట ఒక గ్రామస్థుడు భూమిలో రెండు అడుగులలోతున కంకర త్రవ్వుకొనుచుండ వెయ్యి రాగినాణెములుగల కుండ ఒకటి కనిపించెను. ఇవి కుషానులనాటి నాణెములు; వీనివలన కుషానుల ప్రభుత్వము 'చాంపరాన్' వరకు విస్తరించియుండెనని తెలియుచున్నది. నేపాళరాజ్యముకూడ వీరి పరిపాలనముందుండెనని ఊహింపనగు. నేపాలరాజ్యపు పూర్వచరిత్రలో ఇప్పటివరకును అంతుతెలియని నూరుసంవత్సరములచరిత్రకు ఈ నాణెములు ఆధారములుగ నున్నవి.

## కౌశాంబిప్రాంతము.

పూర్వము 'కౌశాంబి' అను పేరుగల కోసలప్రాంతమున ఏటేట క్రీస్తుశకమునకు పూర్వము ఒకటి, రెండు శతాబ్దములనాటి నాణెములు అనేకములుకానవచ్చుచున్నవి. గతవత్సరమున ఈ ప్రదేశమున అపూర్వనాణెములు కొన్ని బయల్పడినవి. ప్రసిద్ధిగన్న పురాతన శిథిలములు పెక్కులిచ్చట గలవు. వీనిచరిత్ర క్రీ॥ శ॥ ౧౨౦౦ సంవత్సరముల నాటికి విస్తరించుచున్నది.

భారతదేశ చరిత్రలో ఇటీవలి కొన్ని శతాబ్దముల వివరములు సమగ్రముగ నమూదు చేయఁబడియున్నవి. కాని ప్రాచీన హిందూయుగమునాటి చరిత్రాంశములనేకములు నేటికిని పైకిరాకున్నవి. వీనికి సంబంధించిన పరిశోధనము సల్పుటకు తొల్లింటి నాణెములును శాసనములును తప్ప ఇతరసాధనము లేవియుకానరావు. ప్రపంచమున ప్రజాప్రభుత్వములకు దారిచూపినది పశ్చిమఖండమే యనుభ్రమ యందుండువారికి ఈనాణెముల పరిశోధనలవలన ప్రాచీన భారత రాజ్యాంగవిధానములు వేలసంవత్సరములక్రిందనే ఇట్టి ఆశయములతో బాగుగనిర్వహింపబడెననియు, భారతదేశప్రాచీననాగరికతఅద్వితీయమైనదనియుబోధపడగలదు. ఇట్టి పరిశోధనముపట్ల ప్రజలును ప్రభుత్వమును ఆదరణ చూపుట ఎంతయు అవసరముకాదా? అవును; కాని ఏదీ అట్టిఆదరణము?

# విజ్ఞాన విశేషములు

## మతనిర్మూలనానికి మాయపన్నాగాలు

సోవియటు రష్యాలో ప్రజలకు మతముపై అవిశ్వాసము కలిగించుటకు అనేక మాయోపాయములను పన్నుచున్నారు. బైబిల్ గ్రంథములో ఉదహరించిన అపూర్వ చిత్రములను రసాయనశాస్త్ర సిద్ధాంతముల ప్రకారము చేసి చూపుచున్నారు.

బాబిలన్ రాజైన బెల్షెజార్ వినాశమునకు ముందు ఒక గోడమీద భావి అపజయమును సూచించుచు అగ్నితో కూడిన అక్షరములు వ్రాయబడెనని బైబిలులో ఉన్నది. ఉపన్యాసకుడు అవేఅక్షరములను ఫాస్ఫరపురంగు (ఫాస్ఫరస్ పెయింటు) తో గోడమీదవ్రాసి దీపములను తీసివేయును. చీకటిలో ఈ అక్షరములు అగ్నికణములవలె మెరయును. ఇవియే ప్రభువువ్రాసిన అగ్నిఅక్షరములని ప్రజలకు చెప్పుదురు.

గాయములను నయముచేయుటను గురించి బైబిలులో మరియొక అపూర్వచిత్రము కలదు. ఉపన్యాసకుడు ప్రేక్షకులలో ఒకరిని పిలిచి వాని చేతికి ఒక ద్రావకమును రాచి ఒక బండకత్తితో అతని చేతిమీద గాట్లు పెట్టినట్లుగా చేయును. కత్తికి రాచినద్రావకమును చేతికి రాచిన ద్రావకమును కలియగానే నెత్తురుమాదిరిగ ప్రవహించును; గుడ్డతో ఈరక్తమును అద్దగానే అది ఆగిపోవును. ఇదిగోచూడండి? కత్తికిరాచినది ఫెరిక్ క్లోరైడు ద్రావకము. చేతికిరాచినది 'అమోనియమ్ సల్ఫోసినైడ్' ద్రావకము. ఈరెండును కలియగనే నెత్తురువలె ద్రవము ప్రవహించును. ఇదే ఆఅపూర్వచిత్రము; ఈద్రవమునే ఫెరిక్ సల్ఫోసినైడ్ ,అందురు అని ఉపన్యాసకుడు వివరించును. ఈవిధముగ వారు మతముపై విశ్వాసమును నశింపచేయుటకు ఎన్నియో మాయలను పన్నుచున్నారు. మతగురువుల దుండగములను సాధించుటకిట్లు చేసిరేమో అనుకొంద మన వారికొత్తరాజకీయ ప్రణాళికలో మతసహనమును తిరిగి ప్రోత్సహించుచునే యున్నారు. ఇదేమి?

క్రైస్తవమతము క్రీస్తుచేసిన అద్భుత క్రియలపై ఆధారపడినదను భ్రమ పడమటి దేశములలో కలదు. రక్షణకర్త క్రీస్తేయని నమ్మినట్టి ఆచార మామతమునకు బునాది. కాబట్టి పాముల కాయద్భుత క్రియలు పాదామానవుడు చేసి చూపుటతో మతము నందలి విశ్వాసమును చెడగొట్టుట కవకాశమున్నది. అవతారపురుషునితో మతము నిలిచి పోలేదనియు, ప్రతి మానవుడును స్వకర్మచే దైవత్వము పొందగలడనియు, వేదాంతము చాటుచున్నది. దీనిని ప్రపంచమున వ్యాపింపజేయుటకై ప్రకృతి శాస్త్ర పాండితిచే గలుగు ప్రళయతాండవమునకు ప్రతీకారము కాగలదు.

## ఎట్టి తల్లిదండ్రులకు తెలివితేటలుగల పిల్లలు పుట్టెదరు?

ఆత్మతత్వ విద్యాపరిశోధనలలో ఇదియొక విచిత్రమగు పరిశోధనము. ఇంగ్లాండుదేశములోని ఒకతత్వజ్ఞుడుపెక్కుతరగతుల బడిపిల్లలను పరీక్షించి స్వభావసిద్ధమగు నిర్ణయములను చేసెను. ఆయన కర్షక, కార్మికుల బాలబాలికలను పరీక్షించి వారి తెలివితేటలను, మెదడుపని (బ్రెయిన్ వర్క్) చేయువారి పిల్లల తెలివితేటలతో పోల్చిచూచి, విశిష్టలక్షణములుగల తలిదండ్రులకు అవేలక్షణములుగల సంతతి సామాన్యముగ ఉద్భవింపదని నిర్ణయించెను. గుమాస్తాలు, యుద్ధభటులు, నావికులు, దర్జీపనిచేయువారు; మోటారుడ్రయివర్లు మొదలగువారిపిల్లలు. పిల్లలందరిలోను హెచ్చు తెలివితేటలుగలవారై యున్నారట. వ్యాపారములో అఖండమైన తెలివితేటలుగలిగి లక్షలకొలది గడించువర్తకుల పిల్లలుకూడ రెండవరకము వారుగనే ఉన్నారట. భోక్తర్లయు, పెట్టుబడిదారులయు పిల్లలు దాదాపు మోటురకపు కార్మికుల పిల్లలవలె నున్నారట. కర్షకుల పిల్లలుకూడ ఎక్కువ తెలివితేటలుగలవారుగ లేరట.

ఈ పరిశోధనలు చేయుటలో ప్రత్యేకము శిక్షణ మూలకముగా కలిగిన పరివర్తనమును తోసిపుచ్చి సహజశక్తులను మాత్రము వేరుపరచి నిర్ణయములను తేల్చినారు.

## రోగనిర్మూలనము అసంభవమా?

అసంభవము కాదని ఇంగ్లండు దేశపు సితిగతులు తెలియజేయుచున్నవి. ఒకప్పుడు ఇంగ్లండులో కుష్ఠవ్యాధి ప్రబలముగ నుండెను. ఇప్పుడు దాదాపు మచ్చునకైనను కుష్ఠరోగులు అచట కనబడరు. పూర్వము అచట

మశూచిజ్వరము హెచ్చుగా ఉండెడిది. ఇప్పుడు చాల వరకు నిర్మూలమైనది. మశూచివ్యాధి నివారణమునకు టీకాలువేయు ఆచారము ఇంగ్లండులో కూడ కలదు. కాని దీనిపట్ల వ్యతిరేకప్రచారము దినదినము పెరుగుచున్నది. ౧౯౨౯ వ సంవత్సరములో నూటికి ౮౮.౭ తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకాలువేయుటకు అభ్యంతరపరచిరి. ఇట్టివారి సంఖ్య ౧౯౩౮ లో నూటికి ౮౯.౯ కు పెరిగెను. ఈ విధముగ అభ్యంతరపరచువారు ప్రతిసాలున నూటికి ఒకరు చొప్పున పెరుగుచున్నారు. టీకాలకిందరు ఒప్పుకొనకున్నను ౧౯౩౪ వ సంవత్సరములో ఇంగ్లండు దేశము మొత్తము మీద మశూచివ్యాధికి గురి అయిన వ్యక్తి ఒక్కడు మాత్రమే. దీనికంతటికి వారు పారిశుద్ధ్యము పట్ల తీసికొను శ్రద్ధయే కారణమని చెప్పిన ఒప్పుకొనక తప్పదు.

## దోమలకు దురాయి.

దోమకాటునుండి తప్పుకొనుటకు మంచి ఉపాయము సింహళ ద్వీపములోని ఒక బౌద్ధసన్యాసి దుస్తులవలన తేలినది. అనాది సిద్ధమైన ఆచారము ననుసరించి బౌద్ధసన్యాసులు పసుపుపచ్చని రంగుదుస్తులను ధరింతురు. కొగల్లాజిల్లాలో మన్యపు(మలేరియా)జ్వరము ప్రబలి, అనేకులీజ్వరమునకు గురియైరి. ఆస్పత్రులలో పెక్కుమంది స్వచ్ఛంద సేవకులు రోగులకు ఉపచారము చేయుచుండిరి. వీరిలో ఒక బౌద్ధసన్యాసియు ఉండెను. ఈయన పసుపుపచ్చని దుస్తులను ధరించియుండెను. మిగతవారందరు తెల్లనిదుస్తులు ధరించిరి. వీరు మన్నెపుజ్వరమునకు గురియైరి. బౌద్ధసన్యాసి ఆరోగ్యముగనే యుండెను. ఇది చూచి కొలంబోపట్టణములో కొందరు కొన్ని ప్రయోగములు చేసిపరీక్షించిరి. దోమలు పసుపుపచ్చనిరంగుకు దూరముగనుండునని స్థిరపరచిరి.

మరికొన్ని పరిశోధనలవలనకూడ దోమలు ఎరుపురంగుపై ఎక్కువగ వ్రాలుననియు, పసుపుపచ్చని రంగుకు దూరముగ నుండుననియు తేలినది.

రాత్రికూడ వివిధమగు రంగులను తెలిసికొనగలిగినంత తీక్షణదృష్టి దోమలకుకలదు. రాత్రులయందు ధరించు దుస్తులకును, పక్కబట్టలకును, గలీబులకును పసుపుపచ్చని రంగుగుడ్డలు నుపయోగించినయెడల దోమలు దూరముగ నుండగలవు. మన్నెపుదోమలుగాని మామూలుదోమలుగాని కుట్టకుండ కాచుకొనుటకు ఇండ్లను సామానులను పసుపుపచ్చనిరంగుతో అలంకరింపవలెనని గుర్తింపవలెను. పురుగులన్నియు సూర్యరశ్మికి భయపడును; సూర్యరశ్మిరంగు తెలుపనుకొందురు. కాని అది పసుపుపచ్చయే!

## అప్పులు అరటిపండ్లతో తీర్పుట

ఎమ్. బాటా అనేవాడు జెకోస్లోవేకియా దేశములో ఒక గొప్ప చెప్పులవర్తకుడు. ఇతనికి స్పెయిన్ దేశమునకు చెందిన మొరాకో రాజ్యమందు అనేక వర్తకశాఖలున్నవి. ఈ రాజ్యమున అతనికి ఇరువదిలక్షల జెక్ క్రౌన్ నాణెములు (స్పెయిన్ దేశపు నాణెములు) అప్పులక్రింద రావలసియున్నవి. నాణెముల రూపకముగా అప్పులు చెల్లింపవద్దని ఇపుడు తిరుగుబాటుదారుల నాయకుడగు జనరల్ ఫ్రాంకో ఉత్తరవు చేసెను. ఇష్టమైనచో ఋణములక్రింద అరటిపండ్లు ఇచ్చెదమనెను. పరిస్థితులనుబట్టి బాటా అందుల కంగీకరించెనని తెలియుచున్నది. నాణెములకు కరవు కలిగినప్పుడైనను వస్తుమార్పిడికి బలము కలిగినందులకు సంతోషింపవలెను. పాశ్చాత్యనాగరికులు దీనినీతి నేర్చుకొనువరకును ఆర్థికదుస్థితితో లగదనిఇంకను ఎన్నడెరుంగుదురో!

## కాంగ్రాలోయలలో వేడినీటిబుగ్గలు.

హిమవత్పర్వత ప్రాంతము సృష్టివైచిత్రములకు ఎన్నికగన్నపట్టు. ఆ ప్రాంతమందలి కాంగ్రాలోయలలో వేడినీటిబుగ్గలు పెక్కులుకలవు. పంజాబు దేశములోని కులు, పలాంపూరు, రామగర్ జిల్లాలు ఇందుకు ప్రసిద్ధములు. పలాంపుర్ జిల్లాలోని సంసేలు గ్రామమునందున్న ఒక వేడినీటిబుగ్గ అతి పవిత్రమగు తీర్థయాత్రాస్థలము. పెక్కువేలయాత్రికు లచటికిపోదురు. ఈ వేడిబుగ్గనీరు మిగుల ఆరోగ్యకరమైనదనియు, ఇందులో స్నానముచేసిన కీళ్లవ్యాధులు నివారణమగు ననియు చెప్పుదురు. రామగర్ తాలూకాలో మరి యొక వేడినీటి బుగ్గకలదు. ఈనీరు ఒక కొలనులోనికి ప్రవహించులాగున రాతికట్టడముతో ముఖద్వార మేర్పరుపబడినది. ఇదియు ప్రసిద్ధమైన యాత్రాస్థలము. ఇందలి నీరు సలసలమరగ కాగినట్లుండి వంట చేసికొనుట కనువుగ నుండును. ఇంతటి హెచ్చు వేడితో మొదలిడి గోరువెచ్చ నీటివరకు మెట్టుమెట్టుగ ఉష్ణోదకమును ప్రసాదించు తీర్థములు మనదేశమున పెక్కులు కలవు. ఆంధ్రదేశమునందలి మహానందిక్షేత్రపు బుగ్గనీరు గోరువెచ్చదనమునకు తార్కాణము. భద్రాద్రిదగ్గరి ఉష్ణకుండము అంతకంటె హెచ్చు వేడిమికి ఉదాహరణము. ఈ వివరములు విన్నవారు పుణ్యతీర్థముల కర్థములేదందురా?

## దూరదర్శన యంత్రములు - అపరాధ నిర్ణయ సాధనములు

టెలివిజన్ (దూరదర్శన కెమేరా యంత్రము) పరిమాణములో కడుచిన్నది. ఎచ్చటికైనను సులభముగ తీసికొనివెళ్లుటకు వీలైనది. దీనివలన దూరప్రదేశములకు ప్రతిమలను పంపవచ్చును. అట్లే రప్పించుకొనుటకును వీలున్నది. దీనికొక "మైక్రోఫోను" (దూరశ్రవణయంత్రము) కూడ జతపరచినయెడల చిత్రములను చూచుటతోబాటు మాటలను కూడ వినవచ్చును. దుండగీండ్రొకచోటచేరి ఆలోచనలు చేయుచున్నారని తెలిసినతోడనే ప్రక్కయింటిలో టెలివిజన్ "మైక్రోఫోను" యంత్రములనుపెట్టి వారి చర్యల నన్నిటిని కనుగొనవచ్చును.

ఇదివరకుండిన టెలివిజన్ యంత్రములు ఇరువదియైదు మైళ్ళదూరమువరకును రూపములను ప్రతిబింబింప చేయ కలిగెడివి. క్రొత్త యంత్రములు ౨౦ మైళ్ళవరకు ప్రతిబింబింప జేయగలుగుచున్నవి. పోలీసుశాఖవారికివి అపరాధ నిర్ణయ సాధనములుగ బాగుగ నుపకరించుచున్నవి. లండన్ నగరమందలి పశ్చిమ భాగములోని స్కాట్లాండు యార్డుపోలీసు శాఖావారికి ఒక నేరస్థుని ఛాయాచిత్రము టెలివైజు చేసినంతనే వారువానినిముప్పావుగంటలో వెదకి పట్టుకొనగలిగిరి. ఇంగ్లాండులో అన్నిపోలీసు స్టేషనులలోను ఇట్టియంత్రముల నేర్పరుచుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

## ఉత్తరధ్రువమున విచిత్ర పరిశోధనలు

ఉత్తర ధ్రువమందు మంచుగడ్డలతో నిండిన కొన్ని ప్రదేశములలో చెట్లు చేమలుకాని, పశుపక్ష్యాదులుకాని మచ్చునకైననుకానరావు. అట్టి ప్రదేశములలో సోవియటు శాస్త్రజ్ఞులు ప్రకృతి పరిశోధనలు మొదలిడిరి. మంచుగడ్డ లను వారు ఛేదించి అడుగున భూప్రదేశమును పరీక్షింపగా ఆ భూమిపై వెయ్యిసంవత్సరములనాటి క్రిమి కీటకముల గ్రుడ్లు కనుపించినవి. మంచులోగడ్డకట్టియున్న వీనిని మెల కువగా పొదుగగా పిల్లలైనవి.

స్కావోశేడినో అను మంచు స్టేషనువద్ద మంచుగడ్డలలో ఇరువదిఅడుగులలోతున నీటిలో సహజముగ పెరుగు తీగమొక్కలు కొన్ని కనిపించెను. ఈ మొక్కలను మెలకువగ తీసి బాగుగ ఒలపరచినప్రదేశములలో నాటి పెంచగా కొలది మాసములలో పచ్చగ చిగిర్చిఆకులువేసెను. ఇంకను పరిశోధనలు చేయునెడల ఆప్రాంతములలో నశించినవృక్ష సంపదను సజీవముచేయుట కవకాశములు హెచ్చుగాకలవని పరిశోధకులు నమ్ముచున్నారు.

## సినిమా ప్రపంచమున నూతనసృష్టి

## సహజములగు రంగుల చిత్రములు.

వివిధమైన రంగులుపూసి చిత్రములు వేయుటవలెనే వివిధములగు రంగు వెలుగులతో ఫోటోగ్రాఫులు తయుట సినిమా ప్రపంచమున నూతనసృష్టి. "కారల్ ఫ్రియండు" అను జర్మని ఫోటోగ్రాఫరు కనిపెట్టిన నవీనయంత్రముతో ఇచ్చవచ్చిన రంగులతోనెల్ల ఫోటోగ్రాఫు చిత్రములు తీయవచ్చును. కేమేరాయంత్రమునకు ముందు రంగుల డిస్కులనుంచి ఎలక్ట్రిక్ మోటారుసహాయముతో ఇవి అవసరమైన వేగమున తిరుగునట్లు చేయబడును. వేగపు హెచ్చుతగ్గులచే కావలసిన రంగులతో ఫోటోలు తయారగును. ఎండిపోయిన ఆకులును, చెట్లుచేమలును వానివాని రంగులతో కనిపింపగలవు.

వీణా
తెనుగు మాసపత్రిక
సాలుచందా డిశెంబరువరకు రు 2 లు
తెలప్రోలు - కృష్ణాజిల్లా.

ప్రతిభ
త్రైమాసపత్రిక
సంవత్సరచందా రు 2 లు
నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

# పట్టణములలో పశువధలు

## పాలవాండ్ర క్రూరకృత్యములు.

శ్రీ ఉప్పులూరి రామశాస్త్రిగారు.

[పశుసంతతిని గురించి హెచ్చుగా విజ్ఞాన వ్యాప్తి చేయుటకు రాజప్రతినిధి లిన్‌లిత్ గో ప్రభువు సంకల్పించుటచేత ఈవిషయమునకు కొంత ప్రాముఖ్యము కలిగినది. కాని పశుసంతతిని పరిపాలింప వలసిన రైతు తనస్వానుభవములను వివరించి ప్రకటించిననేకాని రాజప్రతినిధులుకాని తదనుయాయులైన అధికారులుగాని, పత్రికా సంపాదకులుగాని చేయఁగలది చాలతక్కువ. కాఁబట్టి మాచదువరులలో ఈ విషయమును గూర్చి యేమాత్రము తెలుపఁగల వారున్నను దయచేసి తమ అనుభవములను మాకు వ్రాయుచుండవలెనని కోరుచున్నాము. వలయునంతవఱకు అట్టివ్రాతలను వినియోగించి సేవ చేయుచుందుము. [సం॥]

హిందూదేశములో మేలురకము పాడిపశువులు పల్లెలలోకంటె పట్టణములలోనే హెచ్చు కానవచ్చుచున్నవి. పట్టణములలో పాలవ్యాపారము ప్రధానస్థానము నాక్రమించుచున్నది. కాని అక్కడ పాడిపశువులపోషణము అధికవ్యయ ప్రయాసలతో కూడిన సమస్య. బాగుగా పాలిచ్చు పశువులైననేకాని వ్యాపార సరళికి లాభసాటిగానుండవు. అందుచేత పాలవాండ్రు మూల్యము హెచ్చినను మేలురకముపాడి పశువులనే ఖరీదు చేయుచుందురు. అయినను పల్లెలలోవలె పట్టణములలో పశుగ్రాసము లభించుట దుర్లభము కదా! అందువలన పట్టణములలో పశుపోషణమునకు అనేక కృత్రిమ విధానములవలంబించుచున్నారు. అక్కడ పశువులు తిరుగుటకు వలయుఖాళీప్రదేశములా ఉండవు. కట్టివేసి మేపుటకు గృహావసతియూ తక్కువ. స్వాభావమైన పశుగ్రాసమూ లభించుట దుర్లభము. ఇట్టివిషమస్థితులలో వానిని ఇరుకుప్రదేశములలో కట్టివేసి హెచ్చుపాలు లాగవలెనను ఆశతో బురబురలాడు కుడితితో వానిపొట్టలు నింపి వానిని అనారోగ్యము పాల్చేయుచుందురు.

ఇంతే గాక పట్టణములలో పాడిపశువుల పట్ల పాలవాండ్రవలంబించుచర్యలు క్రూరములు. పశుసంతతినివృద్ధిచేయవలెననెడిసంకల్పము వారికి ఇసుమంతయు ఉండదు. పాలు ఇచ్చునంతవరకు అడ్డముగుపాట్లును పడెదరేకాని, ఎండిపోయిన తరువాత ఒకరోజైనను వారివద్ద నుంచుకొనరు. వ్యాపారస్థులకు గిట్టుబాటు ప్రధానము కదా! కనుక మంచి పశుసంతతికి అవసరమగు ఆబోతులనుకాని, దున్నలనుకాని పోషించువిషయములో వారు జాగ్రత్త తీసికొనరు. పెద్దపెద్ద పట్టణములలో ఆవుగాని గేదెగాని ఎండిపోయిన మరుసటి దినమే వానిని కసాయివానికి అమ్మివేయుట తటస్థించును. ఎండిపోయినతరువాతనే కాదు; గిట్టుబాటుకొలతకు పాలు తగ్గినంతనే కసాయివానికమ్మి మరియొక పాడి పశువుకొఱకు బేరములు చేసెదరు. ఇందువలన క్రమముగా పశువులు సంఖ్యలో క్షీణించుటయే గాక వానిలో ఉత్తమ జాతికూడ నశించుచున్నది. పట్టణములకు చుట్టుపట్ల ఉత్తమజాతి పశువులు నశించినంతనే ఈ బేరగాండ్రు దూరప్రదేశములకు పోయికూడ పైని వివరించిన కారణములవననను, పాలు తక్కువ ఇచ్చినను ఎక్కువ ఇచ్చినను రైల్వేవారు పశువులకు వసూలుచేయు ఛార్జీలు ఒకటే

అగుటవలనను ఉత్తమజాతి పశువులనే వెదకి తెత్తురు. ఈవిధముగ కులముగల గొడ్లను పనిపట్టి ఏరితెచ్చి పాలవాండ్రు రూపుమాపుచున్నారు. ప్రతిసాలున బొంబాయి పట్టణములో సుమారు ౨౬౦౦౦ గేదెలును, కలకత్తా పట్టణములో ౩౬౦౦౦ గేదెలును, మద్రాసుపట్టణములో ౨౦౦౦ పాడిఆవులను వధించుచున్నట్లు సిమ్లాలోని ప్రభుత్వాధికారి నివేదకవల్ల తెలియవచ్చుచున్నది.

## 'ఫూకా' అను క్రూరకృత్యము.

పాడిపశువుల పట్ల పట్టణములలోని పాలవాండ్రు చేయుచున్న ఘోరకృత్యములలో ముఖ్యమైనది ఫూకా. ఇది ప్రాచీనభారతవర్షము గడించిన ఆధ్యాత్మిక యశస్సునకుకూడ భంగముకలుగచేయుచున్నది. పాలమ్మువాండ్రు దురాశాపరులై లేగదూడలకు తగినన్ని పాలు వదలక చంపుటయేగాక, పాడిపశువులవలనవీలగునంత ఎక్కువగ పాలు లాగుటకు "ఫూకా" చేసి పాడిపశువులను గొడ్డుపోవునట్లు చేయుచున్నారు. ఇటీవల లిన్‌లిత్‌గో ప్రభువుకూడ ఇట్టిచర్య మిగుల అవినీతికరమైనదని నిందించుచున్నాడు. 'ఫూకా'అనగా ఏమోచాలామందికి తెలియక పోవచ్చును. అది పలురకములు: ఆవుయొక్క గుహ్యాంగములోనికి గాలి నెక్కింతురు. లేదా వెదురుగొట్టములతో ఉప్పునీటి నెక్కింతురు. గేదెమర్మస్థానములోనికి దాని తోకనే మడిచిదోపెదరు; లేదా దానికి సరిపోవునంతటిలావును, మూరెడుపొడవునుగల గడ్డివెంటిని తయారుచేసి, బలవంతముగ ఎక్కింతురు. ఒక్కొక్కప్పుడు మోచేతివరకుచేతినే దోపెదరు. 'ఫూకా'చేయుట యనగా ఇదే. ఎట్టిఘోరము! లేగలు చనిపోయినను పశువులుపాలిచ్చుననియు, పాలిచ్చుకాలపరిమితి పెరుగుననియు, సహజముగ పశువులు తమలేగలకుగాను పొదుగులలో నిలుపుకొనియుండుపాలు అవి నిలుపుకొనకుండ చేసి పూర్తిగా పితుకుకొన వచ్చుననియు, కడు నీచమైన స్వార్థపరత్వముతో ఇట్టి క్రూరపనులు చేయుచున్నారు. ఫూకావలన పశువునకు అమితమగు బాధకలుగును ఇట్లు చేయుసమయమునపాపమాపశువు గుడ్లు తేలవేయును. దానివెనుకచక్రము ముడుచుకొనిపోవును. భయాతిశయమున గజగజ వణకుచు తోకచెంత కెవరైన వచ్చినంతనే అది తుళ్లిపడుచుండును. లేగలనోరుకట్టి అవి త్రాగుపాలను కూడ తామే తీసికొనవలెనని చేయు ఇట్టిరాక్షస కృత్యము ఎంతయు నిందార్హమైనది. పాశ్చాత్య దేశస్థుడగు మనరాజప్రతినిధి ఈ దురాచారమును రూపుమాపచేయవలెనని సంకల్పించినాడు బుద్ధిమంతులైనవారు ఈ ప్రచారమునకు తప్పకతోడ్పడెదరని తలపవచ్చును.

## పల్లెటూళ్లలో పాడి కార్ఖానాల ఆవశ్యకత

లిన్‌లిత్‌గో ప్రభువుగారు అధికారమునకు వచ్చినదాదిగ పాడిపశువులను వధించు ఆచారమును మాన్పుటనుగురించి ఇండియా ప్రభుత్వమువారు రాష్ట్రీయ ప్రభుత్వ శాఖలవారితో సంప్రదింపులు చేయుచున్నారు. ఈఆచారమును రూపుమాపవలెనన్న ప్రభుత్వమువారు ప్రత్యేక శాసనములు చేయవలసియుందురు. ముఖ్యముగా పట్టణములలో పాడిపశువులను పెంచుఆచారము మాన్పింపవలసియుండును. సక్రమమగు పద్ధతులపై పశుపోషణముచేయని పాలవాండ్రవద్ద పాలుకొనువారందరు ఈ పాపముల కొడిగట్టుచున్నారని గ్రహింపవలెను. ప్రపంచమందలి ఇతరభాగములలోని పట్టణములలోనివారివలెనే

17



హిందూ దేశములోని పట్టణములవారుకూడ పాలకు చుట్టుపక్కల పల్లెటూరివారిమీద ఆధారపడవలెను. ఇంగ్లాండులోని లండనునగరమునకును అమెరికాలోని న్యూయార్కునగరమునకును పాలు ఆ నగరముల చుట్టుపక్కల ౫౦ లగాయతు ౩౦౦ మైళ్ళలోపు దూరములోనున్న పల్లెటూళ్ళ పాడికార్ఖానాలవలన సప్లయి చేయబడుచున్నవి. అక్కడ ఈకార్ఖానాలు కడుశాస్త్రీయమైనపద్ధతుల ననుసరించి నడుపబడుచున్నవి. ఇటీవల బొంబాయిపట్టణమునకు ౨౦ మైళ్ళదూరమునందున్న ఒకజిల్లాలో శాస్త్రీయపద్ధతుల ననుసరించి పాడికార్ఖానాలు నిర్వహించి బొంబాయిపట్టణమునకు పాలు సప్లయి చేయుటకు కొంత ప్రయత్నముచేసిరి. కాని వీరి ప్రయత్నములు, నీతినియమములు లేని పట్టణపు క్షీరవిక్రేతలపోటీకి నిలువలేకపోయెను. నీళ్లుకలపి వీరుతక్కువధరలకు అమ్ముచుండ, మంచి పాలే యని ఎక్కువధర ఇచ్చి కొనగల సాహసమును, ఔదార్యమును, దూరదృష్టియు గల పౌరులు కనీసము ధనికులగు విజ్ఞానవంతులలోనైనను పట్టణములందుండినయెడల ఈ ముప్పు సులభముగ తప్పగలదు. మ్యునిసిపల్ ఉద్యోగులును, కొనువారును కూడ క్రమముగా తోడ్పడిననే కాని శాస్త్రీయపద్ధతుల మీద పాడి కార్ఖానాలు పెంపొందజాలవు. పల్లెటూళ్ళలో ఇట్టి కార్ఖానాలు పెంపొందించుట అవసరము.

## రైల్వేసదుపాయములు

పట్టణములలోని పాడిపశువులు ఎండిపోయిన పిదప మేతకై బయటిగ్రామములకు పంపబడునట్లు ప్రోత్సహించుటకై బొంబాయి పట్టణమున చేసిన ప్రయత్నములు కొంతవరకు అక్కరకు వచ్చినవి. ప్రతిసాలున జూన్ ౧౫వ తేదీ లగాయితు మూడు మాసములవరకు బొంబాయి నుండి బరోడా ప్రాంతములకు మేత నిమిత్తము పశువులను రైలులో తీసికొనివెళ్లుటకు వాగనుకు మైలు ౧ కి ఇదివరలోనున్న నాలుగు అణాల రేటునుండి మూడుఅణాలకు బి. బి. అండు సి.ఐ. రైల్వేవారు తగ్గించిరి. ఈఏర్పాటు ౧౯౩౫ సంవత్సరములో చేయబడినది. ఇందుకు ఫలితముగా గతసంవత్సరములో బరోడాప్రాంతములకు మేతనిమిత్తము ౩౩౯౯ పశువులు పంపబడియుండగా ఈసంవత్సరము ౯౨౩ పశువులు ఎక్కువ పంపబడినవి. మరియు బొంబాయిపట్టణములోనిపశువులను వధించుశాలలలో గేదెలను వధించుటకు ప్రత్యేకపుపన్ను గేదెొకి రు౧౫లకు పెంచబడినది. ఈరెండుకారణములవలన బొంబాయిలో గేదెగొడ్లవధ ౨౬౦౦౦ నుండి ౧౬౦౦౦ లకు తగ్గినది. మద్రాసు కలకత్తా పట్టణములలో కూడ ఇట్టి ప్రయత్నములే. చేయుచున్నారు; కాని సగముసగము శాసనములు తృప్తికరమగు ఫలితముల నీయజాలవు. ప్రజలు అందోళన సలిపిననే గాని ఈసమస్యలు కార్యరూపమును దాల్పనేరవు.


# ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయక సచిత్ర వైద్యమాసపత్రిక.

•మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతశక్తి, మొదలగువాని సహాయమున రోగములను కుదుర్చువిధాములను తెలుపును. చందాదారులకు ప్రకృతివైద్యపుస్తకములన్నియు తగ్గింపుధరల కియ్యబడును. చందా రు ౩ లు,

# సూ యా ణ ము

'క శ్చ న'

[పేరు వలదను నాపండితమిత్రులొకరు వ్రాసిన యీ విమర్శనము మాకు దీ ౪-౧౨-౩౬ తేదిని చేరినది; అందు వలన ౫ తేదిని వెలువడిన మాడిసెంబరుపత్రికలో వెల్లడింప వీలు కాదయ్యెను. పిదప దీ ౧౨-౧౨-౩౬ తేదీ ఆంధ్రపత్రికలో 'సూయాణము శబ్దార్థవిచారము' బ్రహ్మశ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు వ్రాసినది పడినది. దానికిని దీనికిని పోలిక కలదు. సూయాణమునుగూర్చి విమర్శింప పండితులను వేఁడినాఁడను కాన దానినిగూర్చి వ్రాసినపండితుల నందఱను అభినందించెదను. తక్కిన దెల్ల తరువాత చూచుకొందము. మారేపల్లి రామచంద్రశాస్త్రి]

'సూయాణ'శబ్దము నర్థముగూర్చి నేను గనుఁగొనఁగల్గిన దిది:—బసవపురాణమున

"ధ్వనియింప నల్లన తాటనవుచ్చు
చును సువిధానంబు సువిధ నముచు"—

అని తృతీయాశ్వాసమునఁగలదు. ఇక్కడ 'సువిధానము' హెచ్చరిక పలుకు. సూయాణము 'సువిధానము' వికృతియగునేమోయనితోఁచినది. శబ్దమణిదర్పణమున సూచీయానశబ్దవికృతి సూయాణమనియుండుట (పరిషత్పత్రికలో శ్రీనారాయణశాస్త్రిగారు వ్రాసినదానిఁబట్టియే) యాకళించినపిదప, తొల్లటినాతలంపును దలఁగ నిలిపి, కన్నడమునఁ గనుఁగొన సాగితిని. సంస్కృత కర్ణాటములందు దండిపండితులు మదాసు యూనివర్సిటి రిసర్చి కన్నడపండితులు మిత్రులు-శ్రీమాన్ - శేషయ్యాంగారు ఈ క్రింది ప్రయోగముల నెత్తియిచ్చిరి.

క. కట్టిదసూయాణద మేల్
కట్టో నవపదదమణివితానమొ పెఱద
ళిట్టవరోప (హా?) మొదిటకెనె
దిట్టిగె చెల్వాయ్తు నభదొళమరాగమనం.
చంద్రప్రభపురాణము ౧౨ అశ్వాసము-

ఇందు ఆకసముననుండి యవనికి దేవత లవతరించుట వర్ణితము. అది 'కట్టినసూయాణపుమేల్కట్టో' అన్నట్టున్నది. ఇక్కడ సూయాణ మనఁగా సూదికుట్టుతో చేయు బుటేదారిపని. సాలువులు మొదలగు విలువగల వింత వస్త్రముల యంచులందుఁ జేయు చేతిసూదికుట్టుపని అని యర్థము సంగతమగును. చేతకుట్టు వింతపనిగల మేలుకట్టో (చాందినీయా)-అని పైపద్యము ప్రథమచరణమున కర్థమగును. అది వింతవన్నెల వలువలు నగలుగల దేవతల నాకసమునఁ జూచి చేయునుత్ప్రేక్ష. మఱియు,

మ. సముదాయం మెఱియల్కె వేళ్పుమ కథా
విస్తారదొళ్ వర్ణన
క్రమమో యారమనాల్దు దళ్ళిసిస వే
ళ్కుం వృత్త వృత్తక్కె భా
వ మొడంబట్టిర వేళ్కు మొందె తెఱ నా
యాసక్రమం కావ్యమం
సమె వంగం సమె వంగ ముజ్జళిప సూ
చీయానమంచీనమం.

అనంతనాథపురాణము, కృత్యవతిగణిక.

ఇందును, కవిత్వపుపరిశ్రమము బుటేదారీపరిశ్రమము సమమయినవని చెప్పుటవిషయము. 'సూచీయాన'మనియిక్కడ సూయాణపుమూలరూపము గలదు. అర్థము రెండింటనొక్కటే యనఁదగును. సంస్కృతమున, నిఘంటువులలో, 'సూచీయానము' కానరాలేదు గాని,—'సూచీవాన' పదము వామనునికావ్యాలంకారసూత్రములలోఁగలదు. అక్కడను 'సూదికుట్టుపని'యే యర్థము. 'వైయాకరణఖసూచి' యను సంస్కృతలోకోక్తిలో, 'ఖసూచి'కికూడ ఇట్టి యర్థము 'ఆకసమునుకుట్టువాఁడు'అని యగునేమో యని నాసంశయము.

తిక్కనసోమయాజులవారి ప్రయోగమునఁగూడ "తగునాజ్ఞ సూయాణముగ నొనరించె మంచిగ నేల నాలుగు చెఱఁగులందు" నేలనాలుగుచెఱఁగులనఁగా నేల (యనువస్త్రము) చెంగులునాలుగు అనీ, 'సూయణము'అంచు బుటేదారీపని అనీ యర్థము సనిపడునుగదా! మంచియర్థ మింతకు మించి తెలియనయ్యేనేని ప్రాజ్ఞులు వెల్లడింపఁగలరు.

---

## బయలుపడని గ్రంథాలయములు

మేన్చస్టరు ప్రధాన గ్రంథభాండాగారియగు ఎల్. స్టాన్లీజాస్టుగారు ఇటీవల మార్గేటులో జరిగిన గ్రంథాలయ సంఘమహాసభలో మాట్లాడుచు ఇట్లు తెలిపిరి:

"ఇప్పుడు ప్రపంచమందున్న గ్రంథముల సంఖ్య ౨౫౦ లక్షలు; ప్రతిసాలున మొత్తముమీద ౨౫౦ వేల గ్రంథములకు ఎక్కువగ ప్రచురింపఁబడుచున్నవి. ఆసియాలోని కొన్నిగుహలలో ఇప్పటికిని బయలుపడని గ్రంథాలయము లున్నవనుట కేవలము కథకాదు. చైనానుగురించి పాశ్చాత్యులు ఇప్పటివరకును ఎఱుఁగని చరిత్రాంశములు అనేకములు కలవు."

# లోకవార్తాలహరి

## ఎనిమిదవఎడ్వర్డు భోగియా? త్యాగియా?

ఎనిమిదవ ఎడ్వర్డు తనబ్రిటిషుచక్రవర్తిత్వ పదవిని త్యజించినాడు. పైకి కన్పించు కారణము తాను వలచిన స్త్రీని వివాహమాడుటకు చక్రవర్తిత్వపదవి అడ్డువచ్చుటే. బ్రిటిషుజాతికి ప్రభువుగా నుండదలచుకొనినవాడు పెండ్లివిషయములో జాతియొక్క గౌరవప్రతిష్ఠలను నిలుపనైనను నిలుప వలెను, చక్రవర్తిత్వము మాననైనను మానుకొన వలె నని బాల్డ్విన్ను మంత్రి గట్టిపట్టు పట్టినాడు. ఎడ్వర్డు వలచినసతి నేటిచక్రవర్తుల కాదిపురుషుడనదగినవిల్లియం విజయుని బలగములోనిసంతతిదట! ఆమె అమెరికాలో పుట్టినది. సాదాప్రజలలో నొకతె. అమెరికాలో సాదా ప్రజలేతప్పప్రభువు లనువారుఎచటను లేరు. ఈయమ ఆ దేశాచారము ప్రకారము వివాహములుచేసికొనినది. ఆ దేశాచారప్రకారము ఇరువురతో విడాకు లందినది. ఇరువురును బ్రతికియున్నారు. అందులో మొదటివాడు ఈమెకు మంచి సత్ప్రవర్తనపత్రమునిచ్చినాడు. తాము వేరుపడుటకు తమయిరువురయందు కలిగిన దోష మేమియు లేదనినాడు. భార్య భర్తను విడిచి మరియొకనిని చేసికొనరాదను మహత్తమాచారమున కలవాటుపడినమనకు ఎడ్వర్డుచక్రవర్తి చేసిన పనియొక్క గొప్పదనము అర్థమగుట కష్టము. భోగము నాశించి అతడు పదవినిమానుకొనినాడని సంకుచిత దృష్టితో ననువారు మన దేశములోను నుండగలరు. కాని పడమటి దేశాల ఆచారమెరిగినవారీపదవీనిరాకరణమున మహాత్యాగము కలదని యంగీకరింపక తీరదు. సాదా మానవునికి గల స్వాతంత్ర్యము బ్రిటిషు చక్రవర్తి కేల యుండ కూడదని ఎడ్వర్డు తన జీవితమునందలి యీదృఢప్రతిజ్ఞచేత ప్రశ్నించినాడు. ఇదివరలో ఈమహాపురుషుడు చూపించిననిరాడంబరత యితనిని పాశ్చాత్యప్రపంచమునకు ఆదర్శపురుషుని గావించినది. బ్రిటిషు చక్రవర్తి కుమారుడుగా నున్నప్పుడితడు సాదానావికవృత్తి నడపినాడు. సాదాజవానుకూలివానియుడుపులను ధరించినాడు. ఆ దేశపుకూలివారు లాగునట్టి రిక్షాను లాగినాడు. కట్టెలు కొట్టినాడు. రాజైనతరువాత గుంపులలో దూరి నడచినాడు. తిండికిలేని కూలివారల వీథులలోనికి ఇండ్లలోనికి దూరి వారితో కలసిమెలసి తిరిగినాడు. వారికష్టసుఖములు తెలిసికొనినాడు. వారికి మేలుచేయక యుండుటకు మంత్రులకు సాధ్యము కాలేదు. ఇట్టికార్యములు అనుదినము చేయసిద్ధపడిన వానిని పూర్వాచారసంరక్షకులగు బాల్డ్విన్ను తెగవారు రాజ్యపీఠమున జూచి ఆనందింపగలరా? తనభార్య వలన కలుగుసంతానమునకు రాజ్యముగాని తన భార్యకు చక్రవర్తిని బిరుదముగాని వలదని అతడు నిస్సంకోచముగా తెలియపరచినను విందురా? సత్పురుషుడు మరియేమి చేయగలడు? తమ్మునిని తల్లిని బంధుగులను ప్రేమపూర్వకముగా సంప్రతించి చక్రవర్తిత్వమును స్వహస్తనిర్ణయముగా తమ్మునిస్వాధీనముచేసి తన్నను సరింప నెంచిన మహాప్రజ, బీదసాదలు, కోట్లకొలది ఉన్నను పార్టీని లేవదీసిపోరాటము కల్పింపక తనంతటతానే విదేశములపాలైనాడు. అతని అంత్యసందేశ మందరను ముగ్ధులను చేసినది.

## ఆఱవ జార్జిచక్రవర్తి.

ఆఱవజార్జిచక్రవర్తి అనుభవ శాలియని సుశిక్షితుడని సత్పురుషుడని అదృష్టవంతుడని త్యాగమూర్తియగు అన్న యెడ్వర్డే నిరూపించినాడు. మరియొక దేశమున మహావిప్లవముగా పరిణమించి యుండవలసినవిషయ మీ సోదరుల ప్రేమబంధము చేత, ఇంగ్లీషువారికార్యపరత్వము చేత చల్లని పరిణామము నందినది. అన్నకు 'విండ్జరు ప్రభు'వను బిరుదము నిచ్చి ఆఱవజార్జి తన యనురాగమును సూచించినాడు. ఇందు కృతజ్ఞత కూడ నిమిడియున్నదనిన దోషము కాదు. జార్జి ప్రభువు కిరీటధారణోత్సవ మీసంవత్సరమున జరుగగలదు.

## నాల్గుమస్లిమురాజ్యముల స్నేహబంధము.

తుర్కీ, ఇరాక్, ఆఫ్ఘనిస్థానము, ఇరానులు స్నేహబంధమును కల్పించుకొనినవి. అనగా మన పశ్చిమోత్తరపుసరిహద్దులలోనుండి అయిరోపావరకునుగలమస్లిముప్రభువులు స్వసంరక్షణకై పరస్పరము సఖ్యముతో మెలగుటకు తీర్మానించుకొనినారు. ఇట్టి స్నేహబంధపు తీర్మానము ప్రపంచమునందలి రాజకీయపరిస్థితులనుబట్టి యవసరమైనదని వీరి యభిప్రాయము.

## దక్షిణఅమెరికారాష్ట్రముల స్నేహబంధము.

దక్షిణఅమెరికాలోనిఅన్నిరాష్ట్రములును - గ్వయానాతప్ప- ప్రజాసత్తాకములు. శాంతిస్థాపనకు ముఖ్యసూత్రమొక్కటి అమలులోనుండవలెనని వీరందఱియభిప్రాయము. ఏరాష్ట్రము గాని మరియొకరాష్ట్రముయొక్క విదేశ స్వదేశ సంబంధములతో జోక్యముకలిగించు కొనరాదనుట ఈసూత్రము. ఎవరికి వారు వారివారి అనుకూలత ననుసరించి జీవించినయెడల జగడములు కలుగవని దీనియర్థము. ఈఉద్దేశము దృష్టియందుంచుకొని దక్షిణఅమెరికారాష్ట్రములు ఇరువదియొక్కటి అందరయంగీకారముతో ఒక సమాధానపత్రమును వ్రాసికొనినవి. అందులో పైసూత్రమును నిర్వచించినారు. తమలో నెవ్వరైనను దానినతిక్రమించినచో వెంటనే సంప్రతింపులు జరుపుకొనవలెనని నిశ్చయించినారు. అమెరికాలో యుద్ధము సంప్రాప్తమైనా, అమెరికా బయట యుద్ధము సంప్రాప్తమై అందుచే అమెరికాశాంతికి భంగము కలుగునట్లుండినా, ఈ రాష్ట్రములవారేకమయి సంప్రతించుకొని శాంతి సంరక్షించేయుపాయము చేయవలసిన దని ఇతర సూత్రములు నిర్వచించుచున్నవి. దీనియర్థ మేమి? జెనీవాముఖ్యస్థానముగాగల ఐరోపాసర్వరాజ్యసమితివలె ఇది అమెరికాసర్వరాజ్యసమితి; మానవహృదయమును ఏలు నట్టి 'శాంతి', ఈనాటి రాక్షసమారణయంత్రములయుగములో తనరాజ్యస్థాపన కావించుకొనుటకు పడునట్టి అనేకపాట్లలో నిదియు నొక్కటి అనవచ్చును. ఈ సమితివారు తాము పరస్పరము అవలంబించవలసిన ఆర్థికనీతినిగూడ విమర్శించుకొనుటచేత ఈ సమితి కొకనూతనబలము సమకూరిన దందురు. ఒకవైపు ముస్సోలిని శాశ్వతశాంతి యనుమాట వట్టిపిచ్చియని కేకలు వేయుచుండ మరియొకవైపు శాంతిసంరక్షణోద్దేశముతో సమాధానములు సమితులుఏర్పడుచునేయున్నవి. జర్మనీయొక్కయు ఇటలీయొక్కయు ఫేసిజమునకు ఎదురొడ్డవలసి ఇతర రాష్ట్రములు అనంతముగా మారణశక్తులను పెంచుకొనుచే గూడ శాంతినే కోరుచున్నామని రుష్యాముఖమున,

ఫ్రాన్సుముఖమున, ఇంగ్లండుముఖమున చాటు చునే యున్నవి. ఇది సృష్టిక్రమములోని పరమచిత్రము; ఇంకను పుట్టనియట్టిభావిమానవ సౌభ్రాతృత్వమునకు అరుణోదయము; పరమేశ్వరునిచిద్విలాసము.

## రుష్యాదేశపుటుత్తరపురైల్వే:

ఆర్థిక సాంఘిక పరివర్తనములచే నేడు సర్వప్రపంచపుదృష్టి నాకర్షించి జర్మనీనియంతకును జపానునకును కంటిపుండైన రుష్యారాష్ట్రము యూరపు ఆసియా ఖండముల యుత్తరభాగము నంతటిని ఆవరించినది. ఇంతటిరాష్ట్రమున రాకపోకలకు పడమటినుండి తూర్పునకు ఆచివరనుండి ఈచివర కొకరైల్వేమాత్రి మిదివరకు కలదు. అది దక్షిణ ప్రాంతములకు మాత్రము పనికి వచ్చునది. ఇప్పు డుత్తరప్రాంతములకు పనికివచ్చునట్లుగా మాస్కోనుండి వ్లాడివస్టరు వరకును మరియొక రైల్వే పూర్తిచేసికొనినారు. అచ్చట గొప్ప రేవేర్పడుచున్నది రుష్యాజపానుసంబంధములలో రుష్యాకు ఈ క్రొత్తరైల్వే మహత్తమమగుసౌకర్యమును ప్రసాదించగలదు.

## స్పెయినులోనిపోరాటము:

స్పెయినులోనిపోరాటముయథాపూర్వముగా జరుగుచున్నది. మేడ్రిడ్‌పట్టణపు ముట్టడి యే ప్రముఖస్థాన మాక్రమించియున్నది. ప్రభుత్వపు సేనలు చిన్నిచిన్ని విజయములను పొందుచున్నట్లు ప్రకటనలు తెలుపుచున్నవి. క్రిస్టమసు పండుగలలో తాత్కాలికముగా శాంతి నెలకొల్పుకొనుటయందు బాస్కుజాతీయవాదులు తిరుగుబాటుదారుల పక్షము వారే యయ్యు ఉత్తరస్పెయినులో పరిశ్రమచేసినారు. ఇందు మూలకముగా ముందుకు అంతఃకలహ మాగి శాంతి సమకూరవచ్చునని ఆశలు కలిగినవి. ఏమిజరుగునో ఇప్పుడు చెప్పరాదు. ఫేసిస్టువాలంటీర్లు దిగుమతియై తిరుగుబాటుదారులకు తోడ్పడుచుండుట దారుణమని స్పెయినుప్రభుత్వపక్షము ఘోషించుచున్నది. రుష్యావారి నావలను తిరుగుబాటుదారులు పట్టి శోధించుట, గుండ్లకు గురిచేయుట జరుపుచునే యున్నారు. స్పెయినువిషయములలో ఏవిధమగు జోక్యమును ఇతరులు కల్పించుకొనరాదని ఇంగ్లండు ఫ్రాన్సులు ఇప్పటికిని ప్రయత్నించుచున్నవి. అచట శాంతి నెలకొల్పుటకు మధ్యవర్తిత్వము పూనవలసిన దనియు ప్రజలలో నోక్కొక్కరివోటు తీసికొని రాజకీయవిధానమును నిర్ణయింపించు షరతుతో రాజీకుదుర్చవచ్చుననియు ఇంగ్లండు ఫ్రాన్సులు చేసిన సలహాలను జర్మనీ ఇటల పోర్చుగలులు అంగీకరించ లేదనియే చెప్పదగి యున్నది. ఇటలీ ఇచ్చిన ప్రత్యుత్తరము చక్కగా వ్యతిరేకమనియేయనవచ్చును. తిరుగుబాటుదారులు ఇప్పటికే స్పెయినులోని అధికసంఖ్యాకులఆమోదమును పొందినారని యిటలీ తలంచుచున్నదట!

## చీనాలో అంతఃకలహము:

జపాను రాజనీతి కారణముగా చీనాలో అంతఃకలహములు చెలరేగుట కారంభమైనది. 'సియుయర్న్'అను నది చీనాలోనిపశ్చిమోత్తరపు పరగణా. ఇచ్చట రుష్యాకమ్యూనిస్టులప్రాబల్యమెక్కువ. ఈ పరగణా కానుకొని ఇన్నరు మంగోలియాకలదు. ఇచ్చట జపానువారిప్రాబల్యమెక్కువ. ఇన్నరుమంగోలియావారు సియుయర్న్ పరగణామీదికి దండెత్తినారు. కారణము

కమ్యూనిస్టుబలము నణచవలెననియే. జపానువారును వారిచెప్పుచేతలలో మెలగే మంచుకో స్వతంత్రరాష్ట్రమువారును ఇన్నర్ మంగోలియా ప్రవర్తనను సెబాసనినారు. ఎంతోకాలము చీనాలో సర్వవిధముల ప్రవేశము చేయుచు అధికారమును బాచికొనుచుండు జపానువారిమీద వెంటనేయుద్ధము ప్రకటించవలసినదనియు కమ్యూనిస్టులతో సఖ్యము చేసికొనవలసినదనియు జాతీయసేనానాయకులు చీనారాజ్యాధ్యక్షుడగు షియాంగ్-కై-షెక్‌ను తొందరపరచినారు. అతడాపనికి పూనలేదు. జాతీయసేనానాయకులు అతనిని పట్టుకొని సియాన్‌ఫూలో నిర్బంధమున పెట్టినారు. నాన్కింగుప్రభుత్వమువారు దీనిని ప్రభుత్వముమీదతిరుగుబాటుగా గణించి తమసైన్యములను ఎదుటిసేనానాయకుడగు చాంగ్-సూ-లియాంగుమీదికి సియాన్‌ఫూవైపునకు తరిమినారు. పోరాటము కొంతజరిగినది. సంధిప్రయత్నములైనవి. షియాంగ్-కై-షెక్ విడుదలైనాడు. ప్రతికూల నాయకుడు పొరపాటు జరిగినదని ప్రకటించినాడు. సైన్యములకు జీతబత్తెములు చెల్లలేదని షియాంగ్-కై-షెక్‌ను తాము నిర్బంధించితిమనియు దోషము షియాంగ్-కై-షెక్‌ది గాక క్రింది ఉద్యోగస్థునిదే అగుట తెలిసినందున తన కేవిధమైన వివాదములేదనియు ప్రకటించినాడు. తనయందు దోషమున్నయెడల విచారించి ఏమి శిక్ష వేసినను అంగీకరించెదనని తెలిపినాడు. విచారణసంఘమేర్పడినది. ప్రభుత్వమువారు తమయాజ్ఞలేనిది విదేశవిషయములలో ఏఅధికారియు ఏవిధమైన జోక్యమును కల్పించుకొనరాదని గట్టిప్రకటన చేసినారు. వీరిప్రకటనకును ఎదుటినాయకుని సమాధానమునకును అతుకుట కనిపించుటలేదు. ఎట్లైనను చీనాలో తాత్కాలికముగ శాంతి అమరినది.

# శ్రీ విజయనగర షట్ఛతవార్షికోత్సవము

కడచినమాసము 25 వ తేదిన శ్రీవిజయనగరషట్ఛతవార్షికోత్సవము హంపీక్షేత్రమున జరిగినది. హిందూమహాసభాధ్యక్షులగు డాక్టరు మరుట్కోటియను నామాంతరమున సుప్రసిద్ధులైన శ్రీ శ్రీజగద్గురుశంకరాచార్యులవారు అధ్యక్షతవహించిరి. ఆఱునూర్లసంవత్సరములనాడు నిర్మితమై రెండు శతాబ్దములకాలము అఖండవైభవమున హిందూధర్మమును ఆర్యనాగరకతను పోషించి సంస్కృతభాషతో సమముగా తులదూగునట్లు ఆంధ్రకర్ణాటకద్రావిడములను పెంపొందించిన మహాసామ్రాజ్యశిథిలముల మధ్య సమావేశమున నిలిచి ఒకవైపొక చిన్నకన్నీరు రాల్చి మరియొకవైపా విషాదమునే వీరరసోత్పాదకసంవేదనగా మార్చుచే కవిత్వముల శిల్పముల చిత్తరువుల వేదాంతముల మహోద్దేశమని ఈ సర్వసంగపరిత్యాగి శ్రీకృష్ణుని గీతానుసారమును వినువారల వీనులకువిందగునట్లు వెదజల్లినాడు. తాను కర్ణాటకజననమందియుండుటబట్టియు ఆసామ్రాజ్యమును దీర్చిన విద్యారణ్యుల శిష్యకోటిలోనివాడగుటనుబట్టియు తన్నధ్యక్షత వహింపుడని కోరినందులకు కృతజ్ఞుడు దానగుట సూచించుచు గూడ కర్ణాటకులకు ఇతడిచ్చినసందేశము వారు మరువకుండుట భావిభారతభాగ్యోదయమున కత్యవసరము. ఈగుణములచేతనే తనయధ్యక్షత నిర్ణయమైయుండెనేని తానధ్యక్షుడగుట కనర్హుడేయని అతడు ప్రబోధించినాడు. తాను కర్ణాటకపుత్రుడైనను భారతీయపౌరుడు. తాను శ్రీ శంకరాచార్యవిద్యారణ్యులశిష్యుడైనను శ్రీరామానుజ మధ్వవల్లభాది ఆచార్యులయెడల సమగౌరవము కలవాడు. అది తానధ్యక్షుడగుటకు కలహక్కు. ఇవి యతడు స్పష్టముగా చెప్పినపలుకులు కర్ణాటకులు దీని యంతరార్థమునుగ్రహించియుందురేని ఈయుత్సవమును కర్ణాటకమాత్రము గావింపక సర్వభారతసమత్వనిరూపకముగావించియుందురు. శ్రీకృష్ణదేవరాయలను ప్రపంచపీఠమున కెక్కించియుందురు.

# మందిమనుగడ II

శ్రీమారేవల్లి రామచంద్రశాస్త్రిగారు

## ౫ వ తల్లి తెగ:

ఈ తెగకు పెద్దగా ఉండుగ్రహము బుధుఁడు. ఈతెగవారు చేయవలసినపెద్దపని డెందమును పెంపొందించుట. ఎఱుకగాము తన మేలిచూపులను ఈ తెగ పుట్టినపుడు పఱపె.

౧౦ లక్షలయేండ్లక్రితము వైవస్వతమనువు అట్లాంటియను తల్లితెగలోని ౫ వ పిల్లతెగనుండి కొందఱను ఎన్నుకొని, చెడని మడినేలకు వారిని కొనిపోయె. ఈతెగను తయారుచేయుటకు అతఁడు లక్షలకొలఁది యేండ్లు పాటుపడె. మిక్కిలి మంచిపనులు చేయింప అసురులను అక్కడకు చేర్చె. మేటితెలివికాఁడును, మంచినడత కలవారిని, తాను అమర్చినమేనులలో అవతరింప కోరె. ఈ తెగకు కావలె ననుకొనినఅచ్చు సరిగా అమరినపుడు ఈతెగవారిని అతఁడు తెన్ వైపుగా నడి-ఆసియాకు నడపె; అక్కడనుండియే దీని పిల్లతెగలు పైనాడులకు వెడలె.

బామియన్ బొమ్మలలో ౫ వది ఈ తెగవారిపొడవు తెలుపును.

ఇది ౫ వ తల్లితెగకాన, ఇందుమేనికి ౫ వ పస అగు తావియును అబ్బె. అందువలన ఈ తెగవారికి వినికి, సోఁకు, చూపు, చవి, తావి - అను ౫ పసలును చేకూరినవి.

వీరి మనికిపట్టు కొంచదీవి—క్రౌంచద్వీపము; ఇప్పటి ౫ ఖండములతోడి నేలగిఱ్ఱు.

ఈతల్లితెగలోని ౪ పిల్లతెగలవారు ఇప్పటికి పెంపొంది, దొరతనము నెఱపి, పైమెట్టు చేరి, క్రిందికి దిగిపోయిరి. ఇపుడు ౫ వ పిల్లతెగవారు పెద్దఱికము చేయుచున్నారు.

## ౧ వ పిల్ల తెగ:

ఈ తెగవారే ఆర్యులు. నిజమునకు వీరు తల్లి తెగవారే. ఇందలి మందిమేనులు ఆయావర్ణములకు తగినటుల తయారు చేయుటలో బర్హిషత్తులను పితృదేవతలు తోడ్పడిరి. క్రీ.ము. ౧౮,౮౭౫ వ యేటినుండి క్రీ. ము. సుమారు ౯,౭౦౦ ఏండ్లవఱకును 3 జట్టులుగా 3 దారులను వీరు నడి-ఆసియా నుండి ఇండియాకు వచ్చిరి వీరికంటె ముందుగనే ౨, 3, ౪, ౫ పిల్లతెగలవారు తమ పుట్టుపట్టునుండి వలసలు పోయిరి.

వీరు వచ్చునప్పటికి ఇండియా అంతయును ద్రావిడులు ఏలుచుండిరి. వారి మేలినాఁటిమనుతనము, ౧౯౨౨-౧౯౨౭ ఏండ్లనడుమను త్రవ్వఁగా బయలుపడిన మొహంజోదారో పోలిపనిసర్వే వేనోళ్ళ చాటుచున్నది. ఆర్యులు పంజాబులోని ద్రావిడులలో కొందఱితో పోరి, కొందఱితో చెలిమి చేసికొని తుదకు వారిని లోఁబఱచుకొని, నడియిండియాకు దొరలైరి. నానాఁటికి ఇండియా అంతటను తమ పలుకుబడిని నెఱపిరి.

## ౨ వ పిల్ల తెగ:

దీనిని ఆర్యో - సెమిటిక్ తెగఅనుచున్నారు. ఈతెగవారే అరేబియోవారు. వీరు సుమారు క్రీ.ము. ౪౦,౦౦౦ ఏండ్లక్రిందట నడి-ఆసియానుండి బయలువెడలి, ఆక్సస్ నదిగట్టుమీఁదుగాపోయి, యూఫ్రటీస్ నదిదాఁటిరి. అంతట వీరు రెండుజట్టులుగా చీలిపోయిరి. అందు ఒకజట్టు అరేబియాలోనికిని, ఒకజట్టు సిరియాలోనికిని, వెడలిపోయె. అరేబియాలో నెలకొనినవారు నానాఁటికి పెంపొంది, అక్కడనేకాక ఆఫ్రికా తెన్నాటిలోకూడ సామ్రాజ్యము నెలకొల్పిరి. ఇఁక, సిరియాకుచేరినవారు దారిలో తురేనియన్ అక్కేడియన్ తెగలవారిని పలువురను తమలో కలుపుకొనిరి. అందువలన, ఆస్సీరియాబాబిలోనియా మహాసామ్రాజ్యములు వెలసి,మంతుకెక్కినవి.

పోనిషియనులును, మఱియూజిప్షియనులును, తొలిగ్రీకులును, ఈపిల్లతెగవారు మంగోలియనులతో కలియుటచే పొడమినవారే. ఈ తెగలోనికొన్నికోవలు బయలువెడలి తూర్పుగా పోయి, చీనాకడలి చెలియలికట్టపట్టున నెలకొనిన మంగోలియనులతో చేరఁగా పుట్టినవారి బిడ్డలే ఇపుడక్కడనున్నచీనావారు. ఈతెగవారు మినుకువేల్పులను కొలిచెడివారు. చాల్డియాలోని మాగీలు జ్యోతిశ్శాస్త్రమున - సిద్ధాంతభాగమునను, జాతకభాగమునను-మిక్కిలిగట్టివారని పేరుపొందిరి.

## ౩ వ పిల్ల తెగ:

ఈ తెగవారిని ఇరానియను లందురు. వీరే పారశీకులు. వీరు క్రీ.ము. సుమారు 30,000 ఏండ్లక్రితము నడి-ఆసియానుండి బయలుదేఱి, ౨ వ పిల్లతెగవారుపోయిన దారినే పోయి, అఫ్ఘనిస్థానమునను, పారశీకమునను నెలకొనిరి; పారశీక మహాసామ్రాజ్య మేర్పఱచిరి; అది మధ్యధరా

సముద్రమునుండి పామిర్ పీఠభూములవఱకును వెలసి, కొన్ని మార్పులతో క్రీ. పూ. ౨,౨౦౦ ఏండ్లవఱకును నిలిచియుండె.

### ౪వ పిల్లతెగ:

ఈ తెగవారే కెల్టిక్కులు. వీరు క్రీ. పూ. సుమారు ౨౦,౧౦౦ ఏండ్లకిందట పుట్టుపట్టునుండి వెడలి, కాకసస్ కొండలదగ్గఱను ఆఁగి, ఇప్పటి జార్జియా - మెన్గిడియా, అర్మేనియా - కుర్దుస్తాన్ - ఫ్రిజియా నాడులకు దొరలైరి. క్రీ. పూ. సుమారు ౧౦,౦౦౦ ఏండ్లక్రితము మరల పడమటి దారిపట్టి, యూరపుఖండమున చొచ్చిరి. యూరపులో పలుచోట్లు లోఁబఱుచుకొన్న గ్రీకులులు, ఆల్బేనియనులును, కెల్టులును ఈ తెగలోనివారే.

### ౫వ పిల్లతెగ:

ఈ తెగవారికి ట్యూరేనిక్కులని పేరు. వీరు గోబీ కడలి వడవైపునుండి క్రీ. పూ. సుమారు ౨౦,౦౦౦ ఏండ్లకిందట బయలుదేఱి, పడమటిదారిని పోయి, దఘెస్థానమున ఆఁగి, అచ్చట పెక్కువేలయేండ్లు నెలకొని, పెంపొందిరి. క్రీ. పూ. సుమారు ౮,౫౦౦ ఏండ్లక్రితము వీరు వడవైపుగా చని, ఇప్పటిపోలాండులో క్రేకోప్రోలున్నచోటికి చేరిరి. అచ్చటనుండి, వీరు జట్టుజట్టులుగా విడిపోయి, పలుతావులకు చేరుకొనిరి. అందు, స్లేవానిక్ జట్టువారు, ఇప్పటి రష్యనులకును-క్రోషియనులకును-సెర్వియనులకును-బోస్నియనులకును, పెద్దలు; లెటిష్జట్టువారు, లెట్టులకును - లిథ్వోనియనులకును - ప్రష్యనులకును, పెద్దలు; జెర్మనిక్ జట్టువారు, ట్యూటనులకును-గోథులకును-స్కేండినేవియనులకును, పెద్దలు.

ఈ పిల్లతెగవారే, ఇపుడు, ఆస్ట్రేలియా - వడ - అమెరికా - తెన్-ఆఫ్రికాలలో వెలసి, ఇండియామీఁద తమ దొరతనము నెలకొల్పియున్నారు. ఇంగ్లిషువారు వీరిలోనివారే అని వేఱే చెప్పనేల?

### ౬వ పిల్లతెగ:

ఈ తెగవారు వడ-అమెరికాలో ఏర్పడి, పెరిఁగి, పెద్దఱికము చేయుదురు.

### ౭వ పిల్లతెగ:

ఈ తెగవారు తెన్-అమెరికాలో పొడమి, పెంపొంది, పెద్దఱికము చేసెదరు.

### ౬వ తల్లితెగ:

ఈ తెగవారు వడ - అమెరికాలోని పడమటిపీలికను తొలుత ఏర్పడుదురు. వీరు ఉండి నెరయఁబోవు కూర దీవి (శాకద్వీపము) ఇపుడు మెల్లమెల్లఁగా ఒక్కొక ముక్కచొప్పున తూర్పుతెన్కడలినుండి పైకి వచ్చుచున్నది. అది నిండుగా ఏర్పడునప్పటికి పెక్కువేలయేండ్లు పట్టును. అప్పటికి వడ - అమెరికా అంతయు ముక్కముక్కలై, మున్నీట మునిఁగిపోవును. వీరి తొలి మనికిపట్టు మునిఁగిపోక నిలిచి, కూరలంకకు తూర్పంచగును.

వీరు నానాఁటికి పెంపొంది, పెద్దఱికము చేసి, తుదకు పెన్నీటిముంపువలన తమ దీవితోకూడ పాడవడఁగుదురు.

### ౭వ తల్లితెగ:

ఈ తెగవారు, ఇప్పటి తెన్ - అమెరికా విడిపోయి, పేరుమాసిన వెనుక, దానిపట్టున ఏర్పడు తమ్మిలంకను - పుష్కరదీపమున పుట్టి, ఏపారి, దొరతనమునెఱపి, చివరకు చిచ్చుదెబ్బలకు లోనై విచ్చిపోవు తమదీవితోపాటు మిన్నంటుమున్నిటి మేటికెరటముల పాలయ్యెదరు.

ఇది టూకీగా మందిమనుగడ. దీనినిగూర్చి మఱికొంత విరివిగా తెలిసికొనుతలంపున్నవారు, ముత్తఱుల ముచ్చట తెలుఁగువారితోడ్పాటుతో మేలెఱుకవారు వ్రాసిన మేలుపొత్తములు చదివి, తమయెఱుక పెంచుకొని, తోడివారియెఱుకకూడ పెంప కడంగుదురుగాక! ఇప్పటి పడమటివారిదే మేటినాజూకుతన మను వెఱ్ఱినమ్మకము విడనాడఁ గలుగుదురుగాక !! వలయువెంపు లరసి వానినిఁబట్టి నడచి, నిక్కపుహాయికడలికెరటపుటుయ్యాలలలో డెందములలర ఊఁగఁగలుగుదురుగాక !!!

# జీవకారుణ్యము

శ్రీ గొట్టుముక్కల కృష్ణమాచార్యులుగారు.

పిపీలికాదిబ్రహ్మపర్యంతము సమస్తప్రపంచమును పరమేశ్వరునిసృష్టిలోనిదే యని ప్రతి మానవునకును తెలియుట సహజసిద్ధము. వస్తుసమ్మేళనమువలన గలుగు మార్పునే సృష్టియను ప్రకృతివాదమున నేమి, పరమేశ్వరుడు కలడో-లేడో యను వాదమున నేమి, శరీరత్యాగమే మోక్షమనువాదమున నేమి, పరోక్షము శూన్యమనువాదమున నేమి, జ్ఞానములేమియే జన్మమను భ్రాంతికి కారణ మను వాదమున నేమి, మఱి యే యితరవాదమున నేమి, తన జన్మమునకు కారణము తండ్రియు, తండ్రిజన్మమునకు కారణము తాతయు, తాతకు కారణము ముత్తాతయు, ఆయన కాయనతండ్రియు, ఇటుల క్రమముగ బ్రహ్మదులును, వారలకు పంచమహాభూతములును, వానికి సూక్ష్మభూతములును, ఇటుల క్రమముగ మూలప్రకృతియు, దానికి కారణమును తర్కించుచు పోను పోను కారణరహితమైనవస్తు వేదియో ఒకటి ఉండవలెనను నంగీకార ముండి తీరవలెను. ఇట్టిసందేహరహితమగు అంగీకృతవస్తువే పరమేశ్వరు డని వేదములును, శాస్త్రములును తెలుపుచున్నవి. కారణరహితుడును, సర్వకారణుడు నగు ఆ పరమేశ్వరునిసంకల్పానుగ్రహమువలననే యేర్పడిన ప్రపంచమంతయు ఏకమాతృకమని చెప్పకయే తెలుపుచున్నది.

ఒకచోటనుండి జనించి, ఒక్కరీతిగ ప్రసాదింపబడిన ఆహారపానీయంబుల నొందుచు, ఒక్కయావరణములోని వాయువును గ్రోలుచు, ఏకకుటుంబముగనున్న జీవులు పరస్పరము ద్వేషించుట యెంత యవినీతియో యోచింపుడు. సోదరహింసయే అగునుగదా!

### మానవజన్మ-ఉత్కృష్టత

స్థావరములుగ, జలజములుగ, క్రిమిజములుగ, పక్షిజములుగ, పశువులుగ, వానరములుగ, కర్మానుసారముగ ఎన్నియోలక్షలజన్మముల నొంది, పిదప పరమేశ్వరానుగ్రహమున మానవజన్మమును బొందగలిగితిమి. ఇతరజీవులకును, మానవులకును ఆహారనిద్రాభయమైథునాదులు తుల్యములు; ఇంద్రియములు తుల్యములు; కాని మనుజులకు భగవదనుగ్రహమున బుద్ధీంద్రియ మొండు విశేషము. ఈ బుద్ధీంద్రియమును ప్రసాదించుటచే యుక్తాయుక్తవివేచనాభారముమనుజునిశిరమున నిరంతరముండి యున్నది. ఇట్టి భారమును నిర్వహించుటకు నియమధర్మములను ప్రబోధమొనరించుశాస్త్రరూపముగ ఆపరమాత్మయే అవతరించి మార్గదర్శకు డాయెను.

శ్లో॥ ప్రకాశయితు మాత్మానం
భక్తానాం హితకామ్యయా।
అవతీర్ణో జగన్నాథః
శాస్త్రరూపేణ వై ప్రభుః॥—

ఇందుచే శాస్త్రీయముగ ధర్మవిచారణ చేసి మానవుడెద్దేని ఆచరింపవలెననుట నిశ్చయము.

### మానవునికర్తవ్యము

మానవునకు అబద్ధమాడుట, దొంగిలించుట, పరస్త్రీలను పరద్రవ్యములను కోరుట మున్నగునవి యెటుల దూష్యములో, విడువదగినవో, అటులనే ముఖ్యముగ జీవహింసయు త్యాజ్యమనుట నిర్వివాదాంశము. ఈవిషయమునుగూర్చి భీష్మాచార్యులు ధర్మజునకు భారతమున

శ్లో॥ ఊర్ధ్వబాహుర్విరౌమ్యేషః
నతు కశ్చిచ్ఛృణోతి మాం।

ధర్మా దర్థశ్చ కామశ్చ
స ధర్మః కిం న సేవ్యతే.

ధర్మమునుండియే అర్థమును కామమును సిద్ధించునని ఉపదేశించుచు అహింసాధర్మమును బోధించెను.

వివేచనాశక్తి లేని జంతువులు పరస్పరము హింసించుకొనుచు జీవనముచేయుపగిది మానవుడు మఱొక జీవమును హింసించి భక్షించి పుష్టాంగుడగుట ఎంత పశుత్వమో గుర్తింపుడు.

శ్రీమద్రామాయణమున—

శ్లో॥ ధర్మా దర్థః ప్రభవతి
ధర్మా త్ప్రభవతే సుఖం
ధర్మేణ లభతే సర్వం
ధర్మసార మిదం జగత్॥

ధర్మాత్ - అహింసాధర్మాత్ - అహింసా ప్రధానమగు ధర్మమునుండియే సమస్త సౌఖ్యములు కలవనియు, ధర్మసార మిదియే ననియు చెప్పబడెను.

శ్రీమద్భాగవతమున, ప్రహ్లాదచరితమునందు -

శ్లో॥ పర స్స్వ త్మే త్యసద్గ్రాహః
పుంసాం యన్మాయయా కృతః
విమోహితధియాం దృష్ట
స్తస్మై భగవతే నమః
స యదా సువ్రతః పుంసాం
పశుబుద్ధి ర్విభిద్యతే
అన్య ఏష తదాన్యోహ
మితి భేదగతా సతీ॥

పరుడనియు, తాననియు భేదబుద్ధిగలిగియుండుట పశుత్వమనియే వక్కాణింపబడినది.

దీనబంధువులారా, పరమేశ్వరుని బిడ్డలమగు మనము స్వార్థతతో పరస్పరము హింసించుకొనుచుండుట గొప్పపాతకమను విషయమే గాక ఒక కుమారుని స్వార్థతతో హింసించిన, మఱి, యొక తనయునిగూర్చి తండ్రి ప్రేమించునో కోపించునో యోచింపుడు. కాన సర్వజీవకారుణ్యము గలిగి, వర్తించి, భగవదనుగ్రహ పాత్రుల మగుదుముగాక!

# ఆంధ్రదేశమందలి గ్రంథాలయములపట్టిక

భారతదేశ గ్రంథాలయోద్యమమున ఆంధ్రదేశము అగ్రస్థానము వహించినది. నేడు నగరములలో నేగాక పల్లెటూళ్లలో భాషాభిమానులనేకమంది గ్రంథాలయములు స్థాపించి భాషాసేవ చేయుచున్నారు. దేశస్వాతంత్ర్య సంపాదనకు గ్రంథాలయోద్యమము పునాది. ముఖ్యముగ పల్లెగ్రామములలో నే గ్రంథాలయములు అభివృద్ధికావలసియున్నది. వివిధ మండలములలోని గ్రంథాలయములవారందరు తఱచు సమావేశమై గ్రంథాలయోద్యమవ్యాప్తిని గూర్చి చర్చించుచున్నచో నూతనమార్గములతో ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము చాల అభివృద్ధిగాంచగలదు. అట్టి సమావేశములలో అన్ని గ్రంథాలయములవారు పాల్గొనుటకును, ఆంధ్రదేశమందలి గ్రంథాలయముల మొత్తముసంఖ్య తెలియుటకును, ఇప్పు డాంధ్రదేశమున వివిధమండలములలో పనిచేయుచున్న గ్రంథాలయముల జాబితా ప్రకటించుట చాలఅవసరముగనున్నది. అట్టి జాబితా ప్రతిగ్రంథాలయమున నుండుటఅవశ్యకము. ఆంధ్రదేశమందలి వివిధజిల్లాలలోని గ్రంథాలయపట్టికను సమకూర్చి మొత్తము గ్రంథాలయములజాబితాను పుస్తకరూపమున ముద్రించి ప్రకటింపదలచితిని. కాన తెలుగుదేశమందలి గ్రంథాలయోద్యమాభిమానులును, గ్రంథాలయాధికారులును, తాలూకా జిల్లాగ్రంథాలయసంఘములవారును, తమతమగ్రామ, తాలూకా, మండలములలో ఇప్పుడు పనిచేయుచున్న గ్రంథాలయముల పేర్లపట్టిక వ్రాసి నాకు పంపి నాప్రయత్నమునకు తోడ్పడి, గ్రంథాలయోద్యమాభివృద్ధికి సాయపడగలందులకు ప్రార్థించుచున్నాను. వ్రాసిపంపునపు డీ విషయములు ముఖ్యముగ తెలుపవలెను. ౧ గ్రంథాలయస్థాపనసంవత్సరము, ౨ గ్రంథాలయముయొక్క పేరు, ౩ గ్రామము, ౪ పోష్టు, ౫ తాలూకా, ౬ జిల్లా. ఇంకను వివరములుపంపిన ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమచరిత్రరచనకు తోడ్పడును.

ఇట్లు, మల్లెల శ్రీరామమూర్తి, సహాయకార్యదర్శి. ఆంధ్రదేశగ్రంథాలయసంఘము, బెజవాడ.

# కాంగ్రెస్, ఖాదీ-గ్రామపరిశ్రమలప్రదర్శనము, ఫైజ్పూరు.

శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు.

౧౯౩౬ వ సంవత్సరమున బొంబాయినగరమందు ధనాఢ్యుల ధర్మమందిరమున కొలదిమంది విద్యార్థులతో ప్రారంభమైన భారత జాతీయమహాసభ ఏబదవయేడు నిండుకాలమున ఫైజ్పూరుగ్రామములో లక్షలకొలది బీదసాదలతో, సాక్షర నిరక్షర కుక్షులతో, వడవడ వడకించు చలిలో పిండారపోసిన వెన్నెలలో ఆరుబైట సమావేశమయ్యెను. బ్రిటిషు పరిపాలనలోనున్న లోపముల సవరించుటకు కోరసాగిన మహాసభ విశ్వవిశాల దృష్టితో సంపూర్ణ స్వాతంత్ర్యము అత్యవసరమనుచున్నది.

ఈ సంక్రాంతికారకు లెవ్వరు? సంకల్ప కర్త గాంధిజీ; తిలకునగరనిర్మాణకర్త వినోబాజీ; ఆ లక్షలలో ఎవరు వీరిని గమనించిరి? గొంగళ్లు, ఝోరాలు, రగ్గులు చాలకుండిన ఆమంచులో గగనాచ్ఛాదితశయ్యపై పరుండిన ఆతపస్వి అంతర్లీన ఆత్మబలమువలె దానిని నిర్మించి మించె. గ్రామసమావేశము నష్టదాయకమని వాదించినవారిభీతి పోనాడజాలిన ఔదార్యవంతుడు, ౨౫ వేల రూప్యముల నిచ్చిన ఆ దానకర్ణుడు, దానిప్రోత్సాహకర్త, పశ్చిమ ఖాందేశజిల్లా ప్రచారకులును నాయకులును అగు శంకరరావుదస్తావీలు దండనాయకుడై హనుమానులవలె సేవాపరాయణుడై కార్యదురంధరుడయ్యె.

తిలకునగరు చేరగానే ఆ నల్లరేగడభూమి ముదము కొలిపె. ఆనందదాయకములై అచ్చట పెంచబడిన పచ్చనిపైరులు మార్గమున కిరుప్రక్కల శ్రేణులు తీరియుండె; ఎచ్చట చూచినను వెదురు ప్రత్యక్షమయ్యె. స్తంభమునకు, వెన్నుగాడికి, తడికకు, గోడకు, కప్పునకు, వేదికకు, గొడుగునకు, అలంకారమునకు, భూచక్రమునకు, సౌందర్యోపాసకుడైన నందలాల్ బోస్ చేతిలో కీలుబొమ్మయై ఈ వెదురు అనేక వేషములతో అనేక రూపులచిత్రింపబడెను. బ్రహ్మదేశీయుని చేతిలో ఎన్నిగిన్నెలు, ఎన్నిపళ్లెరములు, ఎన్నివస్తువులు, ఎన్నిఅవతారములలో ఈవెదురు దాగియున్నది! ఆహా సృష్టిచమత్కారము!

మలమూత్రవిసర్జనమునకు చేసిన ఏర్పాట్లు స్వచ్ఛములు; వడ్డనకు బూనిన ఆ అతివమిన్నలు అన్నపూర్ణలు; రోజుకు ఏబదివేలమందికి వంటకములు చేసినవారు నలభీములు; ఏబదిగజముల వెడల్పు, నూరుగజములపొడవుగల ఆభారత స్థాయిసంఘసమావేశమందిరము ఖద్దరుమయమై కన్నులపండువయ్యె.

సభ రెండుసమావేశములతో మాత్రమే పూర్తియయ్యె. వేదికపైకివచ్చిన జవహరిలాల్ కిచ్చినస్వాగతము, గద్దెపైనెక్కిన గాంధీజీకి చూపిన భక్తియు, సింహాసనమెక్కిన మౌలవ్యాజీపై కనబరచిన ఆదరమును ఆపున్నమరేలలో సముద్రము పొంగి తెల్లనినురుగులతో నిస్తబ్ధమైనట్లు వెల్లివిరిసియుండె.

ఇయ్యది రచనాత్మకనిర్మాణకార్యక్రమము; దృష్టుల సాఫల్యముచేసి, మహాత్మాజీ జనావళి హృదయముల నాకర్షించి, విస్మరింపనేరని అసదృశదృశ్యముతో మోహనాస్త్రమును పరపె; గూఢమైన సమస్య కలిగినవెంటనే శాసనోల్లంఘనమునకు దూకి ఉరికంబమునెక్కుటకుకూడ సిద్ధముగనున్నానని వీరవతంసుడై, త్రిదశుడై వీరభేరి మ్రోగించి హెచ్చరించె. ఎన్నికలలో నెగ్గిన సభ్యులతో సమావేశము జరపి బ్రిటిషునిర్మిత రాజ్యప్రణాళికకు త్రోసిరాజని, ప్రజేచ్ఛబయలుపడ స్వయంనిర్ణయసూత్రానుసారము శాసనరాజము నెలకొల్పుదు ననె నెహ్రూజీ.

# ప్రపంచవయోజన విద్యాసంఘము

శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు, ఎం. ఏ.

ఐరోపా మహాసంగ్రామము ముగిసిన పిమ్మట ప్రపంచములోని వివిధ దేశములలో వయోజన విద్యోద్యమము విజృంభించెను. వివిధ ప్రాంతములలో వయోజనవిద్యావ్యాపనమునకై కృషిచేయు వ్యక్తులకును సంస్థలకును నడుమ పరస్పరసహకారమును పరస్పరావగాహనమును గలుగ జేయుటకు ప్రపంచవిద్యాసంఘ మను సంస్థ నేటికి ౧౮ సంవత్సరములక్రిందట స్థాపింప బడినది. ఈసంఘము ప్రశంసనీయమగు సేవను జేయుచున్నది. దీని ప్రధానకార్యాలయము లండనులో (౧౬ రసెల్ స్క్వేరులో) నున్నది.

## సభ్యత్వము

ఇందు సభ్యత్వమునొందు వ్యక్తులు ఆరు షిల్లింగులను, సంస్థలు ౨ పౌనుల ౨ షిల్లింగులను చెల్లింపవలెను. ప్రస్తుత మీసంఘములో సభ్యత్వమునొందినసంస్థలసంఖ్య సుమారు ౧౫౦. ఈసంస్థలు నాగరకప్రపంచములోనివివిధ దేశములకు జెందియున్నవి. ఆ దేశము లేవన-: ఐర్లండు, జర్మని, న్యూజిలెండు, నార్వే, పోలండు, దక్షిణాఫ్రికా, స్వీడెన్, స్విడ్జర్లండు, అమెరికా సంయుక్త రాష్ట్రములు, యుగోస్లావియా, హాలండు, గ్రేటుబ్రిటను, ఫిన్లండు, డెన్మార్కు, జెకోస్లావేకియా, చైనా, సింహళము, కెనడా, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా-ఈ దేశములకుజెందినయీ సభ్యసంస్థలలో కొన్ని పేరొందినగొప్పసంస్థలు గలవు. అబర్డీన్ విశ్వవిద్యాలయము, ఆక్స్ఫర్డు కేంబ్రిడ్జివిశ్వవిద్యాలయముల ఎక్స్ట్రామ్యూరల్ స్టడీస్ బోర్డులు పేర్కొనదగినవి. సభ్యసంస్థలేకాక యితరసంస్థలుగూడ కొన్ని యీసంఘమునకు ధనసహాయము చేయుచున్నవి. మొత్తము మీద ఈప్రపంచవయోజనవిద్యాసంఘమునకు సంవత్సరమునకు ౮౦ వేల రూప్యముల వ్యయ ముండును.

## సమాచారశాఖ

ఈసంఘమునకొక సమాచారశాఖ గలదు. ఈశాఖ ప్రపంచములోని వయోజన విద్యావిషయక వృత్తాంతములను తెలిసికొని వాని నెఱుగగోరువారికి తెల్పుచుండును. ఈశాఖకు చేరి యొకగ్రంథాలయము కలదు.

## ప్రచారకులు - సౌకర్యములు

ఖండాంతరములనుండి యింగ్లండునకు వచ్చు వారిలో నెవరైన వయోజన విద్యాభిమానులుండుచో వారికసంఘమువా రాతిథ్య మిత్తురు. ఇంగ్లండులో ఈ యుద్యమములో పనిచేయు వారితో వారికి పరిచయమును గల్గి తురు. ఈ యతిథులకు సాయంకాలములందు విద్యావిషయములైన కాలక్షేపములనుగూడ కూర్తురు.

ఇట్లు బ్రిటనునకు వచ్చు వైదేశికులేకాక బ్రిటనులోని వయోజనవిద్యాభిమానులుగూడ నెవరైన ప్రపంచములోని యితరభాగములకు పోయి యచటి వయోజన విద్యాభిమానులతో పరిచయము గల్గించుకొనగోరుచో ఈ కార్యాలయమువారు వారికి పరిచయలేఖల నిత్తురు. ఈ లేఖల నిచ్చుశాఖకు వేసవికాలములో చేతి నిండ పనియుండును. అనేకు లీలేఖలను తీసికొని దేశాటనము చేయుచు వివిధ దేశములలోని వయోజనవిద్యాపద్ధతులను పరిశీలించుచుందురు. ఈ పద్ధతికి ఫలితముగ వచ్చు పరస్పరావగాహనమువలననే యొక దేశపుప్రధానమును మఱొక దేశమువారు సులభముగ తెలిసికొని యాచరణలో పెట్టుచున్నారు.

ఇంతేకాక ప్రపంచవయోజన విద్యాసంఘములో సభ్యత్వమునొందిన వివిధదేశములలో వయోజన పాఠశాలల నిర్వాహకులను ఉపాధ్యాయులను కొందఱనెన్ని వారిని విదేశములలో సంచారముచేయుటకై పంపుచున్నవి. ఈ సంచారమునకగువ్యయమునాయాదేశములే భరించుచున్నవి. ఇకమీఁదట నీవ్యయమును ప్రపంచ విద్యాసంఘమువారే భరింపదలంచుచున్నారు.

స్థాయి సంఘము.

ఈ సంస్థయొక్క స్థాయిసంఘము సంవత్సరమున కొకసారి సమావేశమగుచుండును. ఈసంఘములోని సభ్యులు వివిధదేశములచే ఆయాదేశములనుండి యెన్నుకొనబడినవారైయుందురు. కొందరసభ్యులనుకార్యనిర్వాహకవర్గమువారెన్నుకొందురు. కార్యనిర్వాహకవర్గములో పదిమంది సభ్యులుందురు. ఈ స్థాయిసంఘసమావేశమునే కాక ప్రపంచయోజనవిద్యాభిమానుల మహాసభనుకూడ నాల్గేండ్లకొకసారి యేర్పాటుచేయుచుండవలెనని యాదిలో నిర్ణయింపబడెను. కాని యింతవరకు నట్టిసమావేశ మొక్కటిమాత్రమే జరిగెను. అది ౧౯౨౮ లో కేంబ్రిడ్జిలో జరిగెను. ౪౦౦ మంది ప్రతినిధులు వచ్చిరి. ఈ సమావేశమును మఱల జరుపుట కార్థికమాంద్యమడ్డువచ్చెను.

గ్రంథ ప్రకటనము

ఇంతవఱకు ప్రపంచవయోజన విద్యాసంఘమువారు చేసిన ముఖ్యకార్యములలో నొకటి గ్రంథప్రకటనము. ఈప్రకటనములు నాల్గువిధములుగ నున్నవి. ౧ కరపత్రములు: ఇప్పటికి సుమారు నూరుకరపత్రములు ప్రకటింపబడినవి. ౨ అంతర్జాతీయవయోజన త్రైమాసిక పత్రిక. 3వార్తా ప్రచురణములు. ౪ కాదాచిత్క ప్రచురణములు- అనగా అప్పుడప్పుడు ప్రచురింపబడు గ్రంథములు. ఇంతవఱకును ఈక్రిందిముఖ్య గ్రంథములు ప్రకటింపబడినవి: అంతర్జాతీయవయోజన విద్యాప్రకాశిని (౪౭౬ పుటలు), బ్రిటిషు డొమినియనులలోని వయోజనవిద్య (౧౫౧ పుటలు), ఇంగ్లండు వేల్సులలోని వయోజనవిద్య, కేంబ్రిడ్జి ప్రపంచ వయోజనవిద్యామహాసభ, వయోజనవిద్య - నిరుద్యోగము, జర్మనీలోని వయోజనవిద్యలో నవీన పరిణామము, ఇటలీలోని వయోజనవిద్య- పైని తెల్పబడిన ప్రచురణములలో ప్రపంచసంస్థలో సభ్యత్వము నొందియున్న సంస్థలుగల దేశములలోని వయోజన విద్యావిషయములే కాక యితరదేశములలోని వయోజనవిద్యోద్యమములు గూడ పరామర్శింపబడుచుండును. వయోజన విద్యోద్యమమును పూనిన యే దేశమును గూడ నీప్రచురణములను విస్మరించి ప్రవర్తింప జాలదు.

విద్యాసంస్థల కర్తవ్యము.

భరతఖండము నావరించియున్న యజ్ఞానతమస్సుయొక్క స్వరూపమును మనము తెలిసికొనవలెనన్నచో నూటికి 90 మంది భారతీయుల కక్షరములైనను రావను నంశమును జ్ఞప్తికి దెచ్చుకొనిన చాలును. వయోజన విద్యావ్యాప్తికి మనదేశములోనున్న యావశ్యకత మరేదేశములోను లేదు. అయినను మన మీ విషయమున చాల మందులముగ నున్నాము. ప్రపంచములో ఈవిషయమున గావింపబడుచున్న యుద్యమములను, ప్రచారములను, పరిశోధనలను జూచినప్పుడైనను మనకు కార్యోత్సాహము గలుగవచ్చును; కర్తవ్యతాజ్ఞాన ముదయింపవచ్చును; తొక్కవలసిన మార్గము కనుపట్టవచ్చును. కాన మన దేశములోని ముఖ్యమైన విద్యాసంస్థలీ ప్రపంచవయోజన విద్యాసంఘములో సభ్యత్వము నొందుట శ్రేయస్కరము.

# గ్రంథవిమర్శనము

## బౌద్ధమహాయుగము

గ్రంథకర్త: వేలూరి సత్యనారాయణ, బి. ఎ. బి. ఎల్., గారు, భీమవరం. నేటి యాంధ్రదేశమున పద్యములల్లగల కవులువిరివిగ గలరుగాని, వచనరచనానైపుణ్యమునలవరచు కొనినవ్రాయసగాండ్రు మిగుల స్వల్పము. వచనరచనాకౌశలమునగడించుట సుసాధ్యముగాదు. మనఆంధ్రసారస్వతమున పద్యకావ్యములకంటె వచనగ్రంథములె ఎక్కుడుగ గావలసియున్నవి. ఆంధ్రలోకమున వచనరచనమున పేరెన్నికగన్న ఆంధ్రయువకులలో వేలూరి సత్యనారాయణగారొకరు. వీరివచనము రసగర్భితమై, గభీరమై, చిత్రకారుని రూపకల్పనవలె చదువరుల నాకర్షించుచుండును. వీరిలేఖిని నిరాఘాటమైనది. అట్టి రసపూరితమగు వచనముననే బౌద్ధమహాయుగము లిఖింపబడినది.

క్రీ. పూ. ౪౫౦ సంవత్సరప్రాంతమునుండి క్రీ.శ. ౬౫౦ దనుక, భారతవర్షచారిత్ర మిందు విపులముగ చిత్రింపబడినది. ఈకాలమునాటిచరిత్రసామగ్రినంతయు సమగ్రముగ పరిశీలించి, గ్రంథకర్త యీ గ్రంథమును వ్రాసినాడు. చరిత్రాంశములప్రోవులుపోసి, చదువరుల విసిగింపక, ఆకాలమునాటి భారతవీరుల సమరకౌశలము, అప్పుడు రాజ్యమేలిన నృపులపరిపాలనావిశేషములు, అప్పటిరాజ్యాంగ, మత, సాంఘిక, పారిశ్రామిక సారస్వతవ్యవస్థలు, నాటిప్రజల ఆచారములునడవడులు, మున్నగువిషయములతో చరిత్రాంశముల మిశ్రమించి, నాటిభారతవర్ష చారిత్రము నొక్క సినీమాదృశ్యమువలె గ్రంథకర్త చదువరులకన్నులకు గట్టినాడు. ఈ గ్రంథమున ఆంధ్రులచరిత్రభాగము ప్రతియాంధ్రుడును జదివితీరవలయును. పశ్చిమోత్తరదిశనుండి మిడుతలదండువలె, భారతభూమిని జొరబడి ఉత్తరభారతము నంతయు నొకకడకు దెచ్చిన యవన, శక, పహ్లవ జాతుల గదనరంగమున చిందులు ద్రొక్కించి, మగధ రాజ్యమునుగూడ జయింపగల్గిన ఆంధ్రపౌరుషము, శాతవాహన సాలంకాయన విష్ణుకుండినుల పరిపాలనాచాతుర్యము, అమరావతీశిల్పమువంటి జగద్విఖ్యాతమగు శిల్పరచనల కల్పింపగల్గినఆంధ్రులశిల్పకౌశలము, సుమత్రా, జావా, బోర్నియో ద్వీపములకును, సయాము చంప మున్నగు ప్రాచీనరాజ్యభూములకును, ఆంధ్రసభ్యతనుగొంపోయి, ఆంధ్రనామమునచ్చట చిరస్మరణీయముగజేయగల్గిన ఆంధ్రుల నౌకాయానప్రావీణ్యము మున్నగు ఆంధ్రలోకము స్మరింపవలసిననూతనాంశములెన్నియో గ్రంథకారుడు మనకు తెల్పియున్నాడు. చరిత్రకారుని కుండవలసిన పరిశీలనాదక్షత, సమదృష్టి, చరిత్రాంశములు స్వకపోలకల్పనలతో మిళితమై పోకుండగాపాడి, వానిని యథాతథముగ వివరింపవలయునన్నయాందోళన మున్నగు యుత్తమలక్షణము లీగ్రంథమున ప్రతిఫలించినవి. ఆంధ్రలోకము దీని సముచితరీతిని గౌరవించి యాదరించుగాక.

## నూతన అక్షరాభ్యాసము

ఇప్పుడు రామచంద్రపురములో జిల్లామ్యునిసిఫ్‌గా పనిచేయుచున్న మ. రా. రా. కె. జి. బాబురావు, ఎం. ఏ. బి. ఎల్ గారు దీనిని రచించిరి. ఇది ద్వైభాషికము. మొదటి ౩౪ పేజీలను ఇంగ్లీషునవ్రాసిరి. పిదప సుమారు ౨౦ పేజీలు తెలుగు గ్రంథము. దీని ఉద్దేశము సులభతరముగా తెలుఁగు చదువను నేర్పుట; పిదపవ్రాయను- విజ్ఞానము సంపాదింపను మార్గముండునని వీరియభిప్రాయము. ఈగ్రంథముతోకూడ రెండు అక్షరపటములు చేర్చి పంపినారు. ఏలూరు శ్రీలక్ష్మీసేవాసదనము వర్ణనము ఆంగ్లభాషలో వ్రాసినది ౧౬ పేజీలు గ్రంథమును పంపిరి. గ్రంథాలయముతో సంబంధములేని అక్షరాస్యప్రయత్నము నిష్ప్రయోజనమని వీరి యుద్దేశముగా నున్నట్లు ఇంగ్లీషుపాఠమునుండి స్పష్టమగుచుండుట మాకు మిక్కిలి సంతోషమును కలిగించినది.

వీరు రచించిన అక్షరాభ్యాసవిధానము హృదయరంజకముగ నున్నది. తెలుఁగక్షరములు గుండ్రములు, వట్రువులనుటయు కలదు. చంద్రుఁడు, కమలము, సూర్యుఁడు ఈ ఆకారములతో సమన్వయము చేయుటకు అవకాశము కలదు. ప్రత్యేకము ఈవిధసమన్వయము చేయుటకు వీరుపూనుకొనకున్నను విధానమునుమాత్రము లిపియొక్క వలయాకారముమీఁదనే ఆధారపడి ఒక్కొక యక్షరమునకును మన

సంఘములోని ఒక్కొక ఆచారమునను సంధించి నేర్పుటకు ప్రయత్నించిరి. సున్నతో పాఠము నారంభించిరి. సున్నయొక్క పరివర్తనముగ అన్నియక్షరములను సమర్థింప ప్రయత్నించిరి. ఒక్క ఉదాహరణము చాలును. కొమ్మును ఉత్వముతో నను సంధించు ఘట్టమున ఒక వృషభమును చిత్రించి కుఱ్ఱవానిని పొడుచుటకు వెంటాడునట్లు కనుపరచి విషయమును పిల్లలకు రంజకమొనర్చిరి. పిల్లనికి బూట్సులు, షర్టు, కాలరు, కోటు, తుర్కీటోపి పెట్టుటతో కొంత భారత గ్రామీయ స్వభావమునకు అడ్డుతగిలనదేమోకాని మొత్తముమీద ఆకర్షణము మాత్రము తగ్గలేదు. పదుగురీ మార్గమునందు కృషి చేసినయెడల విషయమింకను ఆకర్షణీయముగ చేయుటకును, ఉపయోగకరముగ చేయుటకును అవకాశమున్నది. వర్ణవర్గీకరణము ఉచ్చారణ వర్గమనుసరించిగాక ఆకారవర్గము ననుసరించియుండుట చేత అక్షరములను గుర్తించుట సులువగును. నూఱు దినములలో తెలుఁగుదేశమంతయు అక్షరజ్ఞము కావించుటకు ఈవిధానము పనికివచ్చునని గ్రంథకర్త ఆశయము. ఇతర సాధనములమీద కూడ ఈపని ఆధారపడును కావున వీరు కోరినంత త్వరలో పనిజరిగినను, జరుగకున్నను, ఇట్టివారు ఈవిషయములందు మెదడును చొరనిచ్చి పరిశ్రమ చేయుటయే భావిభాగ్యోదయసూచకము. వీరు రచించిన గ్రంథము ఉచితముగ పంచిపెట్టుచున్నారు. సాధ్యమైనంత విరివిగ తెప్పించుకొని మహాజనవిద్యకు తోడ్పడ నెంచువారందఱును విషయమును తెలిసికొనుట చాల అవసరమని మాత్రము హెచ్చరించుచున్నాము.

## ఆరోగ్య శాస్త్రము:

డాక్టరు గుళ్లపల్లి నారాయణమూర్తి, ఎల్. ఎం. ఎస్. గారిచే విరచితము. వారిచేతనే ప్రకటితము. పుటలు ౪౦౩; వెల రు ౨-౦-౦. తాడేపల్లి శంకరశాస్త్రి, లెఫ్టినెంటు కల్నల్ ఐ. ఎం. యస్. గారు తొలిపలుకులు వ్రాసిరి. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు పోటీపరీక్షలో రు ౭౫౦/- ల బహుమతినిచ్చిరి. మద్రాసు టెక్స్టుబుక్కు కమిటీవారు దీనిని స్కూళ్ల గ్రంథాలయములకు వినియోగింపవచ్చునని అంగీకరించిరి. విశాఖపట్టణముజిల్లా, అనకాపల్లికి గ్రంథకర్తగారి పేరిట వ్రాసినయెడల ప్రతులు పొందవచ్చును.

ఈ గ్రంథమును వ్రాయుటలో శ్రీ డాక్టరు గుళ్ళపల్లి నారాయణమూర్తిగారు, ఆరోగ్యశాస్త్రమనఁగా మురికికాలువలు, మఱుఁగుదొడ్లు, చెత్తబండ్లు మొదలగు వానికి సంబంధించిన విషయములు మాత్రమే వివరించుట చాలదని, మానవుని ఆరోగ్యము పరిసరములయందును ఆహారవిహారాది విషయములయందును కలుగు మార్పుల ననుసరించి యుండునని నిర్ణయించి, ప్రత్యేకము ఈ క్రింది ౬ సూత్రములను నిర్వచించిరి. వానిమీఁద నాధారపఱచి, గ్రంథమును వ్రాసిరి.

౧. శరీరమునకు ఉచితమైన యాహారపానీయములుండవలెను.

౨. శరీరమునకు కావలసినంత సూర్యరశ్మియు, పరిశుభ్రమగు గాలియు లభించవలెను.

౩. శరీరమునందలి యనవసరములగు మురికి పదార్థములు సదా తొలగుచుండవలెను.

౪. శీతోష్ణస్థితుల యుద్రేకములనుండి శరీరమును కాపాడవలెను.

౫. నిత్యమును తగినంత పరిశ్రమమును, విశ్రాంతియును గైకొనవలెను.

౬. శరీరమును రోగజనకములగు క్రిములనుండియు విషములనుండియు గాపాడవలెను.

ఆహారవిషయమును గుఱించి వీరువ్రాసిన ప్రకరణములందు ప్రాణాణువు (విటమిను)లను గుఱించియు, ఇతర విషయములను గుఱించియు నూతనాంశములు పెక్కు రచించిరి. క్రిమిసిద్ధాంతమునకు సంబంధించిన సంగతులను చాల సంపూర్ణముగ నిచ్చిరి. ఈ నూతనాంశములు అందఱును ఎఱుఁగఁదగిన వనుటకు సందేహము లేదు. గాలి, నీరు, నివేశనములు మొదలగు విషయములను గుఱించియు, వ్యాధులను గుఱించియు, దాని నివారణములను గురించియు ఇందు విపులముగ వ్రాయఁబడినవి. శైలి సులభమై, అనర్గళముగ సాగినది.

విశ్వకళాపరిషత్తువారు నియమించిన నిర్ణయముల లోపము చేత కానిండు, ఆనిర్ణయములపరిమితి తెలియక కానిండు, ఈగ్రంథమునందు ఆరోగ్యవిషయక ప్రాచ్యవిద్యలయొక్కయు సిద్ధాంతములయొక్కయు వివరణము ఎచ్చటను కనుపించదు.

విశ్వకళా పరిషత్తువారు గ్రంథమును తామే ప్రకటించుట మానుకొని, అతివ్యయప్రయాసలతో కూడిన ప్రకటన భారమును గ్రంథకర్తమీఁదనే వేయుటచేత గ్రంథముద్రణమున విరివిగా పటములు, రంగుపటములు చేర్చుట జరుగలేదని యూహింపవలసి యున్నది.

ఎట్లైనను ఇట్టిశాస్త్రగ్రంథములే అరుదు. అందులోను అర్థమగునట్లు వ్రాసినవి అంతకంటెను అరుదు; సుప్రసిద్ధ పరిశీలనమునంది బహుమతి పొందినవి ఏ ఒకటియో? అరయో? గ్రంథకర్త సాధ్యమైనంత జాగ్రతతో, శక్తివంచనలేక పటములతోను, వివరణములతోను, చక్కని కాగితము, అచ్చు బైండులు సమకూర్చి గ్రంథమును ప్రకటించె. కాఁబట్టి ఆంధ్రలోకము ఈయనకు తగిన ప్రోత్సాహము కలిగించుఁగాక యని కోరదగియున్నది.

## నిజాము రాష్ట్ర పరిపాలనము

గ్రంథకర్త:—శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు, బి.ఏ., బి. ఎల్., గోల్కొండముద్రాక్షరశాల-టూప్‌బజారు - హైదరాబాద్ (దక్కన్)

౯౦ పుటలుగలగ్రంథము వెల రు౦-౬-౦, గోల్కొండ పత్రిక చందాదారులకు ౦-౪-౦మాత్రమే. నిజాము రాష్ట్రమున రాజకీయ, సాంఘిక, భాషావిషయములలో సేవచేయుచున్న ఆంధ్రప్రముఖులలో శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు ప్రధానులు. వీరు వ్రాసిన ఈగ్రంథము నిజామురాష్ట్రమందలి ఆంధ్రులకే గాక, బ్రిటిషుఇండియాలోని ఆంధ్రులకును ముఖ్యముగా ఆంధ్రదేశములోని అన్ని గ్రంథాలయములకును అత్యంతోపయుక్తమైనది. దేశీయ సంస్థానములు, భారతనరేంద్రమండలి, నిజాంరాష్ట్ర నైసర్గిక చరిత్ర, నిజాముపాలకుల వంశవృక్షము, రాష్ట్రాదాయ వ్యయములను సూచించు కొన్నిపట్టికలు, జిల్లాల తాలూకాల వివరములు, శాసనసభ, బాబేహుకూమత్ (ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గము), ప్రభుత్వకార్యాలయవిభజనము, వివిధశాఖలు, వాటి వివరములు, రెసిడెన్సి (బ్రిటిషుప్రాతినిధ్యము), జాగీర్లు, జమీందార్లు, సర్ఫెఖాస్ (నిజాముగారి స్వంతజమీ-దానిఆదాయము) మొదలగు పెక్కువిషయములు సామాన్యులకుగూడ బోధపడు సులభశైలిని సంగ్రహముగ వివరించిరి.

క్రీ. శ. ౧౭౧౩ వ సం॥లో ఢిల్లీ మొగలాయిచక్రవర్తి నిజాముల్ ముల్కు అసఫ్ జాన్ గారిని దక్షిణభారతదేశమునకు రాజప్రతినిధిగా నియమించెను. నిజాముప్రభువులవంశమునకు ఇతడే మూలపురుషుడు. నిజాముల్ ముల్కు అనగా దేశముయొక్క విచారణచేయునతడని అర్థము. నిజాముశబ్దము ఇతనితరువాతినవాబులకు బిరుదయ్యెను. ప్రస్తుతనబాబుగారు ఈ వంశము వారిలో ఎనిమిదవతరమువారు. ఇపుడు నైజాముగారికి బ్రిటిషు ప్రభుత్వమువారు నామమాత్రముగ నిచ్చిన బీరారుదేశపు కథయంతయు ఇందు కలదు.

క్రీ. శ. ౧౮౫౩ సం॥లో సర్ సలార్‌జంగ్‌గారు ప్రధానమంత్రిత్వము స్వీకరించిననాటికి పూర్వము నిజాం రాష్ట్రముయొక్కస్థితిగతులును, తదాది కలిగినఅభివృద్ధియు విషయప్రవేశము అను శీర్షికక్రింద క్లుప్తముగ తెలుపఁబడినవి. నేటి నిజాము ప్రభుత్వపరిపాలనా విధానమునకు పునాదివేసినది ప్రధానమంత్రియగు సర్ సలార్‌జంగుగారే. ఈ రాష్ట్రము భారతదేశ స్వదేశసంస్థానములన్నిటిలోను వైశాల్యములోనేమి, జనసంఖ్యలోనేమి' ఆదాయములోనేమి పెద్దది. దీనియొక్క వైశాల్యము ౮౨,౬౯౮ చదరపు మైళ్లు. సాలీనాఆదాయము రు ౮,౧౭,౬౨,౦౦౦/లు; జనసంఖ్య ౧,౪౪,౩౬,౧౪౮; ఇందు ఆంధ్రులజనసంఖ్య ౬౯,౭౨,౫౩౪.

ఈ గ్రంథమున పలుతావుల ఉర్దునామములు వాడబడినవి. వీనికి తెలుగుఇంగ్లీషుఅరవములు గ్రంథముయొక్క చివరిభాగములో వివరముగ వ్రాయబడినవి.

## స్టావ్‌లీ ప్రాంతీయ గ్రంథాలయము

బ్రిటను దేశములోని ఈగ్రంథాలయమును గురించిన కొన్నివివరములు డిసెంబరు సంచికలో వెల్లడించియుంటిమి. ఈగ్రంథాలయములోని గ్రంథములను ఇతరప్రాంతములకు ఎరవు ఇచ్చు ప్రత్యేకశాఖా భవనపటము ఆసంచికకు ముఖపత్రచిత్రముగా వేసితిమి. ఈప్రాంతీయ శాఖా గ్రంథాలయ భవన పటమే ఈ సంచికాముఖ పత్రచిత్రముగా వెలయుచున్నది. ఈ గ్రంథాలయము చుట్టుపట్టులనుండు ౧౫,౦౦౦ పట్టణ ప్రజలకును, దగ్గఱి గ్రామాదులలోని ౨౦,౦౦౦ ప్రజలకును సేవచేయుచున్నది.

# కొవ్వూరు తాలూకా గ్రంథాలయ ప్రథమ మహాసభ

ది ౧౯-౧౨-౩౬ తేదీ శనివారము పగలు రెండుగంటలకు నిడదవోలు గ్రామములో శ్రీరాజావారి బంగాళాలో పశ్చిమగోదావరిజిల్లా గ్రంథాలయ సంఘకార్యదర్శియగు శ్రీ డాక్టరు పాలకోడేటి సత్యనారాయణశర్మగారి (భీమవరము) యాధిపత్యమున ఈ తాలూకా గ్రంథాలయ ప్రథమమహాసభ జరిగినది. తాలూకాలోని పలుప్రాంతముల నండి గ్రంథాలయోద్యమాభిమానులు విచ్చేసిరి. శ్రీయుతులు మంగిపూడి వేంకటశర్మ, శనివారపు సుబ్బారావు, తల్లాప్రగడ ప్రకాశరాయుడు, సత్తిరాజు సదాశివరామమూర్తి, డాక్టరు జీడిగుంట కామరాజుగార్లు మున్నగుఉద్యమాభిమానులగు ప్రముఖులు గూడ పలువురు సభకు దయచేసిరి.

సభాసమావేశకర్తలగు శ్రీయుత తాడిమేటి కుటుంబశాస్త్రిగారు ప్రతినిధులకు స్వాగతమొసంగిరి. నిరక్షరత్వనిర్మూల నావశ్యకత, వయోజనవిద్య, రాత్రిపాఠశాలలు, గ్రంథాలయోద్యమములనుగురించి వారుపన్యసించిరి. తాడేపల్లిగూడెము తాలూకా గ్రంథాలయ సంఘకార్యదర్శియగు డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారిని మహాసభా ప్రారంభోపన్యాస మొసంగవలసినదిగను, డాక్టరు పాలకోడేటి సత్యనారాయణశర్మగారిని అధ్యక్షత వహింపవలసినదిగను వారు ప్రతిపాదింపగా డాక్టరు జీడిగుంట కామరాజుగారిచే బలపరుపబడి అందరిచే ఆమోదింపబడెను.

శ్రీ డాక్టరుగారు మహాసభను ప్రారంభించుచు గ్రంథాలయములు ప్రజాజీవితములలో ఎట్టి మార్పులను తీసికొనిరాగలవో సూచించుచు గ్రంథాలయోద్యమాభివృద్ధికి చేయతగు కృషిని వివరించుచు జిల్లాలో జరుగుచున్న పనినిగురించి చెప్పి యీతాలూకాకూడ ఇతర తాలూకాలకు వెనుకబడక యుండవలెనని ఉద్బోధించిరి.

అధ్యక్షులు పంచాయతీ గ్రంథాలయములను, కమిటీ గ్రంథాలయములును, ఎట్లు పని చేయుచున్నవో, గవర్నమెంటువారును, స్థానికసంస్థలవారును, గ్రామస్థులును ఈయుద్యమాభివృద్ధికి ఎట్లు తోడ్పడవలెనో వివరించుచు, పల్లెటూరి ప్రజలలో జ్ఞానాభివృద్ధికి గ్రంథాలయములెట్లు అత్యంతావశ్యకములో నిరూపించి, గ్రంథాలయ సేవకులకు కొన్ని సలహాలనొసంగిరి త్వరలో ఈ తాలూకాలో గ్రంథాలయయాత్రను సాగింపవలెనని చెప్పిరి.

అనంతరము నరసాపురము తాలూకా గ్రంథాలయ సంఘకార్యదర్శియగు శ్రీయుత రుద్రరాజు నరసింహరాజుగారు (పోడూరు) తమ తాలూకాలోని యుద్యమచరిత్రను గురించి యుపన్యసించిరి.

పిదప శ్రీయుత వేమూరి రామసుబ్బారావుగారు (అలంపురము) ప్రాథమికోపాధ్యాయులు ఈ యుద్యమమున కెట్లుతోడ్పడగలుగునదియు విశదపరచిరి,

తరువాత ఈదిగువ తీర్మానములు మహాసభలో అంగీకరింపఁబడినవి.

I. ఈతాలూకాయందలి గ్రంథాలయోద్యమ వ్యాప్తికి దిగువవారిని, కార్యనిర్వాహక వర్గముగా ఎన్నుకొనిరి.

అధ్యక్షులు:—

౧. గోటేటి శ్రీరామచంద్రమూర్తిగారు, తాళ్ళపూడి.

కార్యదర్శి:—

౨. జోశ్యులసూర్యనారాయణమూర్తిగారు, సింగవరము
౩. లకంసాని సుబ్బారావుగారు, మల్లవరము
౪. గెడా రఘునాయకులుగారు, చిన్నాయిగూడెము
౫. రంకిరెడ్డి మంగన్నగారు, పందలపఱ్ఱు
౬. చేకూరి సుబ్బరాజుగారు, పెండ్యాల
౭. దాట్ల సూర్యనారాయణరాజుగారు, నిడదవోలు

II. ఈ తాలూకాయందలి ప్రతి గ్రామమునందును, గ్రంథాలయమును, పఠనమందిరమును పెట్టుటకును, అందువలన వయోజన విద్యావ్యాప్తికి తోడ్పడుటకును ఈతాలూకావారిని కోరుచున్నాము.

III. ఈ తాలూకాయందలి గ్రంథాల యోద్యమమునకు తోడ్పడుటకు గవర్నమెంటు వారిని, జిల్లాబోర్డు వారిని, పంచాయతీబోర్డులను, సహకార సంఘములను, ఇతర ధార్మికులను కోరుచున్నాము.

IV. గ్రంథాలయముల జమాఖర్చులను ప్రతి సంవత్సరము ౩౧ వ మార్చితో ముగించి మరల నూతనముగా మొదలు పెట్టవలయును.

V. తాలూకా గ్రంథాలయమునకు, ఒక రూపాయ తక్కువగాని విరాళమిచ్చు గ్రంథాలయప్రతినిధులను, ఇతర వ్యక్తులను, సభ్యులుగా చేర్చుకొందురు. ఈ సంఘ

సభ్యులే ముందు సంవత్సరము, కార్యనిర్వాహకవర్గము నెన్నుకొనెదరు.

vi గ్రంథాలయ సేవకులను గ్రంథాలయములులేని గ్రామములలో గ్రంథాలయముల పెట్టుటకును, గ్రంథాలయములున్న గ్రామములకు తరచువెళ్ళుచు గ్రంథాలయ నిర్వాహకులకు తోడ్పడుట, వార్షికోత్సవములు-వర్థంతులు సభలు ఏర్పాటుచేయుట, మున్నగు విషయములను గూర్చి కృషిచేయుటకును కోరెదము.

vii జిల్లాగ్రంథాలయ సంఘమువారు పాండువ్వలో తయారుచేసిన ప్రణాళిక ప్రకారము వెంటనే చర్య తీసికొనగలందులకు పశ్చిమగోదావరి జిల్లాబోర్డువారిని కోరుచున్నాము.

vIII. ఆంధ్రపత్రిక సంపాదకులను ఈ తాలూకా గ్రంథాలయ సంఘము వారు సిఫార్సుచేసిన గ్రంథాలయములకు ఆంధ్రపత్రిక రు ౧౨ లకును, భారతి రు ౪-౮-౦ కును ఇప్పించవలసినదిగా కోరుచున్నాము.

IX. ఈతాలూకాలో వీలైనంత త్వరలో, తాలూకా గ్రంథాలయ యాత్ర యేర్పాటుచేయుటకు తీర్మానింపనైనది.

X. ఈ తాలూకాసంఘమును, పశ్చిమగోదావరిజిల్లా గ్రంథాలయ సంఘమునకును, ఆంధ్రరాష్ట్ర గ్రంథాలయ సంఘమునకును, అనుబంధముగా చేర్చుటకు తీర్మానింపనయినది.

XI. ప్రతిగ్రంథాలయమునందును తప్పక రాత్రిపాఠశాలను నెలకొల్పుటకు కోరుచున్నాము.

# గ్రంథాలయములు - రెజిష్టర్లు

[పడమటిగోదావరిజిల్లా తాడేపల్లిగూడెం తాలూకా గ్రంథాలయసంఘమువారు అప్పుడప్పుడు కరపత్రములు ప్రకటించుచున్నారు. అందులో గ్రంథాలయ నిర్వహణకు కావలసిన సూచనలు చేయుచున్నారు. అందులో రెండవ ప్రచురణమునందు "గ్రంథాలయములు - రెజిష్టర్లు" అను సంగతిని గురించి వివరములువ్రాసిరి. ఇటీవల ఘంటసాల శ్రీరామమోహనపుస్తకభాండాగార కార్యదర్శి శ్రీరాయపాటి సీతారామయ్యగారు ఈ సంగతిని గురించియే పత్రికలలో వ్రాసిరి. తాడేపల్లిగూడెముతాలూకా సంఘమువారు వ్రాసిన జాబితాలోని 1, 2, 3, 4, 6, 7, 9, లకు సరిపోవు రిజిష్టర్లు సీతారామయ్యగారును సలహాచేసిరి. పేర్లమార్పు, కొన్నివివరముల మార్పులు మాత్రమున్నవి. గ్రంథముల జాబితాయనుదానిని వీరు విషయక్రమసూచికయనిరి. కారణము స్పష్టము. వీరు అక్షరక్రమసూచిక రెజిష్టరు వేరుగా నుండవలెననిరి. అక్షరక్రమమనిన యెడల గ్రంథనామము ననుసరించి యొకటి, గ్రంథకర్త ననుసరించి యొకటి వ్రాయవలసివచ్చును. ఇప్పుడీ విధమగు వర్గీకరణము నమలునందుంచుట తగ్గిపోయినది. ఇండ్లకిచ్చు గ్రంథములరెజిష్టరును వీరు లెండింగు రిజష్టరనిరి. ఇచ్చటను కారణముస్పష్టము. సీతారామయ్యగారు చందాదారులుకల గ్రంథాలయమునే గ్రహించి యాలోచించిరి. తాడేపల్లిగూడెము గ్రంథాలయ సంఘమువారు చందాదారుల సంగతి యాలోచింపలేదు. కాబట్టి సీతారామయ్యగారు చందాదారులరెజిష్టరని వేరురెజిష్టరు సూచింపగా సంఘమువారు దానికి వేరే యేర్పాటు పెట్టలేదు. చందాదారులుకల గ్రంథాలయములలో సీతారామయ్యగారి పద్ధతియే యనుకరింపవలసియుండును. సంఘతీర్మానముల పుస్తకమనిన దానిని సీతారామయ్యగారు మినిట్‌బుక్కు అనిరి. సంఘమువారి ప్రచురణమునందు గ్రంథాలయపు సామాన్య సభ్యుల సమావేశముల చర్యవ్రాయుటకు ఏర్పాటులేదు. కార్యనిర్వాకవర్గసమావేశములను రికార్డుచేయుటకే వారేర్పరచినారు. సామాన్య సభ్యులున్నచోట సీతారామయ్యగారి సలహాననుసరించుటే మేలు. సంఘమువారు జమాకర్చు పుస్తకమనిన దానిని సీతారామయ్యగారు రోజు అవర్జాలని రెండుగా విభజించి నమూదు చేసిరి. ఈ సందర్భమున వీరి సలహా ననుసరించుటే మేలు. సందర్శకుల రెజిష్టరనిన దానిని వీరు ప్రేక్షకుల రెజిష్టరనిరి వీరుచేసిన జాబితాలో గ్రంథవిరాళముల రెజిష్టరొకటి కలదు. సంఘమువారు దీనిని స్టాకు రెజిష్టరులోనె గ్రంథములను బహుమతిచేసిన వారిపేరుతో పూర్తిచేయనెంచిరి. అది సమంజసముగానేయున్నది. సంఘమువారి 5-8-10 11 లకు సరిపోవు రెజష్టర్లు శ్రీ సీతారామయ్యగారి జాబితాలో లేవు. అవి ముఖ్యములు. తాడేపల్లి తాలూకా గ్రంథాలయ సంఘము వారి ప్రచురణము నీదిగువ నిచ్చుచున్నాము.]

ప్రతి గ్రంథాలయమువద్దను, దిగువ రెజిష్టర్లు వ్రాయుచుండవలయును. ఈ రెజిష్టర్లు అన్నియు, ప్రతి సంవత్సరము, ఏప్రియలు 1 వ తేదీని క్రొత్తలెక్కలతో ప్రారంభించుచుండవలయును. రెజిష్టర్లు శాశ్వతముగ నుండునటుల, ఒకే సైజు బైండు పుస్తకములను వాడవలయును.

### I స్టాక్ రెజిష్టరు:—

ఇందు వేరు వేరుగ గ్రంథాలయముయొక్క గ్రంథములు రెజిష్టర్లు, ఇతర సామగ్రి, ఆస్తి, మున్నగు విషయములు వ్రాయవలయును. గ్రంథములకు 1 వరుస సంఖ్య, 2 గ్రంథముపేరు, 3 గ్రంథకర్త, 4 ఖరీదు, 5 గ్రంథాలయమునకు తెచ్చిన తేది, 6 బహుమతి చేసినచో వారిపేరు, 7 రిమార్కు అను వివరములు కావలయును.

### II గ్రంథముల జాబితా:—

ఇందు, గ్రంథాలయములో ఉన్న గ్రంథములను, 1 సంపుటములు, 2 పురాణములు, 3 గద్యలు, 4 పద్యము 5 నవలలు, 6 నాటకములు, 7 చరిత్రలు, 8 శాస్త్రములు, 9 ఇతరము మున్నగు తరగతులగ విభజించి ఒక్కొక్క విషయమునకు, కొన్ని పుటలువిడుచుచు, దిగువ వివరములతో వ్రాయవలెను. ఆంగ్ల,హిందీ,సంస్కృతాంధ్ర గ్రంథములను వేరువేరుగ వ్రాయవలెను. 1 వరుససంఖ్య, 2 విభజనసంఖ్య, 3 గ్రంథముపేరు, 4 గ్రంథకర్తపేరు (సభ్యులు ఉపయోగము నిమిత్తము, ఇది ఆర్థిక స్థితినిబట్టిఅచ్చువేయించదగును).

### III. ఇండ్లకిచ్చు గ్రంథముల రెజిష్టరు:—

1 వరుస సంఖ్య, 2 గ్రంథము సంఖ్య, 3 గ్రంథము పేరు, 4 తీసుకొనినవారి సంతకం, 5 తీసికొనిన తేదీ 6 తిరిగిఇచ్చిన తేదీ. 7 భాండారకుని చేవ్రాలు. 8రిమార్కు

### IV. గ్రంథాలయమునందలి పాఠకుల రెజిష్టరు

1 వరుస సంఖ్య. 2 తేది, 3 చదివినవారి సంతకం, 4 వయస్సు, 5 గ్రామము, 6చదివినగ్రంథము లేక పత్రిక 7 రిమార్కు.

### V. దినచర్య పుస్తకము:—

గ్రంథాలయమునందు జరుపుసభలు, ఉపన్యాసములు, మున్నగు వివరములును ఇతర కృషియు వ్రాయుచుండవలయును



### VI. సంఘ తీర్మానముల రెజిష్టరు:—

గ్రంథాలయ కార్యనిర్వాహక వర్గముయొక్క సమావేశములు, అందలి తీర్మానములు, ఇందు వ్రాయుచుండవలయును.

### VII. జమాఖర్చు పుస్తకము:—

చందాదారుల నుండియు, ఇతర సంస్థలనుండియు, వసూలుచేయు విరాళములును, ఖర్చులును, ఇందువ్రాయుచుండవలయును.

### VIII ఉత్తరముల రెజిష్టరు:—

ఉత్తరములనకళ్లు, ఇందు వ్రాయుచుండవలయును. (వరుససంఖ్యతో)

### IX సందర్శకుల రెజిష్టరు:—

గ్రంథాలయమును వీక్షించుటకు వచ్చుప్రముఖుల అభిప్రాయములను ఇందు వ్రాయించి దీనినకళ్లను, ఒకటి తాలూకా కార్యదర్శికిని, స్థానిక సంస్థల గ్రంథాలయములైనచో ఆయా యధికారులకును పంపుచుండవలెను.

### X రశీదుల పుస్తకము:—

గ్రంథాలయ సభ్యులనుండి పుచ్చుకొను విరాళములకు అచ్చురశీదులు ఇచ్చుచుండవలయును.

### XI ఫైలు పుస్తకము (file)

గ్రంథాలయమునకు వచ్చుఉత్తరములు, ప్రచురణములు మున్నగునవి ఒక వైపునుండియు, గ్రంథాలయమునకు సంబంధించిన కర్చులయొక్క వోచర్లను రెండవవైపునుండియు అంటించుచుండవలయును.

మరియు ప్రతి గ్రంథాలయమువద్దను, దిగువ పట్టికలు గ్రంథాలయము గోడలకు తగిలించవలయును.

I గ్రంథాలయసభ్యుల జాబితాగల పట్టిక.

II గ్రంథాలయ నిబంధనలుగల పట్టిక.

III తారీఖులను, వారములను, నెలలను తెలుపు క్యాలెండరు.

IV గ్రంథాలయమునందు జరుగు సభలను ప్రకటించు నోటీసుబోర్డు.

V గ్రంథాలయము తెరచియుంచుకాలమును తెలుపు బోర్డు.

VI వార్తాపత్రికల యందలి వార్తలను తెలుపుబోర్డు.

VII గ్రంథాలయమునందు జరుగు కృషిని, అభివృద్ధిని తెల్పు పట్టిక దిగువ వివరములతో వ్రాయుచుండ వలయును.

1. మాసము, 2 గ్రంథాలయమువద్ద చదువరులసంఖ్య, 3 ఇండ్లకిచ్చిన గ్రంథములసంఖ్య. 4 నెలలో జరిగిన సభల సంఖ్య, 5 సదరు సభలయందిచ్చిన ఉపన్యాసముల సంఖ్య, 6 సభ్యులసంఖ్య, 7 నూతనముగా చేర్చినగ్రంథములసంఖ్య. 8 ఆదాయము, 9 వ్యయము, 10 రిమార్కు. (దీని నకలు మాసమున కొకసారి తాలూకా కార్యదర్శికి పంపుచుండ వలయును.

మరియు గ్రంథాలయనాయకుల, దేశనాయకులయొక్క పటములను, ప్రపంచము, ఆశియాఖండము, హిందూ దేశము, ఆంధ్రరాష్ట్రము, జిల్లా, తాలూకా, గ్రామము యొక్క మ్యాపులను, గ్రంథాలయభవనములు, గ్రంథాలయసంఘములు, గ్రంథాలయ సభలయొక్క ఛాయాపటములును, సరస్వతి, చక్రవర్తి, చక్రవర్తినియొక్క పటములును, గ్రంథాలయోద్యమమునకు సంబంధించిన లెక్కలు, నీతివాక్యములు మున్నగునవియు, గ్రామజనాభా, గ్రామమందలి జననమరణములు, పశుమరణములు తెలుపు లెక్కలును, రైల్వేగైడును, పంచాంగమును, గడియారమును, గ్రామస్థులకు నిత్యజీవనమునకు ముఖ్యావసరమగు విషయములన్నియు గ్రంథాలయము నందమర్చి యుండ వలయును.

---

## ఫిలిము పుస్తకములు.

ఒక నూతనయంత్రము కనిపెట్టబడినది. ఇది వాడుకలోనికి వచ్చినయెడల ముందుముందు పుస్తకములు, పత్రికలు మొదలగువానికి ఫిలుములు తయారుచేయించి ఉంచుకొనవచ్చును. ఒకగ్రంథములోని అచ్చుపుటల నన్నిటిని కాలిపోకుండ శాశ్వతముగ మనియుండు లాగున కొలది అడుగులఫిలిముమీది కెక్కించవచ్చును. ఈ ఫిలిముపుస్తకమును యంత్రమున నెక్కించి, అందుగల తెరమీద అసలు పుస్తకముసైజున ఛాయపడునట్లు చేయవచ్చును. అక్షరములు స్పష్టముగ కనబడును. దానికి మామూలు పగటి వెలుతురు చాలును. ప్రక్కనున్న మరను త్రిప్పుచున్న యెడల పేజీ లొకటివెనుక నొకటిగ తెరమీద కనుపించుచుండును. ఇట్లు చేయుటవలన గ్రంథాలయములయందు చాల చోటు కలిసివచ్చును. న్యూయార్కు పబ్లికు లైబ్రరీలలో నుండు పుస్తకము లన్నియు ఫిలుములుగ తయారుచేసినయెడల ఒక చిన్నగదిలో ఇమడగలవని అంచనా వేయబడినది. వేయిఅడుగులఫిలుమున నూరుపుస్తకముల లోని విషయ మిముడగలదు.

## గ్రామ పరిశ్రమలప్రదర్శనము

ఇదివఱలో గ్రామపరిశ్రమల ప్రదర్శనములు ఎన్నియో జరిగినవి. మొన్న కాంగ్రెసు మహాసభతోపాటు ఫైజ్పూరులో జరిగిన ఖాదీ గ్రామపరిశ్రమల ప్రదర్శనము అన్ని విధముల ఆదర్శమే, ఫైజ్పూరు సామాన్యగ్రామము. ప్రదర్శనము జరుగుట దాని నంటియున్న పొలముమీద; ప్రదర్శనమునకు వలయు అలంకారముల చేసినవారు ఆవూరిమేదరి కమ్మరి, కుమ్మరి, వడ్రంగి మొదలగు పనివారలే. శాంతినికేతనమునుండి వచ్చిన నందలాల్ బోస్ అను కళాప్రపూర్ణుని పరిశీలనముక్రింద వెదురుతో కూర్చిన ఆ అలంకారములు తక్కువ వ్యయముతో హెచ్చుసొగసెట్లు వచ్చునో ప్రేక్షకులకు సువ్యక్తము చేసె. ప్రదర్శనమందు ప్రత్యక్షముగ చూపబడిన పరిశ్రమలన్నియు, గ్రామపురోభివృద్ధికి అవకాశములను పల్లెటూరివారిమనముల నాటు నట్లొనర్చె. ఖద్దరు, వెదురు, తాటాకు, లక్క, గుండీలు, గాజులు తేనె, కాగితము, చర్మము, ఉన్ని, పట్టు, కమ్మరము, పాలు మొదలగు పరిశ్రమలు ఎన్నియో అందు ప్రదర్శింపబడె. పల్లెటూరి వారి కనువగు పరిశ్రమలు వారి పరిసరములలో ప్రదర్శించి వారి మనముల నుత్సాహము జనింపచేయుట నిర్మాణకార్యక్రమమునకు బలముచేకూర్చుటయే. భావి ప్రదర్శనాభిలాషులు ఈవిధానమునే అనుసరింతురుగాక!

# గ్రంథాలయ వృత్తాంతములు

[తాడేపల్లి తాలూకా గ్రంథాలయసంఘమువారి వద్ద నుండి మఱి మూడు ప్రచురణములు మా కందినవి. ముందు సంచికలలో వానివివరణ ముండగలదు. శ్రీ పరచూరు వెంకటబసవకుటుంబయ్యగారు గ్రంథాలయములు రిజిష్టరీ చేయించు విధానమును గురించి వ్రాసిపంపినారు. దాని వివరములను ముందు ప్రకటింతుము. సం॥]

## ఇందిరానిలయగ్రంథాలయము, మూల్పూరు.

ది ౨౩-౧౧-౩౬ తేదీని పై గ్రంథాలయ వార్షికోత్సవము శ్రీయుత వడ్లమూడికోటయ్యచౌదరి బి.ఏ., బి. ఎల్. గారి అధ్యక్షతను చక్కగా జరిగినది. గ్రంథాలయావశ్యకతనుగూర్చి శ్రీయుతులు మతుకుమల్లి వేంకటనరసింహారావు, తుమ్మల వేంకటరామయ్య, మూల్పూరు లక్ష్మయ్య సూర్యదేవర రాఘవయ్య చౌదరిగార్లు ఉపన్యసించిరి.

## శ్రీ జాతీయబాలభారతీగ్రంథనిలయము
## కనగాల

ఈ గ్రంథాలయ తృతీయ వార్షికమహాసభ శ్రీయుత దాసు త్రివిక్రమరావుపంతులు బార్-అట్-లా గారి అధ్యక్షతను ది ౨౯-౧౧-౩౬ తేది మధ్యాహ్నం ౨ గం॥లకు జరిగెను. భారతీయ వైశ్యపత్రికా సంపాదకులగు శ్రీయుత అన్నవరపు సుబ్బారావు గుప్తగారు గ్రంథాలయ ప్రదర్శన ప్రారంభోత్సవమును జరపిరి. శ్రీ యార్లగడ్డ శ్రీకృష్ణచౌదరిగారు 'పాశ్చాత్య గ్రంథాలయోద్యమము'ను గురించియు, శ్రీ చావలి బాలసుందరరావుగారు 'గ్రంథాలయములు-గ్రామీయులు'ను గురించియు ఉపన్యసించిరి. పాటకచేరి, హరికథా కాలక్షేపము జరిగెను.

## శ్రీ రామమోహనగ్రంథాలయము,
## చినపారుపూడి.

ది ౪-౧౨-౩౬ తేదీని ఈ గ్రంథాలయము వారు మ. రా. శ్రీ కొడాలి వేంకటరామయ్యగారి అధ్యక్షతను సమావేశమైరి. కార్యనిర్వాహకులు అభివృద్ధిపత్రములును, ఆదాయవ్యయపట్టికలను చదివిరి. గ్రంథాలయము రిజష్టరీ యగుటకును, జిల్లాబోర్డువారు రు ౧౦౦-౦-౦ సాయము చేయుటకును సంతసము తెలిపిరి. దీనికి శ్రీమతి వీరమాచనేని సీతమ్మగారు పెద్దబీరువాను దానము చేసిరి.

అధ్యక్షులును, శ్రీ కోనేరు కృష్ణమూర్తిగారును గ్రంథాలయోద్యమమును గురించి ఉపన్యసించిరి.

## బందరు సబ్ జైలు ఉచితగ్రంథాలయము

ఇది సబ్ జైలులో ఖైదీల వాడుకకొఱకు మహారాజశ్రీ చవికొండ నారాయణస్వామిగారు కృష్ణాజిల్లా కలెక్టరు గారికి విన్నవించి, వారిఅనుమతిమీదను ఏర్పరచిన గ్రంథాలయము. దీనికి నీతిబోధకములగు గ్రంథములీయవలెనని ఆయన కవులను, గ్రంథమాలికాధికారులను కోరుచు, ఉదారులగు ఇతరులనుకూడ తోడ్పడ ఆంధ్రపత్రికాముఖమున ప్రార్థించినారు.

శ్రీ నారాయణస్వామిగారి ప్రయత్నము శ్లాఘనీయము; వారు కోరినట్లు కవులు మొదలగు గ్రంథములు మొదలగునవి యిచ్చి తోడ్పడి, వారిప్రయత్నము సఫలము చేయుదురు గాక.

## శ్రీరామపుస్తకభాండాగారము, తణుకు.

ది ౬-౧౨-౩౬ తేదీని పైగ్రంథాలయవార్షికోత్సవము శ్రీయుత భమిడిపాటి కామేశ్వరరావు బి. ఏ. బి. ఎల్. గారి అధ్యక్షతను చక్కగా జరిగినది. శ్రీ దర్భా యజ్ఞేశ్వర సోమయాజి బి.ఏ. ఎల్. టి. గారు నన్నయభట్టుభాషను గూర్చియు, శ్రీ పసుపులేటి రామస్వామినాయుడుగారు గ్రంథాలయావశ్యకతను గూర్చియు, శ్రీ నమ్మాళ్వార్ ఎమ్. ఏ. బి. ఈ డి. గారు వర్డ్స్‌వర్త్ కవితాశిల్పమును గూర్చియు, శ్రీ పెన్నరాజు రాజగోపాలము బి ఏ. గారు భావకవిత్వమును గూర్చియు. శ్రీ ద్రోణంరాజు చినకామేశ్వరరావుగారు సినీమాటికెట్లను గూర్చియు బాగుగా ఉపన్యసించిరి.

రాత్రి "తాజ్ మహల్" అను నాటకమునుండి కొన్ని రంగములును, "వద్దంటే పెండ్లి" అను ప్రహసనమును ప్రదర్శింపబడినవి.

## శ్రీ వేణుగోపాలగ్రంథాలయము.
### నందూరు — బాపట్లతాలూకా.

ఈ గ్రంథాలయపంచమవార్షికోత్సవము 6-12-36 తేదీని శ్రీ ఉభయభాషాప్రవీణ చింతలపూడి శేషగిరిరావుగారిఅధ్యక్షతను జరిగెను, శ్రీ ఉభయభాషాప్రవీణ తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారును, తదితర పురప్రముఖులును గ్రంథాలయోద్యమమును గుఱించి గంభీరోపన్యాసముల నొసంగిరి. గ్రంథాలయభవననిర్మాణమునకై సంఘమువారు గ్రామస్థులను సహాయమును కోరిరి.

## శ్రీ శోభనాచలపఠనమందిరము, నూజివీడు.

ది ౩-౧౨-౩౬ తేదీని పైపఠనమందిరపు ౪వ వార్షికోత్సవము శ్రీ జీడిగుంట సత్యనారాయణమూర్తిపంతులుగారి అధ్యక్షతను ఆనందదాయకముగా జరిగినది. అధ్యక్షులును, కొందఱు పెద్దలును ఉపన్యసించిరి.

## శ్రీ భారతేశ్వరీగ్రంథాలయము.

ఇది సత్తెనపల్లితాలూకాలోని వేల్పూరుగ్రామములో ది ౭-౧౨-౩౭ తేదీని గ్రామవాసులపట్టుదలచే ఏర్పడినది. దీనిఅభివృద్ధికొఱకు గ్రామస్థులు ప్రయత్నముచేయుచున్నారు.

## శారదాగ్రంథాలయము - ఉప్పాడ.

పైగ్రంథాలయపక్షమున ది ౧౩-౧౨-౩౬ తేదీని ఉప్పాడలోని అల్లకవారితోఁటలో బ్రహ్మశ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారిఅధ్యక్షతను గ్రంథాలయసభ జరిగినది. అధ్యక్షులును, ఇతరులు కొందఱును గ్రంథాలయ చరిత్రనుగూర్చియు, వాని ఆవశ్యకతనుగూర్చియు, అవి చేయవలసినపనులనుగూర్చియు, ఉపన్యసించిరి.

## ఆంధ్రవిజ్ఞానప్రకాశినీగ్రంథనిలయము,
### సూర్యాపేట, నల్లగొండజిల్లా.

పైగ్రంథాలయపక్షమునఆంధ్రతుపానునిధికిరు౪౩-౮-౦ వసూలు చేసిరి.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవవిలాసగ్రంథాలయము
### కారెంపూడి - గుంటూరుజిల్లా.

దీనికి మ. రా. రా. కర్లపాలెము హనుమంతరావు పంతులుగారధ్యక్షులుగా ఉండిరి. వారికి జబలీ అగుటచే వారిగౌరవార్థము ది ౧౯-౧౨-౩౬ తేదీని సభచేసి, వారికి అభినందన పత్రిక సమర్పించిరి. అపుడు వారు గ్రంథాలయమునకు రు ౧౧౬-౦-౦ విరాళ మొసఁగి, శాశ్వతసభ్యులుగా ఉండునట్లు మాటయిచ్చిరి. పిదప ఫోటోతీయుటయు, చిఱువిందునుజరగెను. మంగళ ధ్వనులతో సభ ముగిసినది.

## వాసవి గ్రంథాలయము, నంద్యాల.

ది ౨౭-౧౨-౩౬ తేదీని పైగ్రంథాలయము శ్రీకన్యకాపరమేశ్వరీశాలయందు శ్రీ పసుపుల సుబ్బరాయుడు శ్రేష్ఠిగారి అధ్యక్షతను జరిగిన వైశ్యసంఘవార్షికోత్సవ సమయమున స్థాపింపఁబడినది. బౌద్ధవాఙ్మయ బ్రహ్మశ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు గ్రంథాలయప్రారంభోత్సవము జరుపుచు, గ్రంథాలయావశ్యకతనుగూర్చి మహోపన్యాసమిచ్చిరి. వైశ్యసంఘనాయకులగు శ్రీ రాజా పెద్ద సుబ్బారాయుఁడుశ్రేష్ఠిగారు కృతజ్ఞతా పూర్వక వందనములతో సభముగించిరి.

## మద్రాసుగ్రంథాలయసంఘము.

1929 వ సంవత్సరములో మద్రాసుగ్రంథాలయసంఘమువారు గ్రంథాలయములందు ఉంచదగిన గ్రంథముల పట్టికలను తయారుచేసి యుండిరి. ఆపట్టికలు ఇప్పుడు అమలులో లేవు తెలుగుగ్రంథాలయములవారనేకులు కోరియుండుటచే గ్రంథాలయములందుంచదగిన తెలుగు గ్రంథములపట్టికను తయారుచేయుటకై శ్రీయుత కోరాడ రామకృష్ణయ్య, గన్నవరపు సుబ్బరామయ్య, వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రి, వి. పరబ్రహ్మశాస్త్రి, యం. రామానుజ రావునాయుడు, శ్రీమతి కవితిలక కనకమ్మగార్లతో కూడిన ఒక ప్రత్యేకసంఘ మేర్పాటు చేయబడినది.

## గ్రంథనిషేధము.

"ఇన్ ఇండియా" అను పుస్తకము జపానులోని కోబ్ భారతజాతీయకాంగ్రెస్‌కమిటీవారు ప్రచురించిరి. దాని ప్రతులు బంగాళమునకు రాగా అచ్చటిప్రభుత్వమువారు అవిఅన్నియు జప్తుచేసినట్లు గెజిట్టులో ప్రకటించిరి. అందు కొన్ని నిషిద్ధవాక్యము లుండుట ఇట్లు చేయుటకు కారణమని తెలిసెను.

ఖద్దరు సంస్థానమువారి కె. యస్. బార్టరు కంపెనీ, బెజవాడ (వస్తుమార్పిడి శాఖలో) రిజిస్టరుచేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీఁద మాపత్రిక అందఁగలదు.

మేనేజరు.
గ్రంథాలయ సర్వస్వము

# గ్రంథాలయ సర్వస్వము

## ౫—౧—౩౭

### శిక్షణనిలయము - బెజవాడ

కడచిన మాసము మా పత్రికలో ప్రకటించిన రీతిని శిక్షణనిలయమును నెలకొల్పి ఆంధ్రదేశమునకు శక్తికొలఁది సేవచేయఁగల యువకులను సమర్పించు కార్యక్రమము బెజవాడ యందు ముందుకు సాగుచున్నది. రాఁగల మాఘ మాసమున శిక్షణము ప్రారంభము కాఁగలదు. ఇదివఱకే కొన్ని దరఖాస్తులు చేరినవి. దరఖాస్తుదారులు వచ్చి చేరవలసిన తేదీలు మొదలగునవి ముందు ప్రకటితములవును. శిక్షణార్థులకు ప్రవేశపరీక్ష ఉండఁగలదని ఇదివఱలోనె వ్రాసితిమి. ఆ ప్రవేశపరీక్షయందు ముఖ్యాంశములు, వారివారిగ్రామములకును పరిసరములకు సంబంధించిన విజ్ఞానమును గుఱించినవిగా ఉండఁగలవు. తమ తమగ్రామములోనిప్రజలు, వారివృత్తులు, వ్యవసాయము, వ్యవసాయపు కష్టనష్టములు, ఆర్థికస్థితులు, గ్రామములోని పంచాయతీ, పరపతిసంఘములు, పంచాయతీకోర్టు, ఫారెస్టు పంచాయతీ, నీటివసతులు, ప్రజాగ్రాసము, పశుగ్రాసము, పరిశ్రమములు, సాంఘిక నియమములు, సాగుబడివివరములు—వీని యన్నిటికిని సంబంధించిన ప్రశ్నలకు ప్రత్యుత్తర మిచ్చుటకు అభ్యర్థులు సిద్ధపడి రావలసియుండును. కొంతవఱకైనను వక్తృత్వధోరణి కలవారుగా నుండునదియు లేనిదియు పరీక్షింపఁబడును. కాయికముగ కష్టముల కోర్చు శక్తి కలదా లేదా యనియు చూడఁబడును. ఈ విషయములన్నియును అభ్యర్థులు గుర్తించునట్లు కోరవలెనని కార్యనిర్వాహకులు మాకు తెలిపిరి. ఇది అత్యవసరము. కాఁబట్టి శిక్షణార్థు లందఱును గుర్తింతురుగాక ! యని కోరుచున్నాము.

### దేశభాషాధారకవిద్యాబోధ.

అన్నామలై విశ్వవిద్యాలయమువారు తమ 'అకడమిక్ కౌన్సిలు'వారిని - ఇతరశాఖాధికారులను సంప్రదించి, తమిళభాషలో విశ్వవిద్యాలయబోధ జరుగుటకు అవసరమైన పఠనీయ గ్రంథప్రకటనోపసంఘములను నియమింపవలసినదని ౧౯౩౦వ సంవత్సరము మార్చి ౨౮ వ తేదీని తీర్మానించిరి. ఇప్పటికి ఆఱు సంవత్సరములు మించెను. ౧౯౩౧ వ సంవత్సరములో విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక వర్గమువారు (సిండికేటు) ఈవిషయమై రిపోర్టుచేసి మొదటిమెట్టుగ గ్రంథరచయితలకు ద్రవ్యరూపమైన బహుమానము ఇచ్చువ ట్లేర్పరిచితి మనియు, ఇంటర్మీడియట్ తరగతికి పనికివచ్చునట్లుగా తర్కశాస్త్రమును గుఱించి గ్రంథములు వ్రాయింతుమనియు ప్రకటించిరి. తదాదిగ శబ్దశాస్త్రము, రసాయనశాస్త్రము, సంగీతశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము - వీనిని గుఱించి గ్రంథప్రకటనమునకు ఏర్పాట్లు జరిగినట్లు తెలిసినది. ఇటీవల ఇట్టిప్రకటనమునకిచ్చిన రు ౭౫౦ ల బహుమానసందర్భమున కొన్ని ప్రశ్నములను అడుగఁగా సరియైన ప్రత్యుత్త

రము వచ్చినది కాదు. విశ్వకళాపరిషత్తులు ఈ రీతిని కార్యక్రమము జరుపునేని దేశభాషాధారకవిద్యాబోధనము ఉపక్రమించుటకే శతాబ్దములు పట్టును ధైర్యముచేసి, పండితులను చేర్చి-ఆయావిషయములందు సమర్థులగువారిచే తమ యాజమాన్యమున గ్రంథములువ్రాయించి-ప్రకటించుటయో, లేదా ప్రత్యేకముగా వ్యాపార సంఘమును ప్రోత్సహించి, తమఅధికారమునకు లోఁబడి పనిచేయునట్లు నిర్ణయించుటయో జరిపినప్పుడుగాని, ఈసమస్య పరిష్కారము కాదు.

## గురువు అవసరమా ?

తత్త్వజ్ఞానసమాజమున అనిబిసెంటమ్మ మూలకముగా లోకమున ప్రసిద్ధులై, నేటిదినము ఆసమాజమునెడల ఎక్కువవిమర్శకదృష్టితో ప్రవర్తించుచుండు జిడ్డు కృష్ణమూర్తిగారు కడచిన ౨౬ వ తేదిని మదరాసు వసంతవిహారమునందు గురువుల యావశ్యకతనుగుఱించి మహోపన్యాసముకావించిరి. గురుపాదము ముట్టినంతనే గురుపాపములునశించి, మోక్షజ్ఞానము చేకూరునని మనవా రందురు. ఇది మిథ్య. అట్లు తరింపజేయుగురువే యున్నయెడల ఇప్పటికి లోకమున దుఃఖమే యుండరాదు. మోక్షమే నిండిపోయి యుండవలెను. అట్టిఫలము కలుగ లేదు. గురువులు గురువు లని మానవులఅజ్ఞానము నూఁతగాగొని అంధకారమును నిబిడతరము చేసి, భయమును పెంచి, లోకమును వశపఱచుకొనుటకు కొందఱకు అవకాశము చిక్కుట తప్ప, గురుత్వమున దాని కారోపింపఁబడు మహత్త్వము లేదు. ప్రతిమానవుఁడును నిర్భయముగా సుఖదుఃఖములను అనుభవించి, పోరాడి, గెల్చి, ఆనందమును పొందఁగలఁడుగాని ఇతరత్రి పొందనేరఁడు. సత్యమనునది పరివర్తనముపొందు శక్తియుతప్రత్యక్షజీవనము. ఇది మీరు కోరక తనంతట మీకు సంప్రాప్తమగును ఎల్లకాలము నవ్యదృష్టితో ప్రపంచమును తిలకించి, నానాఁటికి మహత్తర మహత్త్వము విజ్ఞానమును చూఱగొని, ప్రపంచ పరిణామమున పాల్గొనుటచే ముక్తి గలుగునుగాని గతానుగతికముగ అభ్యాసములనమర్చి, జిజ్ఞాసను చంపి, దాసత్వమాచరించుటచేత ప్రయోజనము ఉండదు. ఇది కృష్ణమూర్తి సందేశము. గురువుగానైనను తన్నుభావించి, దాసులు కావలదని అతఁ డిచ్చిన హెచ్చరిక. ఏకదేశముగ ఇందు సత్యము లే దనఁగలవా రుందురా?

## రైతుల కేమికావలెను?

ఫేజ్‌పూర్ సందలి తిలక్ నగరమున సమావేశ మయిన దేశీయ మహాసభవారు రైతు అవసరములగుఱించి బహుజాగ్రత్తగా ఆలోచించిరి. అఖిలభారతభూమికి సంబంధించిన ప్రణాళికను సిద్ధముచేయుటకు రాష్ట్రీయకాంగ్రెసు సంఘముల రిపోర్టులను ఈవిషయమున కోరియుండియు కొన్ని రానందున, తాత్కాలికముగ ఈ క్రింది అత్యవసరకార్యనిర్వహణము తప్పదని సూచించిరి.

౧. భూమిసిస్తు, భూమిగుత్తలు నేటిపరిస్థితులకు తగినట్టుగా విమర్శించి, చాల తగ్గింపవలయును.

౨. ఆర్థికముగా లాభప్రధానముగాని భూములను గుత్తపన్నుల రెంటినుండి తప్పింపవలెను.

౩. వ్యవసాయపుఆదాయముపై తక్కినఆదాయములపై వలెనె కొంత మొత్తము మినహాయింపునకుఁలోబడి క్రమాభివృద్ధిచెందఁగలపన్ను వేయవలెనేగాని భూమిసిస్తుపద్ధతిని వసూలు చేయుట పనికిరాదు.

౪. కాలువ వగైరా నీటివసతికిసంబంధించిన రేటుల చాల తగ్గింపవలెను.

౫. భూస్వాములు ఆచారముగాను ఇష్ట ప్రకారముగాను విధించుచుండు చిల్లర మామూళ్ళను, నిర్బంధ సేవయును రద్దు కావలయును. గుత్తతప్ప మరేవిధమైన ఒరువు పెట్టినను చెల్లరాదు.

౬. భూమిసాగుబడి యధికారము స్థిరముగా పరంపరాగతముగా నిర్ణయము కావలెను.

౭. పరపతి సహకారపద్ధతిని వ్యవసాయమును చేయుటకు ఉపక్రమించి ప్రోత్సహింపవలెను.

౮. గ్రామముల నణచివైచుచుండు అప్పుల బరువును తొలగింపవలెను. దీనిని గురించి విచారించుటకు ప్రత్యేకన్యాయసంఘ మేర్పడవలెను. అక్రమపుఅప్పులును రైతుశక్తికి మించినఅప్పులును రద్దుచేయవలెను. ఈలోపుగ తాత్కాలికమైన వడ్డీవసూళ్ళఆపుదల ప్రకటించుచు రైతుకు అప్పుపుట్టు ఉపాయములు కూడ చేయవలెను.

౯. బాకీగుత్తలు రద్దుకావలెను.

౧౦. ఉమ్మడిభూము లేర్పరచి, చెఱువులు, గుంటలు, బావులు, అడవులు వీనియందుగల ఉమ్మడిని ప్రజలకు ఉండదగిన హక్కుల స్థిరపరచి, వాని నెవ్వరును అతిక్రమింపకుండ చూడవలెను.

౧౧. గుత్తబాకీలు సివిల్ అప్పులవలె వసూలుచేయవలసిన దే గాని అప్పుదారుని వెడలగొట్టుటచే వసూలుచేయరాదు.

౧౨. వ్యవసాయపు కూలీలకు బ్రతుకు బత్తెము దొరకుటకును, పనిమీద కలయిబ్బందులు తొలగించుటకును, శాసననియమములు ఏర్పరుపవలెను.

౧౩. రైతుసంఘములను అర్హరీతుల నంగీకరింపవలెను.

ఈ పరిస్థితులన్నియు కలిగినయెడల రైతుకు మహోపకార మగు నని తలంచుట స్వభావసిద్ధము.

## కీర్తిశేషులైన డాక్టరు సుబ్రహ్మణ్యంగారు.

డాక్టరు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు గతమాసము ౨౩ వ తేది రాత్రి పరలోకగతులైరి. వారిపేరును వారు స్థాపించిన శ్రీసీతానగరసత్యాగ్రహాశ్రమము పేరును విననిఆంధ్రుడుండడు. వారు ఆంధ్రదేశమునకు చేసినసేవ అపారము. నాయకత్వమునకు ప్రాకులాడక నిర్మాణ కార్యక్రమమె దీక్షగా ఎంచి, మానవసేవయే మోక్షముగా తలచి, ఈరెంటిని నిర్వహించుచునుకూడ యోధుడై, రాజకీయ రణరంగమునను లాటీదెబ్బలకు జడియక నిలచిన వీరపురుషుడు. విజ్ఞానప్రాప్తికి ఆశ్రమమూలకముగా వీరు చేసిన కృషి మఱవరానిది. వీరు ౧౯౨౧ లో ద్రవ్యార్జన పథనమును వదలి, సహాయనిరాకరణోద్యమమును చేరిరి. ౧౯౨౨-30-౩౨లలో కారాగారవాసము ననుభవించిరి. ౧౯3౨లో లాటీదెబ్బలు తినిరి. క్షయరోగమునకు గురియైరి. మృత్యువువాత పడిరి. వీరియశస్సుమాత్రము దిగంతమై నిలిచినది. భార్యయు నలుగురు బిడ్డలును చుట్టములును దుఃఖము ననుభవించుటయేగాక, సర్వాంధ్రావనియు నిర్మల నిష్కళంక జీవియగు మహాసేవకుని కోల్పోయి, పరితపించుచున్నది. యువజనుల హృదయము మాత్రము ఇతనియుదాహరణమును ముందిడుకొని, నిరాడంబరజీవితపథమున ధైర్యసాహసములతో నిర్మాణ కార్యక్రమదీక్షతో పరిశ్రమచేసి, ఆంధ్రులకీర్తిని నిలువబెట్ట నుద్యోగించుట, ఈత్యాగమూర్తికి స్మారకచిహ్నముగా నెలకొల్పునుగాక! అని విశ్వసించుచున్నాము.

## పశుపోషణము

పశుపోషణముపట్ల మన రాజప్రతినిధిగారు కొంత శ్రద్ధవూనినది మొదలు వివిధ రాష్ట్రములలో కూడ ఈ సమస్యపట్ల కొంత సంచలనము కలుగుట చూడ పశుసంతతికి సుదినములు చేరువలో నున్నవనియే తలఁపవచ్చును. పశువులకు గ్రాసము సమృద్ధిగ లభింపవలెనన్న ప్రభుత్వము వారే ఎక్కువ శ్రద్ధ వహింపవలసియున్నది. దూరదృష్టిలేని రైతులు ధనకాంక్షచే పశువులకు కావలసిన గ్రాసమును సైతము లెక్కచేయక నాణెరూపకముగ లాభించుపైరులు పండించుటకే తమ యావచ్ఛక్తిని వినియోగించుచున్నారు. అడవులను సైతము ఛేదించి, సాగుభూమి క్రిందికి మార్చుచున్నారు. పచ్చికబీళ్ళుకూడ సాగుక్రిందకే చేర్చినారు. ఈ వక్రమార్గమునకెంతయు ప్రభుత్వ వ్యవసాయ విధానమే కారణమని చెప్పక తప్పదు. ఇటీవల కేంద్ర వ్యవసాయ బోర్డుయొక్క పశుపోషణశాఖవారి రెండవ సమావేశము మద్రాసులో జరిగినది. ఆసమావేశమందు మద్రాసు గవర్నరుగారగు ఎర్స్కిన్ ప్రభువు ప్రసంగించుచు ఇదివఱకు మద్రాసు రాష్ట్రములో ప్రభుత్వము పశుపోషణమున కట్టి శ్రద్ధయు తీసికొని యుండలేదని తెలిపినాడు. రాజప్రతినిధి మ్రోయించిన శంఖారావమువలన తమబాధ్యతలను ఇప్పుడిప్పుడు గ్రహింపఁగలుగుచున్నామనెను. బ్రిటిషు వారి ప్రభుత్వము భరతవర్షమున ఏర్పడి ఎంత కాలము గతించెనో, వీరి నిరాదరణమువలన పశుసంతతికి ఎన్ని ఇక్కట్లు వాటిల్లి యుండెనో, గవర్నరుగారి ప్రసంగమువలన బోధపడఁగలదు, ఇప్పుడిప్పుడు గ్రామములందు పశుగణమును శాస్త్రపద్ధతులమీఁద అభివృద్ధి చేయుటకు పశుశాఖను వ్యవసాయశాఖవారిఅధికారమునుండి జంతువైద్యశాఖవారి అధికారము క్రిందికి మార్చుటకు ప్రభుత్వమువారు ఆలోచించుచున్నారని ఆయన తెలిపినాడు. క్రొత్త పశుశాలల నేర్పఱుచుటకు ప్రవీణు నొకని ఏర్పఱిచినట్లును, స్థానిక సంస్థలకుమంచి ఆఁబోతులను సంపాదించి పోషించుటకు ద్రవ్యసహాయము చేయనెంచితిమనియు, పశువ్యాధుల నెదుర్కొనుటకు ఉపాయముల నన్వేషించుచున్నామనియు, తెలిపినాఁడు. మన రాష్ట్రమున పశువుల మేఁతకు అడవులు, పచ్చికభూములు ముఖ్యాధారము లని నేఁడు గుర్తించి వానిని కాపాడుట ముఖ్యమనియు, ఇందును గుఱించి ప్రత్యేక శ్రద్ధవహింతుమనియు, వక్కాణించినాఁడు. ఉదాసీనత లేక ఈ వాగ్దానములు కార్యరూపము తాల్చునెడల, పశుపోషణసమస్య కొంతకాలమునకైనను తేలుటకు అవకాశము ఉండఁగలదు. కేవలము మాటలతో జరుగునంతటి తేలిక సమస్య ఇది కాదు. ప్రజలును, శాసనసభలలోని ప్రజాప్రతినిధులును, గవర్నరుగారి ఉపన్యాససారాంశము అమలులోనికి వచ్చునట్లు తగు ఆందోళనము సలిపి, పశుసంతతికి మేలొనర్చెదరుగాక! అందువలన వానివలన ఇపుడు పొందుదానికంటె హెచ్చు మేలుపొందుదురుగాక!

## ఏలూరు, అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదానసమాజము 1913 సం॥రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచి నీళ్ల చలివేంద్రిలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు<br>
కొత్తమాసు సీతారామయ్యాగారు, (పోల్ట్రిస్టీలు)<br>
పనుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు)<br>
మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)<br>
నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)<br>
కందుల రామయ్యాగారు, (సెక్రిటరీ)

} శాశ్వతధర్మకర్తలలోనివారు

---

## ఏలూరు, హిందూ యువజనసంఘము

### Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజిష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందుత్తీర్ణులకు బహుమతులొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసినవి యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కావ ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)<br>
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

RSVM01A 162



Grandhalaya Sarvasvam—Registered No. M **1714**.


# ఏజంట్లు కావలె!

## ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ

మా సంఘమునకు సభ్యులు, పోషకులు మొదలగువారిని చేర్చుటకును, గ్రంథాలయ సర్వస్వమునకు ప్రకటనములు సమకూర్చుటకును, గ్రంథాలయోద్యమాభిమానులై, గంజాము—విశాఖపట్టణము—తూర్పుగోదావరి—నెల్లూరు-చిత్తూరు—కోలారు—చాందా జిల్లాలయందును, చెన్నపట్టణమందును, నిజామురాష్ట్రమున తెలంగాణమందును, శ్రద్ధతో పని చేయఁగల ఏజంట్లు కావలె. వారికి మంచి కమీషను ఇచ్చెదము.

కావున, ఏజంట్లుగా మా సంఘపక్షమున పనిచేయఁదలఁచువారు త్వరలో ఈ క్రింది చిరునామాకు తమ అర్హతలు తెలుపుచు, దరఖాస్తులు పంపుకొనవలెను.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము,
గాంధివిలాసము, గవర్నరుపేట,
బెజవాడ.



# Ellore Gosamrakshana Samithi,

## ఏలూరు గోసంరక్షణ సమితి, స్థాపితము 1918.

ది 22-9-36 న ఈ సంఘము రెజిస్టరయినది.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డి నిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [ రు 500 దాతలు ] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షికమామూళ్లుగను, నెల చందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితి అభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

| | |
|---|---|
| ఏలూరు<br>5—10—1936. | రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, ( ప్రెసిడెంటు, ట్రస్టీ. )<br>మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, ( వైస్ ప్రెసిడెంటు, ట్రస్టీ. )<br>పోలిశెట్టి గోపాలస్వామి ( సెక్రటరి, ట్రస్టీ. ) |


బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యాగారిచే ముద్రింపబడినది.

## పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A162 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 47 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |